చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



కడప, పులివెందుల్లో గొడవలకు

జగన్‌రెడ్డే కారణం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- వివరాలు 2 లో..

10న ఏపీ కేబినెట్ భేటీ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర మంత్రిమండలి సమావేశం తేదీలో స్వల్ప మార్పు జరిగింది. ముందస్తు నిర్ణయం ప్రకారం ఈ నెల 11న జరగాల్సి ఉన్న కేబినెట్ భేటీని ఒక రోజు ముందుకు జరిపి 10వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. ఇందులో రాష్ట్ర అభివృద్ధి పనులు, పలు కీలక సంక్షేమ పథకాలు, శాఖల వారీగా ఉన్న ముఖ్యమైన అంశాలపై చర్చించడంతో పాటు పలు బిల్లులకు ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్టు సమాచారం.

'మరసు' తుఫాను ప్రాథమిక నష్టం రూ.1,918 కోట్లు

1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంట పొలాలు


రాష్ట్రంలో తుఫాను నష్టంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష

నివేదిక రూపొందించి కేంద్రానికి సమర్పించాలని ఆదేశం

నేడు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటన

'మరసు' తుఫాను రాష్ట్రంలో సృష్టించిన విలయానికి రూ.1,918 కోట్ల నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. వరుస తుఫాన్లు రాష్ట్రాన్ని వణికించడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయారని... బాధితులకు ఎలాంటి కష్టం కలగకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో తుఫాను నష్టం, సహాయ చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.43 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిని 1.86 లక్షల మంది రైతులు తీవ్రంగా నష్టపోగా 8 మంది మృతి చెందారని అధికారులు సీఎంకు వివరించారు. విద్యుత్, రహదారులు, తాగునీటి వ్యవస్థలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు శుక్రవారం తాను ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తానని సీఎం చెప్పారు. మురసు తుఫాను నష్టంపై సమగ్ర నివేదిక త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు.

2



'పరిషత్' పోలింగ్ ప్రశాంతం



అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఓటేయడానికి లైనులో నిలుచున్న హోం మంత్రి అనిత



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామంలో ఓటేయడానికి బారులు తీరిన ఓటర్లు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా



రాష్ట్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని రాష్ట్ర ఎన్నికల కమిషనరు అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67.24 శాతం పోలింగ్ నమోదైందన్నారు. తాను రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ సరళిని పరిశీలించడంతో పాటు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్టు ఆయన వెల్లడించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు తమ బాధ్యతలను చక్కగా నిర్వర్తించాయని చెప్పారు. బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించామని, రిసెప్షన్ కేంద్రాల్లో అన్ని లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం వాటిని భద్రపరుస్తామని పేర్కొన్నారు.

- **ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు**
- **రాష్ట్రవ్యాప్తంగా 67.24 శాతం పోలింగ్ నమోదు**
- **స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సుల తరలింపు**
- **రేపు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన**



నిమ్మాడలో ఓటేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పూర్తయ్యింది. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 67.24 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలో మొత్తం 659 జెడ్పీటీసీ, 9,821 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. 77 జెడ్పీటీసీ, 2051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 21,012 మంది అభ్యర్థులు పోటీ చేశారు. శనివారం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. కాగా ఈ ఎన్నికల్లో వైసీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్ ఎస్ఈసీకి ఫిర్యాదు చేశారు. పులివెందులలో పెట్రోల్ బాంబులతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. సంతనూతలపాడు, సత్తెనపల్లి, చీరాల, చంద్రగిరి, పులివెందుల నియోజకవర్గాల్లో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసిందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. 15 జిల్లాల్లో 37 చిన్నపాటి ఘర్షణలు/ ఘటనలు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా కేసులను విచారించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలింగ్‌కు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడినా, నిబంధనలను ఉల్లంఘించినా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. ఎన్నికల విధుల్లో అంకితభావంతో, బాధ్యతాయుతంగా పనిచేసిన పోలీసు అధికారులు, ఇతర సిబ్బందిని డీజీపీ అభినందించారు.

'పరిషత్' ఎన్నికల్లో వైసీపీ విచ్చలవిడి డబ్బు పంపిణీ

రాయలసీమలో అల్లర్లకు ప్రధాన కారణం జగనే

బ్యాలెట్ బాక్సులు బద్దలుకొట్టి ప్రెస్ అటెన్షన్ డ్రా చేసేందుకు కుట్రలు

వైసీపీ రౌడీల దౌర్జన్యాలపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు


...వివరాలు 5లో

‘మురసు’ తుఫాను ప్రాథమిక నష్టం

రూ.1,918 కోట్లు

- **1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంట పొలాలు**
- **రాష్ట్రంలో తుఫాను నష్టంపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**
- **నేడు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటన**

అమరావతి (చైతన్యరథం): మురసు తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రూ.1,918 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. గురువారం ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మురసు తుఫాను నష్టాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల వారీగా జరిగిన నష్టాన్ని, చేపట్టిన సహాయక చర్యల వివరాలు సీఎం తెలుసుకున్నారు. వరుసగా రెండు తుఫాన్లు రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం స్వయంగా తాను తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. మురసు తుఫాను నష్టంపై సమగ్ర నివేదిక త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు తాజాగా వెల్లడించిన ప్రాథమిక నష్టం అంచనాల ప్రకారం... తుపాను కారణంగా రాష్ట్రానికి సుమారు రూ.1,918.55 కోట్ల మేర ప్రాథమిక నష్టం వాటిల్లింది. 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినగా 1,86,063 మంది రైతులపై ప్రభావం పడింది. ఉద్యానవన పంటలు 6,749 హెక్టార్లలో దెబ్బతినగా 12,586 మంది రైతులు ప్రభావితమ య్యారు. వర్షాల కారణంగా 983 ఇళ్లు, 346 బోట్లు, 220 వలలు కూడా దెబ్బతిన్నాయి. నీట మునిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు 48–72 గంటల సమయం అవసరమని అధికారులు తెలిపారు.



విద్యుత్, రహదారుల పునరుద్ధరణ చర్యలు

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ యుద్ధప్రాతిపదికన జరుగుతోందని అధికారులు వివరించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 1,103 ప్రభావిత 11కేవీ ఫీడర్లలో 871 పునరుద్ధరించినట్టు సీఎంకు తెలిపారు. మరో 232 పునరుద్ధరించాల్సి ఉందని స్పష్టం చేశారు. 3,946 దెబ్బతిన్న 11 కేవీ విద్యుత్ స్తంభాల్లో 1,493 పునరుద్ధరించారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 11 కేవీ ఫీడర్లన్నీ పునరుద్ధరించాల్సి ఉందన్నారు. ఏపీ ట్రాన్స్‌కో పరిధిలో ప్రభావితమైన 25 హైటెన్షన్ ఫీడర్లలో 21 పునరుద్ధరించారు.

ఆర్‌అండ్‌బీ పరిధిలో రాష్ట్ర, జిల్లా రహదారులు 760.10 కిలోమీటర్ల వరకు దెబ్బతిన్నాయి. 206 ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లను తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పరిధిలో 74 గ్రామీణ రహదారులు దెబ్బతినగా 204.14 కిలోమీటర్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. వీటి పునరుద్ధరణకు రూ.92.08 కోట్లు అవసరమని అంచనా వేశారు.

టెలికాం సేవలు 97 శాతం పునరుద్ధరణ

గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 31,428 టవర్లలో 30,518 టవర్లు తిరిగి పనిచేస్తున్నాయి. 97.1 శాతం సేవలను పునరుద్ధరించారు. బాపట్ల, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనే పలుచోట్ల టవర్ల పునరుద్ధరణ జరగాల్సి ఉంది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 59 మండలాలు, 649 గ్రామ పంచాయతీలు ప్రభావితం అయ్యాయి. 336చోట్ల గుర్తించిన డ్రైనేజీ అడ్డంకులన్నింటినీ తొలగించారు. పారిశుధ్య పనుల కోసం 5,515 బృందాలు, 1,489 జనరేటర్లను వినియోగిస్తున్నారు. పది వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎనిమిదింటికి రాకపోకలను పునరుద్ధరించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మరో రెండు ప్రాంతాలకు రాకపోకలను పునరుద్ధరించాల్సి ఉంది.

వరద ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ

ప్రకాశం బ్యారేజీకి 43,500 క్యూసెక్కుల వరద ప్రవాహాలు కొనసాగుతున్నాయి. ఈ నీటిని యథాతథంగా దిగువకు వదిలిపెడుతున్నారు. 70 గేట్లలో 60 గేట్లు తెరిచి ఉంచారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ ద్వారా 6,047 క్యూసెక్కుల నీరు ప్రవహి స్తోంది. తమ్మిలేరు ఇన్‌ఫ్లో 26,000 క్యూసెక్కుల నుంచి 10,200 క్యూసెక్కులకు తగ్గింది. నల్లమడ డ్రెయిన్‌లో 30,259 క్యూసెక్కుల ప్రవాహం నమో దైంది. ప్రధాన జలాశయాలు, కాలువల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తుఫాను కారణంగా బాపట్ల జిల్లాలో ఐదు, గుంటూరు జిల్లాలో రెండు, పల్నాడు జిల్లాలో ఒకరు చొప్పున... మొత్తం ఎనిమిది మంది మృతి చెందినట్టు గుర్తించారు.

వేగంగా స్పందన...సాయం

తుఫాను సహాయక చర్యల్లో 11 ఎస్‌డీఆర్ఎఫ్, 13 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు 390 మంది అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 5.87 కోట్ల ముందస్తు హెచ్చరిక సందేశాలను ప్రజలకు పంపించారు. బాధితులకు 52,768 ఆహార పొట్లాలు, 43,954 తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. 211 వైద్య శిబిరాలు నిర్వహించారు. తక్షణ సహాయక చర్యల కోసం ప్రభుత్వం జిల్లాలకు రూ.37 కోట్లు విడుదల చేసింది. దెబ్బతిన్న విద్యుత్, రహదారులు, తాగునీటి వ్యవస్థల పునరుద్ధరణతో పాటు ఇతర మౌలిక వసతుల మరమ్మతులు శరవేగంగా కొనసాగుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో పోలింగ్ అధికారి హరిత మృతి

సీఎం చంద్రబాబు విచారం

ఆమె కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా



అమరావతి (చైతన్యరథం): అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తూ అస్వస్థతకు గురైన పోలింగ్ అధికారి హరిత మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. హరిత (58) అనంతపురం జిల్లా డి.హీరాహాల్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆమె కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో శ్వాస సంబంధిత సమస్య తలెత్తడంతో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య బృందం వెంటనే ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించింది. అక్కడ అత్యవసర వైద్య చికిత్స అందించినప్పటికీ గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు ఆమె మరణించారు. హరిత మృతికి ముఖ్యమంత్రి సంతాపం తెలిపి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరిత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

హరిత టీచర్ మృతికి మంత్రి లోకేష్ సంతాపం

అమరావతి (చైతన్యరథం): ‘అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంటలో ఏపీవోగా విధులు నిర్వర్తిస్తున్న టీచర్ హరిత గౌడ్ గుండెపోటుతో కన్నుమూయడం చాలా బాధాకరం. అస్వస్థతకు గురైన వెంటనే అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేక ఆమె కన్నుమూశారు. ఆమెకు నా నివాళులు. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి’ అంటూ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

కడప, పులివెందుల్లో

గొడవలకు జగన్ రెడ్డే కారణం

- **గొడ్డలి పార్టీ అబద్ధాలు, అరాచకాలతో ఓటర్లను భయపెట్టి గెలవాలని చూస్తోంది**
- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



అమరావతి (చైతన్యరథం): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ అబద్ధాలు, అరాచకాలు, భయభ్రాంతుల ద్వారా ఓటర్లను భయపెట్టి గెలవాలని ప్రయత్నిస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చూసిన తర్వాత జగన్మోహన్ రెడ్డి గొడవలు సృష్టించి గెలవాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు. ఇందుకు నిదర్శనంగా పులివెందులలోని ఎర్రిపల్లిలో బాంబు దాడుల ద్వారా ఓటర్లను భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటు ఓటింగ్ సుమారు 22 శాతం ఉండగా... రాయలసీమ ప్రాంతాల్లో చిత్తూరు 33 శాతం, అనంతపురం 30 శాతం, కర్నూలు 30 శాతం నమోదైంది. కానీ కడపలో తక్కువ నమోదు కావడానికి వెనుక వైసీపీ, జగన్మోహన్ రెడ్డి కుట్రలే కారణం. ప్రజలు స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యబద్ధంగా బయటకు వచ్చి ఓటు వేస్తుంటే వారిని బాంబుల ద్వారా భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి.’ అని స్పష్టం చేశారు.

కడపలో ఎంపీ అవినాష్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించడం వంటి సంఘటనలు జరిగాయి. అర్బన్ లోకల్ బాడీస్‌లో కూటమికి వచ్చిన భారీ ఫలితాలు (సుమారు 95 శాతం స్ట్రైక్ రేట్) జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా పునరావృతమవుతాయనే భయంతోనే వైసీపీ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తోంది. కుప్పంలో బయట ప్రాంతాల నుంచి రౌడీలను తీసుకొచ్చి ఓట్లు వేయించే ప్రయత్నాలు, తిరుపతిలో గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లాగే ఆధార్ కార్డులు ఇచ్చి సామాన్య ఓటర్లను తీసుకొచ్చి ఓటు వేయించే ప్రయత్నాలు, రామచంద్రపురంలో ఓటర్లకు డబ్బులు పంచి బలవంతం చేసిన సంఘటనలు, పుంగనూరులో తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై దాడి, జమ్మలమడుగులో రామ సుబ్బారెడ్డి కుమారుని దౌర్జన్యం, రైల్వేకోడూరులో పెట్రోల్ బాంబు, అనంతపురం స్కూల్ వద్ద పెట్రోల్ బాంబు వంటి సంఘటనలు వైసీపీ విధానాన్ని స్పష్టం చేస్తున్నాయి. పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా బయటకు వస్తుంటే పెట్రోల్ బాంబులు వేయడం, బూత్ క్యాప్చరింగ్, బయటి ప్రాంతాల నుంచి జనాన్ని మొబిలైజ్ చేయడం వంటి దుర్మార్గపు ఆలోచనలతో వైసీపీ ముందుకు వెళ్తోంది. రాష్ట్రవ్యాప్తంగా స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతుంటే పులివెందుల, పుంగనూరు వంటి ప్రాంతాల్లోనే గొడవలు ఎందుకు జరుగుతున్నాయో ప్రజలు ఆలోచించాలి. ఇది రాజకీయమా? రౌడీయిజమా? కూటమి ప్రభుత్వం నిబద్ధతతో, ప్రజలకు అనుకూలంగా పాలన సాగిస్తోంది.’ అన్నారు.

‘అర్బన్ లోకల్ బాడీస్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా వస్తుందని ప్రజలు నమ్ముతున్నారు. అందుకే వైసీపీ అరాచకాలు, అబద్ధాలు, భయభ్రాంతుల ద్వారా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోంది. ప్రజలు అరాచకాన్ని సహించరు. రాయలసీమ ప్రజలు అసలు సహించరు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి. జగన్మోహన్ రెడ్డి దుష్ప్రచారాలు మానుకోవాలి. ప్రజల తీర్పును గౌరవించాలి. విద్వేషం, హింస ద్వారా ఓట్లు గెలవాలనుకుంటే ప్రజలు సహించరు. కూటమి ప్రభుత్వం మీద నమ్మకంతో ప్రజలు స్వేచ్ఛగా వచ్చి ఓటు వేస్తున్నారు. అదే నమ్మకాన్ని కొనసాగిస్తూ ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టుకుంటాం’ అని శ్రీనివాసరావు చెప్పారు.

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమానికి ప్రజల మద్దతు..

- **స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష విజయం ఖాయం**
- **అగర్తిపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు**



పాలకొల్లు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల అన్ని వర్గాల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు ఏకపక్షంగా మద్దతు తెలుపుతుండటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. పరిషత్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలోని తన స్వగ్రామం అగర్తిపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు భరోసా, భద్రత, నమ్మకం, విశ్వాసం ఉన్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వెంటిలేటర్‌పైకి తీసుకువచ్చి వారసత్వంగా అప్పగించిందని విమర్శించారు. అయినప్పటికీ పరిపాలనా దక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అన్న క్యాంటీన్ల వంటి సంక్షేమ పథకాల అమలుతో ప్రజల్లో ప్రభుత్వంపై సంతృప్తి పెరిగిందన్నారు.

ప్రతిపక్ష హోదా కూడా లేని వైసీపీ అధికారంలోకి వస్తే రప్పా రప్పా నరికేస్తాం అంటూ హింసాత్మక ప్రేలాపనలతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని, అలాంటి రాజకీయాలకు స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెబుతున్నారని వ్యాఖ్యానించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే కూటమి అభ్యర్థుల విజయం ఏకపక్షంగా కనిపిస్తోందన్నారు.

ఒకేసారి రెండు తుఫాన్లు విరుచుకుపడిన విపత్కర పరిస్థితుల్లో ముందస్తు చర్యలతో ప్రాణనష్టం జరగకుండా పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతంగా ఎదుర్కొన్నారని మంత్రి తెలిపారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన వరి రైతులను ఆదుకునేందుకు హెక్టారుకు రూ. 16 వేలుగా ఉన్న నష్టపరిహారాన్ని రూ. 25 వేలకు పెంచి అందించనున్నట్లు వెల్లడించారు.

వరి పంటతో పాటు కొబ్బరి, అరటి తోటలు, ఇళ్ల నష్టంపై సమగ్ర అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మత్స్యకారులు, చేనేత కార్మిక కుటుంబాలకు 50 కిలోల బియ్యంతో పాటు ఐదు రకాల నిత్యావసర సరుకులను అందిస్తున్నామన్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన ఇతర వర్గాల కుటుంబాలకు కూడా 10 కిలోల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు.

ఆత్మస్తుతి... పరనింద తప్ప ఆత్మ విమర్శలేని జగన్

- **85 శాతం హామీలు ఎగనామం పెట్టిన జగన్‌కు ఓటు ఎందుకు వేస్తారు?**
- **నవ రత్నాల్ని నవమోసాలు చేసి పేదలకు వెన్నుపోటు పొడిచింది జగనే..**
- **27 నెలల్లోనే 90% హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం**
- **అభివృద్ధి.. సంక్షేమం.. సుపరిపాలనకు పురపాలికల్లో 94% పైగా విజయాలు**
- **తమ హింస... రిగ్గింగు లక్షణాల్ని కూటమికి అంటగట్టి చెప్పిన అబద్ధమే వందసార్లు చెబుతున్న జగన్**
- **2021 స్థానిక సంస్థల హింసతో పోలిస్తే నేడు జరిగింది పిసరంతే.. దానికీ శ్రీకారం చుట్టింది రాజంపేట, కడప వైసీపీ ఎంపీలే**
- **చెదురుమదురు సంఘటనలు తప్ప ప్రశాంతంగా ఎన్నికలు**

1. బీసీ సామాజిక వర్గానికి చెందిన జింకా వెంకట నరసయ్య తన బెరైటీస్ మైన్‌లో జగన్ తాత రాజారెడ్డి కి కొంత భాగస్వామ్యం కల్పిస్తే కృతజ్ఞత లేకుండా మైన్ ఓనర్ ని హత్య చేసి ఆ మైన్ ను రాజారెడ్డి కబ్జా చేశాడు. బీసీలకు వెన్నుపోటుతోనే జగన్ కుటుంబం బెరైటీస్ గని యాజమాని అయింది.
2. కాంగ్రెస్ ని అడ్డం పెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైకాపా పార్టీని స్థాపించాడు.
3. శివకుమార్ స్థాపించిన వైకాపా పార్టీని కబ్జా చేసి శివకుమార్‌కు వెన్నుపోటు పొడిచాడు.
4. ఎత్తుకొని పెంచిన బాబాయ్‌ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచాడు.
5. ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచాడు.
6. ఐదేళ్ల పాలనలో 85శాతం హామీలకు ఎగనామం పెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు.
7. మద్యపాన నిషేధంపై మాట తప్పి, మడమ తిప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికే వెన్నుపోటు పొడిచాడు.
8. మెగా డీఎస్సీ హామీపై మాట తప్పి యువతకు వెన్నుపోటు పొడిచాడు.
9. అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదలను, కార్మికులను వెన్నుపోటు పొడిచాడు.
10. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచాడు.

కూటమి పాలన 27 నెలల్లోనే 90% హామీలు అమలు



1. మొదటి నెలలోనే రూ.4వేలు పింఛన్ పెంచి అమలు చేశాం. నెలకు రూ.2720 కోట్లు.. 27 నెలల్లోనే రూ.79 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.
2. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి... మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నాం.
3. దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటికి 5.1 కోట్ల సిలిండర్లు ఇచ్చాం. ఈ పథకం కోసం ఏడాదికి రూ.2684 కోట్లు ఖర్చు చేస్తున్నాం.



4. అధికారంలోకి రాగానే 24 వేల కి.మీ. రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టాం. ఇప్పటికి రూ.1,400 కోట్లు ఖర్చు చేసి 20 వేల కి.మీ రోడ్లు బాగుచేశాం. మళ్లీ వర్షాలు వచ్చాయి.
5. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశాం. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం కింద రూ.518 కోట్లు ఇప్పటికే అందజేశాం.
6. 273 అన్న క్యాంటీన్లు తెరిచాం.. 21 దేవాలయాల్లో నిత్య అన్నదానం ప్రారంభిస్తున్నాం.



7. చెత్త పన్ను రద్దు చేశాం. గత ప్రభుత్వం పన్ను వేసింది కానీ... 1.52 లక్షల టన్నుల చెత్త తీయకుండా వదిలేసింది.
8. ధాన్యం రైతులకు గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,700 కోట్లు విడుదల చేశాం.
9. కూటమి ప్రభుత్వంలో రూ.27 వేల కోట్లతో గ్రామ పంచాయతీల అభివృద్ధి
10. పట్టణాల అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేస్తున్నాం.
11. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 73 పథకాలు పునరుద్ధరించాం.
12. మూడు బడ్జెట్లల్లో బీసీల కోసం రూ.1.39 లక్షల కోట్లు కేటాయించాం.
13. నాయీ బ్రాహ్మణుల వేతనాలు రూ.25వేలకు పెంచాం. చేనేతలకు జీఎస్టీ ఎత్తివేశాం. పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్‌కు 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. నేతన్నకు సేవలో రూ.25 వేలు చొప్పున అందజేస్తున్నాం.
14. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయించాం.
15. స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేశాం.
16. సోలార్ విద్యుత్ పథకంలో బీసీలకు 3 కిలో వాట్లకు గాను మొత్తం రూ.98 వేలు సబ్సిడీ అందిస్తున్నాం.
17. ప్రకృతి విపత్తుల్లోనూ ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణగా నిలిచిన కూటమి ప్రభుత్వం.
18. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 40 శాతం పైగా, మహిళలకు 60 శాతం పైగా, మైనార్టీలకు 10 శాతం పైగా సీట్లు కేటాయించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన చంద్రన్న.

అధికారంలోకి వచ్చి 27 నెలల్లోనే 90శాతం హామీలు చేసిన ప్రభుత్వం మరోకటి లేదు.. సంక్షేమం-అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు..అసలైన వెన్నుపోటు దారుడు జగన్ రెడ్డి..జగన్ ముఠా దుష్ప్రచారాలు తిప్పికొట్టి అభివృద్ధి-సంక్షేమానికి ఓటర్లు పట్టం కట్టారు.





ప్రభుత్వ లాంఛనాలతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు



- అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోసిన మంత్రి నిమ్మల

పాలకొల్లు (చైతన్యరథం): పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) మృతి పట్ల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో డాక్టర్ బాబ్జి పార్థివదేహాన్ని సందర్శించిన మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొని స్వయంగా పాడె మోసి తన అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు.

డాక్టర్ బాబ్జి వైద్య రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ విశిష్ట సేవలందించి ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఆయన మరణవార్తను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు.

డాక్టర్ బాబ్జి సేవలకు తగిన గౌరవం దక్కాలనే ఉద్దేశంతో ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించేలా అప్పటికప్పుడు ప్రత్యేక అనుమతి ఉత్తర్వులు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. దీంతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ప్రముఖ వైద్యునిగా, ప్రజాప్రతినిధిగా ఆయన అందించిన సేవలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని మంత్రి నిమ్మల అన్నారు. డాక్టర్ బాబ్జి వంటి విశిష్ట వ్యక్తికి గౌరవం ఇవ్వడం అంటే మనల్ని మనం గౌరవించుకున్నట్లేనని పేర్కొన్నారు.

పరిషత్ ఎన్నికల్లో వైసీపీ మూకల దౌర్జన్యాలు

- చంద్రగిరిలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అరాచకం.. 50 మందితో బూత్‌ల్లోకి చొరబడి బరితెగింపు
- పోలింగ్‌ను అడ్డుకునేందుకు అల్లర్లు, దాడులు
- ఓటమి భయంతోనే ఓటర్లకు బెదిరింపులు
- చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు
- సొంత వార్డులో ఓటేయని జగన్, బెంగళూరు నుంచి వచ్చి ఎన్నికలను చెడగొట్టే కుట్రలు: ఎమ్మెల్యే నసీర్ అహ్మద్
- పులివెందుల చేజారిపోవడంతో జగన్‌కు మతిభ్రమించింది: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



అమరావతి (చైతన్యరథం): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు ప్రాంతాల్లో అల్లర్లు, దౌర్జన్యాలు, దాడులకు పాల్పడ్డ వైసీపీ రౌడీ మూకలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను టీడీపీ ప్రతినిధి బృందం కోరింది. పరిషత్ ఎన్నికల్లో వైసీపీ నేతలు సాగించిన అరాచకలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఏ.మల్లికార్జున, ఐజీ రాజ కుమారిలకు గురువారం తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. సంతనూతలపాడు, సత్తెన పల్లి, చీరాల, చంద్రగిరి, పులివెందుల నియోజకవర్గా ల్లో వైసీపీ నేతల అక్రమాలు, ఎన్నికల ఉల్లంఘనలపై గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్ళా మాధవి,ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌లతో కూడిన బృందం ఎస్ఈసీకి సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. చంద్రగిరి నియోజవకర్గంలోని మంగ ళంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దౌర్జన్యా లు, పులివెందులలోని పలు ప్రాంతాల్లో టీడీపీ అభ్య ర్థులపై వైసీపీ శ్రేణులు పెట్రోలు బాంబులు వేసి గూండాగిరి చేసి బెదిరింపులకు పాల్పడిన వీడియో ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఎస్ఈసీకి సమ ర్పించారు. ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు అడ్డంకు లు సృష్టిస్తున్న వైసీపీ రౌడీ మూకలపై చర్యలు తీసు కుని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని విన్నవించారు.

ఓటమి భయంతో అరాచకాలు

ఎన్నికల కమిషన్ ను కలిసిన అనంతరం మీడియాతో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తీవ్రమైన ఓటమి భయంతో అనేక ప్రాంతాల్లో అరాచకాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా, శాంతియుతంగా జరగనివ్వకుండా పోలింగ్ సరళిని దెబ్బతీస్తున్న వైఎస్సార్సీపీ నాయకుల దౌర్జన్యాలపై ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రటరీకి నేరుగా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ, పోలింగ్‌ను ప్రభావితం చేయడానికి వైఎస్సార్సీపీ నేతలు పాల్పడుతున్న అరాచకాలకు సంబంధించిన పూర్తి వీడియో ఆధారాలను ఎన్నికల సంఘం సెక్రటరీకి స్వయంగా సమర్పించాం. నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లు సృష్టిస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని అదుపులోకి తీసుకోవాలని కోరాం. రెండు రోజుల క్రితం జరిగిన పుర ఎన్నికల్లో ఘోర పరాజయం మూటగట్టుకున్న వైఎస్సార్సీపీ, ఇప్పుడు జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఓటమి ఖాయమని తేలిపోవడంతో బరితెగించింది. చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 40 నుంచి 50 మంది కార్యకర్తలను వెంటేసుకుని సప్తగిరి నగర్‌లోని మంగళం పోలింగ్ స్టేషన్‌లోకి చొరబడి దౌర్జన్యాలకు దిగారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా లెక్కచేయకుండా ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని కందులవారి అగ్రహారం, బండ్లమూడి ప్రాంతాల్లో ఓటర్లను, స్థానికులను భయపెడుతూ దాడులకు పాల్పడ్డారు. పోలీసులు డిటైన్ చేసినప్పటికీ యానం శేషారెడ్డి, పొన్నపాటి ప్రసాద్ రెడ్డి, దేవరపల్లి రామారావు, ఎన్.ఎం. నాగరాజు వంటి నేతలు యథేచ్ఛగా బయట తిరుగుతూ ఎన్నికలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కనీసం తన సొంత వార్డులో ఓటు వేసే బాధ్యత కూడా లేని ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి, బెంగళూరు నుంచి కేవలం ఎన్నికలను చెడగొట్టేందుకే పులివెందులకు వచ్చారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలే ప్రజాస్వామ్యం అన్నట్లు వ్యవహరించిన ఆయన, ఇప్పుడు ప్రజల హక్కులను కాలరాస్తూ ఆర్వో కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇతర పార్టీల ఏజెంట్లను కూర్చోబెట్టకుండా రోడ్లపై నాటకాలు ఆడుతున్నారు. గత 30 ఏళ్లుగా ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన వైఎస్ కుటుంబ పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతున్నారు. ఆనాడు ఈవీఎంలపై అసత్య ప్రచారాలు చేసి, నేడు బ్యాలెట్ పేపర్లు వచ్చినా ఓటమి భయంతో పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నారు. ఈ అరాచకాలను అరికట్టి, ప్రజలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన రక్షణ కల్పించాలని తెలుగుదేశం పార్టీ పక్షాన ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశామన్నారు.

ప్రజాస్వామ్యంపై గౌరవంలేని జగన్

గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. ఇటీవలే జరిగిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్సీపీకి గట్టిగా బుద్ధి చెప్పి, ఘోర పరాభవాన్ని మిగిల్చారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని, ఇప్పుడు అదే భయంతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ఎలాగైనా చెడగొట్టాలని వైఎస్సార్సీపీ నేతలు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఓటింగ్ శాతాన్ని తగ్గించడం, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా వైఎస్సార్సీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు అన్నీ ఏకగ్రీవాలు కావాలని కోరుకున్న జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు ఒక్కటి కూడా ఏకగ్రీవం కాకుండా అడ్డుకోవాలని పార్టీ శ్రేణులను రెచ్చగొట్టడం సిగ్గుచేటన్నారు. కనీసం తన ఓటు హక్కును కూడా వినియోగించుకోకుండా, ప్రజలను గాలికొదిలేసి పారిపోయిన జగన్మోహన్ రెడ్డికి ప్రజాస్వామ్యం అన్నా, ప్రజలన్నా ఏమాత్రం గౌరవం లేదని విమర్శించారు. చీరాల, సత్తెనపల్లి, పులివెందుల వంటి పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్సీపీ నేతలు రౌడీ మూకలతో వచ్చి ప్రజలను బెదిరిస్తున్నారని తెలిపారు. టీడీపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడుతూ అశాంతిని రేకెత్తిస్తున్నారని, కార్లలో తిరుగుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తూ ఓటర్లను మభ్యపెడుతున్నారని ఆధారాలను చూపించారు. ముఖ్యంగా పులివెందుల మున్సిపాలిటీ చేజారిపోవడంతో ఆ పార్టీ నాయకత్వం మతిభ్రమించి ఇటువంటి పిచ్చి చేష్టలకు దిగుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలు ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన జరగకుండా, పార్టీలకు అతీతంగా పూర్తి ప్రశాంత వాతావరణంలో జరగాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ చేసిన అన్యాయాలను భరించి కూడా కూటమి ప్రభుత్వం చట్టబద్ధంగా ఎన్నికలను నిర్వహిస్తుంటే, వైఎస్సార్సీపీ మాత్రం అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు సానుకూలంగా స్పందించి ఇప్పటికే పలుచోట్ల చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రజలు కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఈ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులదే ఘన విజయమని ఆమె స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ఎన్ని కుట్రలు, అఘాయిత్యాలు చేసినా ప్రజలు కూటమి పక్షానే ఉన్నారని గళ్ళా మాధవి పేర్కొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలు ప్రభుత్వ లక్ష్యం

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉంద న్నారు. ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసుకునే హక్కును ఎవరూ అడ్డుకోకూడదని స్పష్టం చేశారు. ఓటమి భయంతో ఓటర్లను భయ పెట్టడం, పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలు సృష్టించ డం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులందరిపైనా ఉందని పేర్కొన్నారు. పులివెందు లలో వైసీపీకి ఎదురైన రాజకీయ ఎదురుదెబ్బతో ఆ పార్టీ నాయకులు మరింత అసహనానికి గురవుతున్నా రని, అందుకే పరిషత్ ఎన్నికల్లోనూ ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని బుచ్చిరాం ప్రసాద్ అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛాయుత ఎన్నికల వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉందని, ఎన్నికల సంఘం కూడా ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చైతన్యరథం

పరిషత్ ఎన్నికల్లో వైసీపీ విచ్చలవిడి డబ్బు పంపిణీ

- రాయలసీమలో అల్లర్లకు ప్రధాన ముద్దాయి జగనే
- కర్రలు, పెట్రోల్ బాంబులతో పోలింగ్ బూత్‌ల్లోకి చొరబాటు
- అందరిముందే బ్యాలెట్ బాక్సులు ధ్వంసం
- వైసీపీ మూకల దౌర్జన్యాలపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు
- సెలెక్షన్‌కు, ఎలక్షన్‌కు తేడా తెలియని వ్యక్తి జగన్ అంటూ ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆగ్రహం
- ఎస్ఈసీని కలిసిన వారిలో వర్ల రామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్





అమరావతి (చైతన్యరథం): పరిషత్ ఎన్నికల్లో విచ్చలవిడిగా నగదు పంపిణీ చేయటంతో పాటు, పలు ప్రాంతాల్లో అల్లర్లు, దౌర్జన్యాలకు పాల్పడిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్ చేసింది. పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సాగించిన అరాచకాలు, హింసాత్మక ఘటనలు, విచ్చలవిడి డబ్బు పంపిణీపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు గురువారం తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రాంతాల్లో వైసీపీ గుండాలు చేసిన అరాచకాలను గుర్తించి, ఎన్నికల సంఘానికి మొత్తం 19 ఫిర్యాదులు అందజేశారు. పోలింగ్ బూతుల్లోకి కర్రలు, పెట్రోల్ బాంబులతో చొరబడి భయాందోళనలు సృష్టించారంటూ ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ లతో కూడిన బృందం ఎస్ఈసీకి సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వైసీపీ రౌడీ మూకలు పెట్రో బాంబులు విసిరి టీడీపీ అభ్యర్థులను, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. వైసీపీ నేతల సృష్టించిన అల్లర్లు, దౌర్జన్యాలకు సంబధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఎస్ఈసీకి సమర్పించారు. ఎన్నికల్లో వేళ విచ్చలవిడి డబ్బు పంపిణీ చేసిన, ఎంపీటీసీ అభ్యర్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఎన్నికల కమిషనర్ ను కలిసిన అనంతరం ఎమ్మెల్సీ వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న పరిషత్ ఎన్నికల్లో ఏదో ఒకటి చేసి పరువు కాపాడుకోవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆరాటం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. గతంలో 151 సీట్లు ఉన్నప్పుడు "వై నాట్ 175" అని విర్రవీగిన జగన్, అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాలకు పడిపోయి అహం దెబ్బతిన్నా ఇంకా తీరు మార్చుకోలేదు. మొన్నటి పట్టణ స్థానిక ఎన్నికల్లోనూ కేవలం ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలకే పరిమితమయ్యారు. ఇప్పుడు పరిషత్ ఎన్నికల్లో కూడా ఘోర పరాభవం తప్పదన్న భయంతోనే అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శించారు. పోలింగ్ ముందు రోజు రాత్రి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లకు విచ్చలవిడిగా, నీళ్లలాగా డబ్బులు పంచారు. సాధారణంగా ఓటు వేస్తారన్న నమ్మకం ఉన్నవారికే డబ్బు ఇస్తుంటారు, కానీ వీళ్లు మాత్రం ఎక్కడా లేని విధంగా అందరికీ డబ్బు పంచిపెట్టారు. ఉన్నట్టుండి ఇంత భారీగా డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఈ అక్రమ ధన ప్రవాహం వెనుక మూలాలపై విచారణ జరగాలి. రాష్ట్రంలో మాకు ఇంకా ఓటు బ్యాంకు ఉందనే భ్రమ కల్పించేందుకే కోట్ల రూపాయలు వెదజల్లారు. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రాంతాల్లో అరాచకాలను గుర్తించి, ఎన్నికల సంఘానికి మొత్తం 19 ఫిర్యాదులు అందజేశాం. పోలింగ్ బూతుల్లోకి కర్రలు, పెట్రోల్ బాంబులతో చొరబడి భయాందోళనలు సృష్టించారు. అందరి ముందే బ్యాలెట్ బాక్సులను బయటకు తెచ్చి ధ్వంసం చేశారు. శ్రీకాకుళంతో పాటు పలుచోట్ల మా ఎంపీటీసీ అభ్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడి, చొక్కాలు పట్టి లాగారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగలేదని, అరాచకం జరిగిందని చూపేందుకు ఉద్దేశపూర్వకంగానే జగన్ ముఠా ఈ దాడులు సృష్టించింది. ఎవరు ఎక్కువ అల్లర్లు, దౌర్జన్యాలు చేస్తే వారికి భవిష్యత్తులో అసెంబ్లీ సీట్లు ఇస్తామన్నట్లుగా పార్టీ నాయకులను జగన్ ప్రోత్సహించడం సిగ్గుచేటు అని వర్ల రామయ్య ఆక్షేపించారు.

జగన్ మోహన్ రెడ్డి ఈ ఎన్నికలను 'సెలెక్షన్' అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారు. ఆయనకు సెలెక్షన్ కి, ఎలక్షన్ కి తేడా తెలియకపోవడం విడ్డూరం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మంచి, సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రజలు, ఓటర్లు తమ అమూల్యమైన ఓటు వేసి వారిని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్నారు. ప్రజలు తమను తిరస్కరిస్తున్నారన్న అక్కసుతోనే జగన్ గంటల తరబడి ప్రెస్ మీట్లు పెట్టి అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారు. ఈ హింసాకాండ, అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచకాలన్నింటికీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డే ప్రధాన సూత్రధారి, ముద్దాయి. పంపిణీ చేసిన డబ్బంతా ఆయనే సమకూర్చగా, నేరాలకు పాల్పడాలని ఆయనే ప్రోత్సహించారు. ఈ కుట్రలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను, పోలీసు ఉన్నతాధికారులను గట్టిగా డిమాండ్ చేస్తున్నాం. రాబోయే పంచాయతీ, మిగిలిన పురపాలక సంస్థల ఎన్నికల్లోనైనా పద్ధతి మార్చుకుని, చేతనైతే ప్రజాబలంతో ఎన్నికల బరిలో తేల్చుకోవాలని వర్ల రామయ్య హితవు పలికారు.

ప్రజా తీర్పును గౌరవించడం జగన్ డీఎన్ఏలోనే లేదు

- విధ్వంసం, అసత్య ప్రచారం వైసీపీ నైజం
- ఓటు వేయని జగన్‌కు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదు
- రాష్ట్రవ్యాప్తంగా పారదర్శకంగా, ప్రశాంతంగా స్థానిక ఎన్నికలు
- ప్రభుత్వంపై బురదజల్లేందుకు నానా యాగీ చేస్తున్న గొడ్డలిపార్టీ
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



అమరావతి (చైతన్యరథం): జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు చూస్తే ఆత్మస్తుతి, పరనింద మాత్రమే కనిపిస్తున్నాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఎద్దేవా చేశారు. మాటలు మార్చడంలో జగన్‌ను మించినవారు ఎవరూ లేరన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా ఈవీఎంల వల్లే గెలిచారని ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజల తీర్పు అదే విధంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అందరికీ ఒకటే. పేదవాడు, ధనికుడు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి ఎవరైనా సరే అందరూ వారి ఓటుహక్కును వినియోగించుకుంటారు. కానీ బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో వచ్చి నేను ఓటు వేయడానికి వెళ్తున్నాను అని చెప్పి, పోలింగ్ బూత్ దగ్గరకు వెళ్లి ఓటు వేయకుండా వెనక్కి తిరిగి వచ్చిన ఏకైక రాజకీయ నాయకుడు జగన్మోహన్ రెడ్డి. ఇది ప్రజాస్వామ్యం పట్ల, ప్రజల ఓటు పట్ల ఆయనకు ఉన్న నమ్మకం ఏమిటో స్పష్టం చేస్తోంది. ఓటు వేయని రాజకీయ నాయకుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు. ఓటు వేయని జగన్‌కు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు వైసీపీ నానా యాగీ చేస్తోంది. 2024లో ప్రజలు ఇచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌ను మరోసారి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇచ్చారు. ఓటమిని జీర్ణించుకోలేక నిరాశతో అసత్య ఆరోపణలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు జరిగితే అద్భుతం అన్నారు. ఇప్పుడు జరిగితే దౌర్జన్యం అంటున్నారు. జగన్ హయాంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్‌ను నిర్వీర్యం చేసిన విషయాన్ని, తనకు ప్రాణహాని ఉందంటూ సాక్షాత్తూ రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్.. కేంద్రానికి లేఖ రాసిన విషయం మర్చిపోకూడదు. ఇప్పుడు కూటమి పాలనలో పారదర్శకంగా స్థానిక ఎన్నికలు జరుగుతుంటే వైసీపీ నేతలు అబద్ధాలు చెబుతూ నిరాధార విమర్శలు చేస్తున్నారు. పులివెందుల, పుంగనూరు వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా ధనబలం, కండబలంతో గుత్తాధిపత్యం సాగించిన వారు.. నేడు ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడానికి వస్తే దౌర్జన్యాలకు పాల్పడిన విషయం అందరూ చూశారని ధూళిపాళ్ల అన్నారు.

ఎంపీటీసీ స్థానాల్లో 17,726 చోట్ల వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. జెడ్పీటీసీల్లో 1,445 స్థానాల్లో వేశారు.కార్పొరేషన్ ఎన్నికల్లో 367 స్థానాల్లో వేశారు. గ్రామ పంచాయతీల్లో వేలాది స్థానాల్లో వేశారు. పోలీసు రక్షణతో, పోలీసు వాహనాల్లో అభ్యర్థులను తీసుకెళ్లి నామినేషన్లు వేయించారు.నామినేషన్ల సమయం పెంచి అవకాశం ఇచ్చారు. ఇవన్నీ చూసి కూడా ప్రభుత్వం, పోలీసులు, ఎలక్షన్ కమిషన్ కుమ్మక్కై రిగ్గింగ్ చేశారు అంటున్నారు. అయితే మీ పార్టీకి సంబంధించిన నలుగురు అభ్యర్థులు (ఒకరు మేయర్ సహా) ఎలా గెలిచారు? మీరు చెప్పినట్టు రిగ్గింగ్ ఉంటే మీ అభ్యర్థులు కూడా గెలవకూడదు కదా అని ధూళిపాళ్ల ప్రశ్నించారు.

ప్రజాతీర్పును గౌరవించండి

బీసీ రిజర్వేషన్ విషయంలో హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు కేసులు వేశారు. కానీ చట్టపరమైన అవకాశం లేకపోయినా బీసీలకు పార్టీల పరంగా ఎక్కువ సీట్లు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. స్థానిక ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడానికి డీ లిమిటేషన్, ఇతర అంశాలపై 61 కేసులు వేశారు. సుప్రీంకోర్టు కూడా ప్రజాక్షేత్రంలో తేల్చుకోండి అని చెప్పింది. ప్రజాక్షేత్రంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగాయి. ప్రజలు మీ అసత్య ప్రచారాలను నమ్మలేదు. వైసీపీ నమ్ముకున్నది విధ్వంసాన్ని. మేము నమ్ముకున్నది ప్రజలను, ప్రజాతీర్పును, అభివృద్ధిని, సంక్షేమాన్ని. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన పనులు ప్రజలు చూశారు. అందుకే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీరు నాలుగు స్థానాలకు పరిమితమయ్యారు. ప్రజల్లోకి వచ్చి పోరాడండి. ప్రజాతీర్పును గౌరవించండి. అనవసరమైన, అర్థరహితమైన ఆరోపణలు మానుకోండి. అసెంబ్లీకి రాకుండా, అప్పుడప్పుడు వచ్చి బురద చల్లి వెళ్లిపోయే ధోరణి మానేయండి. గెలుపోటాలు ప్రజలు నిర్ణయిస్తారు. ప్రజాతీర్పును అపహాస్యం చేయడం తీవ్రంగా ఖండనీయం. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం పని చేస్తూనే ఉంటుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల స్పష్టం చేశారు.

అల్లర్లు, విధ్వంసమే అజెండా!

- పరిషత్ పోలింగ్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా గొడ్డలిపార్టీ అరాచకాలు
- కళ్యాణదుర్గం ఎమ్మెల్యేపై దాడి యత్నం, గన్‌మ్యాన్‌కు గాయాలు
- ఎప్పుడూ లేనిది.. ఇప్పుడు ఓటేస్తారా అంటూ కడప జిల్లాలో పలుచోట్ల అడ్డగింత
- పలు ప్రాంతాల్లో దాడులు, దౌర్జన్యాలు
- బ్యాలెట్ బాక్సుల ధ్వంసం, సిరాపోసి బరితెగింపు
- బాధ్యులను వదలబోమని డీజీపీ హెచ్చరిక



అమరావతి (చైతన్యరథం): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పుతో తీవ్రమైన నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయిన గొడ్డలిపార్టీ.. పరిషత్ ఎన్నికలను అడ్డుకునేందుకు పలుప్రాంతాల్లో అల్లర్లకు పాల్పడింది. పుర ఎన్నికల్లో కూటమికి 60శాతానికి పైగా ఓట్లు వచ్చి ఉనికి కొల్పోవడంతో దిక్కుతోచని వైసీపీ పెద్దలు.. గొడవలు, ఘర్షణతో పరిషత్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు కుట్ర పన్ని పలు ప్రాంతాల్లో అరాచకాలకు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. పోలింగ్‌కు ఒక్క రోజు ముందు అమరావతికి వచ్చిన జగన్‌రెడ్డి గ్రామాల్లో హింసను ప్రేరేపించేలా ప్రణాళిక రూపొందించి అల్లర్లకు తెగబడాలని తమ పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కడప నుంచి శ్రీకాకుళం వరకు వివిధ ప్రాంతాల్లో కూటమి నేతలపై దాడులతో వైసీపీ మూకలు అరాచకం సృష్టించాయి. అయితే పోలీసు యంత్రాంగం ఎక్కడికక్కడ పకడ్బందీ చర్యలు తీసుకోవటంతో మొత్తం మీద ఎన్నికలు సాఫీగానే ముగిశాయి.

కడప జిల్లా పులివెందుల మండలం పార్నపల్లెలో స్వయంగా ఎంపీ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ గూండాలు దాడులకుతెగబడ్డారు. 36ఏళ్ల క్రితం పార్న పల్లెలో బాంబులతో చేసిన విధ్వంసాన్ని పునరావృతం చేస్తామంటూ బరితెగించి బెదిరింపులకు దిగారు. కొమ్మనూతలలో ఓటు వేయటానికి వెళ్తున్న గ్రామస్తులు, మహిళలను అవినాష్‌రెడ్డి అనుచరులు అడ్డుకుని బెదిరింపులకు దిగారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి పోలింగ్ కేంద్రాలకు తీసుకుని వెళ్లారు.ఎర్రిపల్లిలో ఓటర్ స్లిప్పులులాక్కుని ఓటు వేయకుండా అడ్డుకున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి అనుచరులు... పోలీసుల రాకతో పరారయ్యారు. కణంపల్లిలో పోలింగ్‌స్టేషన్‌కు వెళ్తున్న మహిళా ఓటర్లపై వైసీపీ గూండాలు రాళ్ల దాడి చేశారు. ఇన్నేళ్ళలో ఎప్పుడూ లేనిది, ఇప్పుడు ఓటు వేస్తారా అంటూ దౌర్జనానికి దిగారు. అడ్డుకోబోయిన పోలీసులపైనా దాడి చేశారు. జమ్మలమడుగు మండలం గుండ్లకుంటలో వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి రెచ్చిపోయి పోలింగ్ బూత్‌ల నుంచి టీడీపీ ఏజెంట్లను బయటకు లాగేశారు. ఆర్ తుమ్మలపల్లెలో టీడీపీ నేతలపై రాళ్లు.. సోడా బాటిళ్లతో వైసీపీ మూకలు దాడికి తెగబడ్డాయి. గోపవరం మండలం ఎస్. రామాపురం గ్రామంలో వైసీపీ రౌడీలు, రిగ్గింగ్ చేస్తున్నారంటూ మహిళలు ఆందోళనకు దిగారు. గోపవరం మండలం బ్రాహ్మణపల్లె ఎంపీటీసీ పరిధిలోని రామాపురంలోని పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సులో వైకాపా వర్గీయులు సిరా పోశారు. బ్రాహ్మణపల్లి ఎంపీటీసీగా పోటీ చేస్తున్న కలువాయి వెంకటసుబ్బమ్మ భర్త నర్సారెడ్డి.. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి కుమారుడు ఆదిత్య రెడ్డితో కలిసి ఓటు వేసే నెపంతో పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించారు. సిబ్బంది ఓటును పరిశీలించే లోపలే.. అక్కడున్న సిరా బాటిల్ తీసుకొని బ్యాలెట్ బాక్సులో పోయడంతో పోలింగ్ సిబ్బంది కంగారుపడ్డారు. అక్కడి సిబ్బందిని నర్సారెడ్డి దుర్భాషలాడుతూ నానా హంగామా సృష్టించారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని బయటకు తీసురాగా..అక్కడి నుంచి ఇద్దరూ పరారయ్యారు. పోలింగ్ బూత్ పీవో విజయలక్ష్మి ఈ ఘటనపై బద్వేల్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నందలూరులో దొంగ ఓట్లు వేయటానికి టాక్సీలలో, వైసీపీ తెచ్చిన దొంగ ఓటర్లను పట్టుకున్న మహిళలు చితకబాదారు. తిరుపతి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నుంచి కడప జిల్లాకు పెద్దఎత్తున వచ్చిన రౌడీల వాహనాలను అడ్డుకున్న స్థానికులు వారిని పోలీసులకు అప్పజెప్పారు.

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఠా తమిళనాడు నుంచి టూరిస్ట్ బస్సుల్లో నకిలీ ఓటర్లను రప్పించింది. టీడీపీ ఏజెంట్లు ప్రశ్నించటంతో వారంతా పరారయ్యారు. పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లెలో పెద్దిరెడ్డి కిరాయి గుండాలు బరితెగించి పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ ఏజెంట్లపై పెట్రోల్ బాంబులతో దాడి చేయటంతో పలువురు టీడీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలకు గాయాలయ్యాయి. నలిపిరెడ్డి పల్లి పంచాయతీ, ఎర్రబల్లి గ్రామంలో బూత్ క్యాప్చరింగ్‌కి వచ్చిన వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు.

కుప్పం నియోజకవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. కుప్పం మండలం నడుమూరు పోలింగ్ కేంద్రంలో వైసీపీ మూకల దాడిలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థి గాయపడ్డారు. శాంతిపురం మండలంలోనూ అదే పరిస్థితిని వైసీపీ శ్రేణులు కొనసాగించాయి. శాంతిపురం మండలం కడపల్లి గ్రామంలో ఫ్యాన్ పార్టీ శ్రేణులు వీరంగం సృష్టించాయి ఆ పార్టీ శ్రేణులు రోడ్డుపైకి బేఖాయించటంతో రెండు కిలో మీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. అల్లరి మూకలను చెదరగొడుతున్న క్రమంలో పోలీసులపైకి వైసీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి దూసుకువచ్చాడు.

అనంతపురంజిల్లాలోనూ గొడ్డలిపార్టీ శ్రేణులు రెచ్చిపోయారు.కళ్యాణదుర్గం ఎమ్మెల్యేపై వైసీపీ గూండాలు దాడిచేశారు.కుందుర్పి మండలం బెస్తరపల్లిలో వైకాపా నేతలు తమను ఓటు వేయనివ్వకుండా బెదిరిస్తున్నారంటూ కొందరు మహిళలు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పోలింగ్‌కేంద్రం వద్దకు వెళ్లారు. ఆ విషయం తెలుసుకుని వైకాపా నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేపై దాడికి యత్నించగా.. అడ్డుకున్న గన్‌మ్యాన్‌కు తీవ్రగాయాలు కావటంతో ఆస్పత్రికి తరలించారు.

జిల్లాలోని బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లిలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి పాలబండ్ల శ్రీరాములును వైసీపీ నేతలు అడ్డుకోవడంతో మొదలైన గొడవ... ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. అల్లరి మూకల దాడిలో టీడీపీ అభ్యర్థి సోదరుడు తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు శెట్టూరు మండలం చింతర్లపల్లి ఎంపీటీసీ అభ్యర్థి చెన్నకేశవ సోదరుడిపై వైసీపీ గుండాలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. దీంతో గాయపడిన వ్యక్తిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రాప్తాడు మండలం భోగినేనిపల్లిలో పోలింగ్ కేంద్రంలోకి అక్రమంగా చొరబడటానికి ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని విధులు నిర్వహిస్తున్న పోలీసులు అడ్డుకుంటే.. వారిపైనే బెదిరింపులకు దిగారు. కూడేరు మండలం మరుట్ల సెకండ్ కాలనీలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను వైసీపీ నాయకులు బయటకు తీసుకొచ్చి పడేయటంతో పోలింగ్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది.అడ్డుకున్న పోలీసులపైనా దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి.

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి అరాచకం సృష్టించారు. తాళ్లూరు మండలం కొర్రపాటి వారి పాలెం గ్రామంలో ఎస్సీ కాలనీ కి చెందిన ఓటర్లను ఓటు వెయ్యకుండా రిగ్గింగ్ జరపటంతో అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులు ధర్నాకు దిగారు.

మార్కాపురం జిల్లా కనిగిరి మండలం లింగారెడ్డి పల్లి గ్రామంలో రిగ్గింగ్‌ను అడ్డుకున్నారనే ఆగ్రహంతో పోలింగ్ ఆఫీసర్ ను బయటకు లాగి వైసీపీ మైకులు దాడి చేశాయి.

ప్రశాంతంగా ఉన్న ఉత్తరాంధ్రలోనూ వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. విజయనగరం జిల్లా గరివిడిలో జనసేన మహిళా నాయకురాలిపై బొత్స సత్య నారాయణ అనుచరులు దాడి చేశారు. మన్యం జిల్లా చిలకలపల్లిలో టీడీపీ నేతలపై పార్వతీపురం వైసీపీ ఇన్‌ఛార్జ్ జోగారావు నేతృత్వంలో దాడిజరిగింది. ఓటిపి భయంతో బ్యాలెట్ బాక్స్‌లను వైసీపీ నాయకులు బయటకు తెచ్చి పడేశారు. పార్వతీపురంలో గూండాలను వెంటబెట్టుకుని పోలింగ్ బూత్‌కు వచ్చిన జోగారావు.. అరాచకాన్ని వీడియో తీస్తున్న టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిపై తన రౌడీలతో కలిసి దాడికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

40 ఏళ్ల ఏకగ్రీవాలకు తెర

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామంలో 40 ఏళ్లుగా కొనసాగుతున్న ఏకగ్రీవ ఎన్నికల సంప్రదాయానికి ఈసారి బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వ హయాంలో తొలిసారిగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. ఎర్రకోట, కడిమెట్ల గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ప్రభావం ఉన్న ప్రాంతంలో నాలుగు దశాబ్దాల ఏకగ్రీవ ఎన్నికల సంప్రదాయానికి తెరపడటంతో ఈసారి ప్రజలు ఎలాంటి తీర్పు ఇవ్వబోతున్నారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

అల్లర్ల నిందితులపై కఠిన చర్యలు: డీజీపీ

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సులు ఉంచే స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో అంకితభావంతో పని చేసిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. పరిషత్ ఎన్నికల సందర్భంగా 15 జిల్లాల పరిధిలో 37 ఘటనలు జరిగినట్లు చెప్పారు. పోలింగ్, శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. పరిషత్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు.

విపత్తు సమయంలో అండగా..

- కూటమి కౌన్సిలర్లతో కలిసి తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందజేసిన మంత్రి కందుల దుర్గేష్
- నిడదవోలులో పునరావాస కేంద్రాల సందర్శన



నిడదవోలు (చైతన్యరథం): వరుసగా సంభవించిన అర్నబ్,మురసు తుఫాన్ల ధాటికి నిడదవోలు నియోజకవర్గం తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని పునరావాస కేంద్రాలను గురువారం సందర్శించిన మంత్రి దుర్గేష్ తుఫాన్ బాధితులను పరామర్శించి వారికి నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి కౌన్సిలర్ల చేతుల మీదుగా సుమారు 100మంది బాధితులకు ఈసహాయాన్ని అందించారు.


ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ... అర్నబ్ తుఫాన్ వల్ల పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందుల్లో పడగా.. ఊహించని రీతిలో వచ్చిన మురసు తుఫాన్ పట్టణాన్ని ముంచెత్తిందన్నారు.ఈదురుగాలులు, భారీ వర్షాల వల్ల నిడదవోలు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగి జనజీవనం పూర్తిగా స్తంభించిపోయిందని తెలిపారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం స్థానిక డొక్కా సీతమ్మ పాఠశాల, ఎన్టీఆర్ పాఠశాలల్లో అధికారుల సమర్థవంతమైన నిర్వహణలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. బాధితులకు మున్సిపల్‌సిబ్బందిద్వారా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

వర్షాలు తగ్గినతర్వాత బాధితులు ఇళ్లకు వెళ్లే సమయానికి ఇంట్లోని వస్తువులన్నీ దెబ్బతిన్న విషయాన్ని గుర్తించి, వారు నాలుగైదు రోజులకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు 5 కేజీల బియ్యం, కేజీ నూనె, కేజీ పంచదార, కూరగాయలను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. గతంలో కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజారోగ్యాన్ని కాపాడిన పారిశుద్ధ్య కార్మికులు,నేడు ఈ వరదల వల్ల లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారని, పార్టీలకతీతంగా వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి బాధితులు అందజేసిన విజ్ఞప్తులపై స్పందిస్తూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు ముగిసిన వెంటనే పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన 28 మంది కూటమి అభ్యర్థులు, ప్రమాణస్వీకారం చేయక ముందే ఇటువంటి ప్రజా సేవా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇది రాబోయే రోజుల్లో ప్రజాసేవ చేయడానికి మంచి అంకురార్పణగా అభివర్ణించారు. పునరావాస కేంద్రాల్లో కల్పించిన వసతులు, అందుతున్న సహాయం పట్ల బాధితులు సంతృప్తి వ్యక్తం చేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ఓటు బ్యాంకుకు బీటలు..

వైసీపీలో గుబులు!



- పట్టణ ఓటరులో మారిన రాజకీయ ఆలోచన
- కూటమికి 60.34శాతం ఓట్లు
- 34.30 శాతానికే పరిమితమైన వైసీపీ
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత మరింత క్షీణించిన ఆదరణ
- కీలక కార్పొరేషన్లలోనూ తగ్గిన బలం
- జగన్‌కు పెరుగుతున్న రాజకీయ సవాళ్లు

కరెంట్ అనాలిసిస్

తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

జమ్ము సాయి కల్యాణ్, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్

ఒకప్పుడు తమకు తిరుగులేదని, తమ ఓటు బ్యాంకుకు ఢోకా లేదని ధీమా వ్యక్తం చేసిన వైసీపీకి తాజా మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు గట్టి హెచ్చరిక పంపించాయి. ఎన్నికల్లో నమోదైన ఓట్ల సరళిని చూస్తే వైసీపీ రాజకీయ పునాదులు క్రమంగా బలహీనపడుతున్నాయనే విషయం స్పష్టమవుతోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఆ పార్టీకి ఉన్న ఆదరణ గణనీయంగా తగ్గడం రాజకీయంగా ఆసక్తికర పరిణామం. అధికారం కోల్పోయిన తర్వాత కూడా ప్రజల్లో తమపై అభిమానం చెక్కుచెదరలేదని భావించిన వైసీపీ నాయకత్వానికి ఈ ఫలితాలు వాస్తవ పరిస్థితిని గుర్తు చేస్తున్నాయి. మాటలు కోటలు దాటినా.. ఓట్లు మాత్రం ప్రజల మనసులో ఏముందో చెబుతాయి. తాజా గణాంకాలు కూడా అదే విషయాన్ని చాటుతున్నాయి.

ఓట్ల లెక్కలోనే కనిపిస్తున్న ప్రజాభిప్రాయం

ఏపీలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పోలైన చెల్లుబాటు ఓట్లను పరిశీలిస్తే ఎన్డీఏ కూటమి స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొత్తం ఓట్లలో కూటమి ఏకంగా 60.34 శాతం ఓట్లను సాధించి తన బలాన్ని నిరూపించుకుంది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కేవలం 34.30 శాతం ఓట్లకే పరిమితమైంది. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న వ్యత్యాసం సాధారణమైనది కాదు. దాదాపు 26 శాతం ఓట్ల అంతరం కనిపిస్తుండటం రాజకీయంగా గమనించాల్సిన అంశం. ఇది కేవలం కొన్ని స్థానాల్లో వచ్చిన జయాపజయాల లెక్క కాదు. పట్టణ ఓటరు ఎటువైపు నిలుస్తున్నాడో తెలియజేసే రాజకీయ సంకేతం. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత వైసీపీ తన పరిస్థితిని చక్కదిద్దుకుని తిరిగి పుంజుకుంటుందని ఆ పార్టీ శ్రేణులు ఆశించాయి. ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజల్లోకి వెళ్తే తమకు మళ్లీ ఆదరణ పెరుగుతుందని భావించాయి. కానీ తాజా ఎన్నికల గణాంకాలు ఆ అంచనాలకు భిన్నమైన చిత్రాన్ని చూపిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ఏర్పడిన రాజకీయ బలం, అధికారం కోల్పోయిన తర్వాత కూడా అదే స్థాయిలో కొనసాగుతుందని అనుకోవడం పొరపాటేనని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి. ప్రజల తీర్పును అర్థం చేసుకుని లోపాలను సరిదిద్దుకోవాల్సిన సమయంలో విమర్శలకే పరిమితమైతే రాజకీయంగా మరింత నష్టపోవాల్సి వస్తుంది.

తిరుపతిలో కూటమి జైత్రయాత్ర.. అనంతపురంలోనూ వైసీపీకి గట్టి పోటీ

కార్పొరేషన్ల వారీగా ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. తిరుపతిలో ఏకంగా 71.45 శాతం ఓట్లను సాధించడం కూటమి సాధించిన ఘనమైన విజయంగా చెప్పుకోవచ్చు. అక్కడ వైసీపీ ఓట్ల శాతం కేవలం 25.10కి పడిపోయింది. ఒకప్పుడు బలమైన రాజకీయ స్థావరాలుగా భావించిన ప్రాంతాల్లోనూ ఓటరు వైఖరి మారుతోందనడానికి ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయి. తిరుపతిలో వచ్చిన ఫలితం కూటమికి రాజకీయంగా కొత్త ఉత్సాహాన్ని ఇస్తే, వైసీపీకి మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది. ఇక కూటమికి అత్యల్పంగా ఓట్లు వచ్చిన అనంతపురంలోనూ 43.65 శాతం ఓట్లను సాధించింది. అదే సమయంలో అక్కడ వైసీపీ 48.29 శాతం ఓట్లతో అత్యధికత సాధించింది. అయితే ఒక్క అనంతపురంలో వచ్చిన ఈ ఆధిక్యాన్ని చూపించి రాష్ట్రవ్యాప్తంగా తమకు ఆదరణ ఉందని వైసీపీ చెప్పుకోలేని పరిస్థితి. ఎందుకంటే మిగిలిన కార్పొరేషన్లలో నమోదైన ఓట్ల శాతం మరో కథ చెబుతోంది. ఒకటి రెండు ప్రాంతాల్లో నిలదొక్కుకున్నంత మాత్రాన రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పునాదులు బలంగా ఉన్నట్లు కాదు. మొత్తం ఫలితాలను కలిపి చూసినప్పుడే ప్రజాభిప్రాయంలో వచ్చిన మార్పు అర్థమవుతుంది.

కీలక నగరాల్లోనూ తగ్గిన వైసీపీ ప్రభావం

విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కడప వంటి కీలక కార్పొరేషన్లలో వైసీపీ ఓట్ల శాతం గణనీయంగా తగ్గడం ఆ పార్టీకి మరో ఆందోళనకర పరిణామం. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల ఆలోచనా విధానం, అభివృద్ధిపై వారి అంచనాలు, పాలనపై వారి అభిప్రాయాలు ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబిస్తాయి. ఆయా నగరాల్లో వైసీపీకి ఆశించిన స్థాయిలో ఓట్లు రాకపోవడం వెనుక అనేక రాజకీయ, పాలనాపరమైన అంశాలు ఉండవచ్చు. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ ఓటరును ఆకట్టుకోవడంలో వైసీపీ వెనుకబడుతోంది. పట్టణ ప్రాంతాల్లో రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. కేవలం రాజకీయ విమర్శలతోనే ప్రజల ఆదరణను తిరిగి సంపాదించలేరు. తమ ప్రాంతానికి ఏం కావాలి? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? వాటికి ఎవరు పరిష్కారం చూపగలరు? అనే అంశాల ఆధారంగానే పట్టణ ఓటరు తన నిర్ణయం తీసుకుంటాడు. ఈ నేపథ్యంలో కూటమికి వచ్చిన 60.34 శాతం ఓట్లు పట్టణ ప్రజల్లో ఆ కూటమిపై ఏర్పడిన సానుకూలతకు రాజకీయ బలాన్ని ఇస్తున్నాయి.

ఓటమి నుంచి పాఠం నేర్చుకోని వైసీపీ

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కానీ ఓటమి తర్వాత కూడా తప్పులను గుర్తించకపోవడం, ప్రజల మనోభావాలను అర్థం చేసుకోకపోవడం ఏ పార్టీకైనా ప్రమాదకరమే. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ తన రాజకీయ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా కార్యాచరణ కనిపించలేదు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేయడం, ప్రజలకు చేరువ కావడం, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపడం వంటి చర్యలపై దృష్టి పెట్టాల్సి ఉంది. కానీ నాయకత్వం నుంచి వస్తున్న రాజకీయ సందేశాలు ప్రజల్లో ఎంతవరకు ప్రభావం చూపుతున్నాయన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలు ఒకసారి తీర్పు ఇచ్చిన తర్వాత ఆ తీర్పును గౌరవించి, తమ పనితీరును మెరుగుపరుచుకోవడం ప్రతిపక్ష బాధ్యత. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో అవసరమే. అయితే ప్రతి అంశాన్నీ రాజకీయ విమర్శలకే పరిమితం చేస్తే ప్రజలు వాటిని ఎంతవరకు స్వీకరిస్తారన్నది కూడా ఆలోచించాలి. ప్రజలకు కావాల్సింది కేవలం ఆరోపణలు, ప్రత్యారోపణలు కాదు. తమ సమస్యలపై స్పందించే నాయకత్వం, అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ. ఈ ప్రాథమిక అంశాలను విస్మరిస్తే ఓటు బ్యాంకు మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది.

కూటమికి పెరిగిన బాధ్యత.. వైసీపీకి ఆత్మపరిశీలన సమయం

తాజా ఫలితాలు కూటమికి విజయోత్సాహాన్ని ఇచ్చినప్పటికీ, అదే సమయంలో బాధ్యతను కూడా పెంచాయి. ప్రజలు ఇచ్చిన మద్దతును నిలబెట్టుకోవాలంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం, పట్టణ సమస్యలకు పరిష్కారం చూపడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం అవసరం. 60.34శాతం ఓట్లు సాధించామనే ధీమాతోనే సరిపెట్టుకుంటే కుదరదు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని పాలనలో ప్రతిబింబించాలి. ఓటరుఇచ్చిన అధిక్యం పాలకులకు ప్రశంస మాత్రమే కాదు.. మరింత మెరుగైన పనితీరును ఆశిస్తున్నాడనే సంకేతం కూడా. మరోవైపు వైసీపీకి ఈ ఫలితాలు సాధారణ రాజకీయ ఎదురుదెబ్బగా తీసుకునే అంశాలు కావు. 34.30శాతం ఓట్లతో సరిపెట్టుకోవడం, కీలక నగరాల్లోనూ ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోవడం ఆ పార్టీ భవిష్యత్ రాజకీయాలకు సవాలుగా మారే అవకాశం ఉంది. పార్టీ నాయకత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను అంగీకరించి, క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలను పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఒక ఎన్నికలో వచ్చిన ఎదురుదెబ్బ మరో ఎన్నికలోనూ పునరావృతమయ్యే ప్రమాదం ఉంటుంది.

ప్రజల తీర్పే అంతిమం

మొత్తానికి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఓట్ల శాతం ఏపీ రాజకీయాల్లో మారుతున్న సమీకరణాలను స్పష్టం చేస్తోంది. ఒకవైపు 60.34 శాతం ఓట్లతో ఎన్డీఏ కూటమి తన ఆధిపత్యాన్ని చాటుకుంటే, మరోవైపు 34.30శాతానికే పరిమితమైన వైసీపీ తన రాజకీయ బలాన్ని తిరిగి నిరూపించుకోవాల్సిన పరిస్థితిలో పడింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వచ్చిన ఫలితాలు ఆ పార్టీకి హెచ్చరిక గంటలు మోగిస్తున్నాయి. రాజకీయాల్లో ప్రజల జ్ఞాపకశక్తి తక్కువని, ఎన్నికల సమయానికి పరిస్థితులు మారిపోతాయని అనుకోవడం నాయకుల పొరపాటు. ప్రజలు తమ అనుభవాల ఆధారంగానే తీర్పు ఇస్తారు. ఆ తీర్పును మాటలతో మార్చలేరు.. చేతలతోనే మార్చుకోవాలి. తాజా ఎన్నికల్లో వైసీపీకి ఎదురైన పరిస్థితి కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తోంది. అధికారం ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోకపోతే, అధికారం లేనప్పుడు ప్రజలు పట్టించుకోరన్న రాజకీయ వాస్తవాన్ని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ఓటు బ్యాంకు అనేది శాశ్వత ఆస్తి కాదు.. ప్రజల నమ్మకమే ఏ రాజకీయ పార్టీకైనా అసలైన బలం!

ఇద్దరు అహంకారులకు శృంగభంగం!

అధికారం శాశ్వతం కాదని, అది ప్రజలు ఇచ్చిన బాధ్యత మాత్రమేనని గ్రహించని నాయకులకు ప్రజాక్షేత్రంలో ఎప్పుడైనా తగిన శాస్తి జరుగుతుంది. సరిగ్గా ఇదే కోణంలో అమెరికా, ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాలను చూడాలి. అమెరికాలో, ఆంధ్రలో ఒకేసారి జరిగిన ఎన్నికల పరిణామాలు రెండు వేర్వేరు ప్రాంతాలైనా, పాలకుల అహంకారానికి వ్యతిరేకంగా ప్రజలు ఏకమై ఇచ్చిన తీర్పు మాత్రం ఒకేలా ఉందని ఈ తీర్పు అద్దం పడుతుంది. అమెరికాలో తాను తప్ప మరెవ్వరూ ఉండకూడదని అక్కడ ట్రంప్.. మా వర్గం, నేను తప్ప మరెవ్వరూ రాష్ట్రంలో ఉండకూడదని ఇక్కడ జగన్ రెడ్డి అరాచకాలు సృష్టించారు. ఇదే భావనతో ఈ ఇద్దరు నాయకులు వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని సర్వనాశనం చేశారు. అమెరికాలో రిపబ్లికన్లకు కంచుకోటలుగా ఉన్న చోట్ల కూడా ఘోరమైన ఎదురుదెబ్బలు తగిలినట్లే, ఇక్కడ తరతరాలుగా కంచుకోటలుగా ఉన్న కడప, పులివెందులలో కూడా అదే స్థాయిలో ప్రజలు చావు దెబ్బతీశారు. ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక, అమెరికాలో ట్రంప్ బొంకుతూ రిగ్గింగ్ జరిగిందని సర్దుకోచూసినట్లే, ఇక్కడ కూడా జగన్ తన పరాజయాన్ని ఒప్పుకోలేక వివిధ కుంటిసాకులు వెతుకుతున్నారు. పిచ్చి వాళ్ళ చేతికి అధికారం ఇస్తే పాలన ఎట్లా ఉంటుందో చూపించిన ఈ ఇద్దరు నాయకులు.. తమ చేతిలో అధికారం ఉందనే మదంతో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, రాష్ట్రాన్ని, ప్రపంచాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా సాగిన పాలనకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు చరమగీతం పాడారు. అధికార గర్వం తలకెక్కి తనకు ఎదురు లేదని విర్రవీగిన వారికి తెలుగు ప్రజలు, అటు అమెరికా ప్రజలు కలిసి అద్భుతమైన రీతిలో పరాభవాన్ని మిగిల్చారు.

ప్రజాస్వామ్యంలో ఎంతటి శక్తిమంతుడైనా ప్రజల ముందు తలవంచాల్సిందే. అమెరికాలో ట్రంప్‌కు ఎదురుదెబ్బ.. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు కోలుకోలేని రాజకీయ దెబ్బ. ప్రజాస్వామ్య శక్తిని చాటిన ప్రజలు. అధికార పీఠంపై కూర్చున్నంత మాత్రాన ప్రజల నాడిని శాసించగలమని, వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించవచ్చని భావించే వారికి ప్రజలు తమ ఓటుతోనే గట్టి సమాధానం చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశంగా పేరొందిన అమెరికా అయినా, ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచిన భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ అయినా ప్రజల తీర్పు ముందు అందరూ సమానమే. అహంకారం ఎంత ఎత్తుకు ఎదిగినా ప్రజల ఆగ్రహం ముందు కుప్పకూలక తప్పదు. అధికార బలంతో ప్రత్యర్థులను అణచివేయ వచ్చేమో కానీ ప్రజల మనసులను గెలుచు కోలేమని రెండు ప్రాంతాల్లో వెలువడిన ఎన్నికల ఫలితాలు మరోసారి నిరూపించాయి. ఒకవైపు అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ, మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో జగన్ నేతృత్వంలోని వైసీపీకి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోర పరాభవం. ఈ రెండు పరిణామాలు ప్రజాస్వామ్య చరిత్రలో ఒకే సందేశాన్ని వినిపిస్తున్నాయి. ప్రజల సహనాన్ని చేతగానితనంగా భావిస్తే, ప్రజల తీర్పు రాజకీయ భవిష్యత్తునే మార్చేస్తుంది.

అమెరికా రాజకీయాల్లో 2026 నవంబర్ 3న జరిగిన మధ్యంతర ఎన్నికలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పెద్ద రాజకీయ సవాలుగా మారాయి. అమెరికా కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌పై కూడా డెమొక్రాట్లు ఆధిపత్యం సాధించడం రిపబ్లికన్లకు గట్టి ఎదురుదెబ్బ. ముఖ్యంగా ట్రంప్ పాలనా విధానాలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి ఈ ఫలితాల్లో ప్రతిబింబించిందని అంతర్జాతీయ మీడియా విశ్లేషించింది. ద్రవ్యోల్బణం, జీవన వ్యయం, యుద్ధ పరిణామాలు, ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి ఎన్నికలపై ప్రభావం చూపాయి. అమెరికాలో అధ్యక్షుడిని ఎన్నుకునే ఎన్నికలు వేరు. మధ్యంతర ఎన్నికలు వేరు. అధ్యక్షుడి పదవీకాలం మధ్యలో జరిగే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సభ్యులను ఎన్నుకోవటం ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అందుకే ఈ ఫలితాలు ట్రంప్‌కు ప్రజల నుంచి వచ్చిన రాజకీయ హెచ్చరికగా భావించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ నవంబర్ 1న జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు నవంబర్ 3న వెలువడ్డాయి. అధికార కూటమి ఘన విజయాన్ని సాధించగా, వైసీపీ అనేక ప్రాంతాల్లో తీవ్ర పరాజయాన్ని చవిచూసింది. ముఖ్యంగా జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో టీడీపీ అభ్యర్థి తుగుట్ల గీతాకుమారి సుమారు 13,875 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం వైసీపీకి గట్టి రాజకీయ షాక్. కుప్పంలో 32కు 32 వార్డులు, మాచర్లలో 36కు 36 వార్డులను కూటమి గెలుచుకోవడం ఈ ఫలితాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రెండు దేశాల్లో ఎన్నికల స్వరూపం వేరు. రాజకీయ పరిస్థితులు వేరు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు ఎంత కీలకమో ఈ పరిణామాలు చాటుతున్నాయి.

ప్రజలు ఓటు వేసేది ఐదేళ్లు తమను భాధ్యతగా పాలిస్తారని, తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తారని, తమ హక్కులను కాపాడతారని, తమ జీవితాల్లో మార్పు తీసుకురావాలని. కానీ అధికారంలోకి వచ్చిన నాయకుడు బాధ్యతను మరిచి తన మాటే శాసనం, తన నిర్ణయమే రాజ్యాంగం, తనకు నచ్చనివారికి ఈ దేశంలోనో రాష్ట్రంలోనో స్థానం లేదన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు ఎన్నాళ్లు సహిస్తారు? ట్రంప్ విధానాలపై అమెరికాలో వ్యక్తమైన అసంతృప్తి, జగన్ పాలనపై ఆంధ్రప్రదేశ్‌లో వెలువడిన వ్యతిరేక తీర్పు ప్రజాస్వామ్య సత్యాన్ని గుర్తుచేస్తున్నది. అమెరికా వంటి దేశంలో కూడా అధ్యక్షుడి పార్టీకి ప్రజలు గట్టి ఎదురుదెబ్బ ఇవ్వగలిగారు. అక్కడ అధ్యక్షుడి అధికారానికి కాంగ్రెస్ ఒక రాజ్యాంగపరమైన నియంత్రణగా నిలుస్తుంది. ట్రంప్‌కు ప్రజలు ఇచ్చిన ఈ రాజకీయ హెచ్చరిక అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థలోని బలాన్ని మరోసారి చాటింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తి 2024 సార్వత్రిక ఎన్నికల్లోనే స్పష్టమైంది. ఇప్పుడు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే వ్యతిరేకత మరింత బలంగా వ్యక్తమైందనే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో వైఎస్ కుటుంబానికి దశాబ్దాలుగా రాజకీయ కంచుకోటగా ఉన్న పులివెందులలో టీడీపీ అభ్యర్థి గీతాకుమారి విజయం సాధించడం సాధారణ విషయం కాదు. జగన్ రాజకీయ ప్రాబల్యానికి ప్రతీకగా భావించే ప్రాంతంలోనే వైసీపీకి పరాభవం ఎదురుకావడం ఆ పార్టీకి తీవ్ర ఆత్మపరిశీలన అవసరమనేందుకు సంకేతం. కడప జిల్లాలోనూ కూటమి అభ్యర్థులు అనేక ప్రాంతాల్లో విజయాలు సాధించారు. అమెరికాలో ట్రంప్‌కు ఎదురైన ఎదురుదెబ్బ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ నేతృత్వంలోని వైసీపీకి ఎదురైన పరాజయం.. ఈ రెండింటినీ ఒకే రకమైన ఎన్నికలుగా చూడలేం. ఒకటి జాతీయ స్థాయి మధ్యంతర ఎన్నికలు కాగా, మరొకటి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు. కానీ ఈ రెండు ఫలితాల నుంచి తీసుకోవాల్సిన ప్రజాస్వామ్య తీర్పు మాత్రం ఒక్కటే. అమెరికా అయినా.. ఆంధ్రప్రదేశ్ అయినా ప్రజాస్వామ్యానికి అసలైన యజమానులు ప్రజలే. నాయకులు వస్తారు.. పోతారు. కానీ ప్రజల అధికారం మాత్రం శాశ్వతం. అహంకారానికి ప్రజల ఓటు చెప్పే సమాధానం ఒక్కటే.. అంహకారులకు శృంగ భంగం తప్పదని.

- నీరుకొండ ప్రసాద్

గిరిజన హక్కులకు ప్రాధాన్యత..

స్థానిక సంస్థల్లో రాజకీయ అవకాశాలు

- **ఆ వర్గాల రాజకీయ సాధికారతకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి**
- **ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డా. కొండారెడ్డి నరహరి వరప్రసాద్**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ల అమలుకు ప్రాధాన్యత ఇవ్వడం ఆయా వర్గాల రాజకీయ సాధికారతకు మార్గం సుగమం చేస్తోందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డా. కొండారెడ్డి నరహరి వరప్రసాద్ పేర్కొన్నారు. గిరిజనులు కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా, పాలనలో భాగస్వాములుగా, నిర్ణయాధికారులుగా అవకాశాలు కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన అంశమని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ నాయకత్వంలో గిరిజనుల రాజ్యాంగబద్ధమైన హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక అభ్యున్నతికి ప్రాధాన్యత లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో గిరిజనులకు రిజర్వేషన్ల రూపంలో మంచి స్థానాలు కేటాయించడం వారి గొంతుకను పాలనా వ్యవస్థలో వినిపించేందుకు, వారి సమస్యలకు ప్రాధాన్యత కల్పించేందుకు దోహదపడుతుందని ఆయన వివరించారు.

స్థానిక సంస్థల్లో గిరిజనులకు విస్తృత రాజకీయ ప్రాతినిధ్యం

గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా



పరిషత్‌లు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల వంటి స్థానిక స్వపరిపాలన సంస్థల్లో గిరిజనులకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వారి భాగస్వామ్యం పెరుగుతుందని నరహరి వరప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ (ఎంపీపీ) స్థాయిలో సుమారు 27 జనరల్, 29మహిళా రిజర్వుడ్ స్థానాలు, జెడ్పీటీసీల్లో సుమారు 27 జనరల్, 29 మహిళా రిజర్వుడ్ స్థానాలు గిరిజనులకు కేటాయించినట్లు ఆయన వివరించారు.

మున్సిపాలిటీల్లో మూడు చైర్మన్ స్థానాలు (రెండు జనరల్, ఒక మహిళ), మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పదవికి కూడా గిరిజన రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు.

రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవుల్లో మూడు స్థానాలను గిరిజనులకు కేటాయించడం గిరిజన రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత నిచ్చే అంశమని ఆయన అన్నారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎస్టీ జనరల్, పోలవరం జిల్లాలో ఎస్టీ మహిళకు చైర్‌పర్సన్ పదవి రిజర్వు చేయడం ద్వారా గిరిజన నాయకత్వానికి అవకాశాలు కల్పించారని వివరించారు.

చంద్రబాబు నాయుడి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గిరిజనులను రిజర్వేషన్ల పదవులకే పరిమితం చేయకుండా.. నిర్ణయాధికారంలోనూ భాగస్వామ్యం కల్పిస్తారని, ఆయా ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన విధాన నిర్ణయాలు, నిధుల కేటాయింపులు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కూడా గిరిజనులకు సముచిత భాగస్వామ్యం కల్పిస్తారని నరహరి వరప్రసాద్ అన్నారు.

గిరిజన ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల అవసరాలను గుర్తించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే విధంగా పాలనా వ్యవస్థలో తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, ఆసుపత్రులు, రవాణా సౌకర్యాలు వంటి మౌలిక వసతుల కల్పనలో స్థానిక గిరిజన ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. గిరిజన మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మహిళా నాయకత్వం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, స్థానిక అవసరాలను అర్థం చేసుకున్న గిరిజన ప్రజాప్రతినిధులు పాలనా వ్యవస్థలో భాగస్వాములైతే సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. చంద్రన్న నాయకత్వంలో యువనేత లోకేష్ చొరవతో గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు.

గిరిజన సంక్షేమానికి టీడీపీ చారిత్రక ప్రాధాన్యత

స్వర్గీయ నందమూరి తారక రామారావు కాలం నుంచి తెలుగుదేశం పార్టీ గిరిజనుల సంక్షేమం, సామాజిక అభ్యున్నతి, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ వచ్చిందని నరహరి వరప్రసాద్ పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత నారా లోకేష్ గిరిజనుల హక్కుల పరిరక్షణ, వారి అభివృద్ధి, రాజకీయ సాధికారతకు ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు.

గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాల హయాంలో గిరిజనుల రాజ్యాంగబద్ధమైన హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు తగిన ప్రాధాన్యత లభించలేదని నరహరి వరప్రసాద్ విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, గత ప్రభుత్వాల విధానాల అమలు, గిరిజనులకు అందాల్సిన ప్రయోజనాలపై సమగ్ర సమీక్ష జరగాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలో నేతృత్వంలోని కూటమి పార్టీలకు అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని, రాబోయే 2029 ఎన్నికలకు ఈ స్థానిక ఎన్నికలు శుభారంభం అని ఆశాభావం వ్యక్తం చేశారు.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

హోదా పక్కనపెట్టి.. సామాన్య ఓటరుగా క్యూలో నిలబడిన మంత్రి అచ్చెన్నాయుడు

● ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగం

● ప్రజల భవిష్యత్తును నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధం ఓటు

●ప్రలోభాలకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలి



శ్రీకాకుళం జిల్లా, నిమ్మాడ (చైతన్యరథం): అధికారిక హోదా కంటే ప్రజాస్వామ్య విలువలే గొప్పవని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆచరణలో చాటిచెప్పారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సామాన్య ఓటరుగా క్యూలో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఆయన సతీమణి కింజరాపు విజయమాధవి, కుమారుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడు కూడా ఓటు వేశారు. మంత్రి హోదాలో ఉన్నప్పటికీ ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యం ఆశించకుండా ఇతర ఓటర్లతో కలిసి క్యూలైన్‌లో నిలబడి తన వంతు వచ్చే వరకు వేచి ఉండటం ద్వారా ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడూ సమానమేనన్న సందేశాన్ని అచ్చెన్నాయుడు చాటిచెప్పారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడంలో సామాన్యుడైనా, ప్రజాప్రతినిధైనా అందరూ సమానమేనని తన చర్యతో నిరూపించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు. ఓటు అనేది కేవలం గుర్తుపై వేసే ముద్ర కాదు.. ప్రజల భవిష్యత్తును, సమాజ గతిని నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధం. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే పునాది. ప్రతి ఓటుకూ విలువ ఉంది. ఒక్క ఓటు కూడా ప్రజాతీర్పును మార్చగలదు అని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగలాంటివని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఓటు వేయడం కేవలం రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాదని, సమాజ భవిష్యత్తు పట్ల ప్రతి పౌరుడికీ ఉన్న బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, చైతన్యవంతమైన ఓటర్లే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని ఆకాంక్షించారు.



ఓటు వెయ్యాలంటే... వాగు దాటాల్సిందే... మన్యం జిల్లాలో పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి నానా అవస్థలు



పి.గన్నవరం (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా పరిషత్ పోలింగ్ గురువారం కొనసాగింది. సాధారణంగా ఉద్యోగరిత్యా వేరే ప్రాంతానికి వెళ్లినవారు, మరెక్కడైనా స్థిరపడినవారు ఓటు వెయ్యడానికి స్వగ్రామానికి వస్తారు. ఈ క్రమంలో వారు బస్సులు, రైళ్లలో బుకింగ్‌లు, ట్రాఫిక్ వంటి కొన్ని సమస్యలు ఎదుర్కోవచ్చు. అది సర్వసాధారణమే కానీ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల వాసులు ఓటెయ్యాలంటే నది దాటాల్సిందే. అదేంటి అనుకుంటున్నారా? అసలే కోనసీమ, మన్యం వాసులకు రవాణా సౌకర్యం అంతంతమాత్రం. పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలంటే వారు వాగులు, వంకలు దాటి వెళ్లాల్సిందే. ప్రాణాలకు తెగించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందే. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గోదావరి రేవు దాటి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పి.గన్నవరం మండలం ఊడిమూడిలంకలో ఉన్న పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు గోదావరి దాటాలి. దాని కోసం ఆయన పడవలో గోదావరి రేవు దాటి వెళ్లి పోలింగ్ కేంద్రానికి చేరుకుని అక్కడ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్థానిక ఎన్నికల్లోనూ 100 శాతం స్ట్రైక్‌రేటుతో రికార్డు సాధించిన జనసేన

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో తాను పోటీ చేసిన అన్ని స్థానాలను గెలుచుకుని, మరోసారి వంద శాతం విజయవంతమైన ఫలితాన్ని నమోదు చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన విజయాన్ని పునరావృతం చేస్తూ, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మధ్య కుదిరిన సీట్ల సర్దుబాటు ఒప్పందం మేరకు జనసేనకు కేటాయించిన అన్ని స్థానాల్లోనూ ఆ పార్టీ విజయం సాధించింది. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తాను పోటీ చేసిన అన్ని మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులను గెలుచుకుని సరికొత్త రికార్డు సృష్టించింది. టీడీపీ నేతృత్వంలోని కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన, విజయవాడ, ఏలూరు నగరపాలక సంస్థల (కార్పొరేషన్ల) మేయర్ పదవులను కైవసం చేసుకుంది. అంతేకాకుండా, జనసేన తాను పోటీ చేసిన 14 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లోని చైర్‌పర్సన్ పదవులన్నింటినీ గెలుచుకుంది. ఈ పార్టీ కేవలం తాను పోటీ చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే కాకుండా, ఇతర పట్టణాల్లో కూడా తన ఉనికిని విస్తరించుకుంది. తెలుగుదేశం పార్టీ (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్సీపీ) నుంచి జనసేనలో చేరిన నాయకులకు అవకాశం కల్పించడం ద్వారా, పార్టీ తన నాయకత్వ శ్రేణిని బలోపేతం చేయడంలో విజయం సాధించింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు మాత్రమే జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, విజయవాడ మేయర్‌గా ఎన్నికయ్యారు. రాధాకృష్ణ తన సమీప ప్రత్యర్థి, వైఎస్సార్సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మిపై 1,30,872 ఓట్ల తేడాతో విజయం సాధించారు. రాధాకృష్ణకు 2,65,888 ఓట్లు రాగా, భాగ్యలక్ష్మికి 1,35,016 ఓట్లు లభించాయి. రాధాకృష్ణ, ప్రముఖ నాయకుడు వంగవీటి మోహన రంగా కుమారుడు. మోహన రంగా 1988లో విజయవాడలో నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో ప్రత్యర్థి వర్గం చేతిలో హత్యకు గురయ్యారు. రాధాకృష్ణ 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2009 అసెంబ్లీ ఎన్నికల్లో, పవన్ కల్యాణ్ సోదరుడు, ప్రముఖ నటుడు చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఏలూరు నగరపాలక సంస్థ మేయర్‌గా జనసేనకు చెందిన రెడ్డి అప్పలనాయుడు ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో, జనసేన తాను పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో మరియు రెండు లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించింది. 2024 ఎన్నికల మాదిరిగానే, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించింది. ఎన్నికలు జరిగిన మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో , ఈ కూటమి 94 చోట్ల విజయం సాధించింది. 13 కార్పొరేషన్లలో 11 కార్పొరేషన్లలో దాని అభ్యర్థులు మేయర్లుగా ఎన్నికయ్యారు.

ఓటేసిన 110 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధురాలు



ఎలమంచిలి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో 110 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధురాలు దబ్బిరు ఆదిలక్ష్మి ప్రాదేశిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇప్పటివరకు ఆమె 55 సార్లు ఓటు వేశానని చెప్పారు. ఆమె స్వయంగా పోలింగ్ బూత్‌కు రావడంతో పలువురు ఆశ్చర్యంగా చూశారు.

క్యూలైన్‌లో వెళ్లి ఓటేసిన హోంమంత్రి అనిత



నక్కపల్లి (చైతన్యరథం): 'పరిషత్' ఎన్నికల్లో ఏపీ హోం మంత్రి అనిత ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని ఓ పోలింగ్ కేంద్రంలో తన కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. మంత్రి సాధారణ పౌరురాలిగా అందరితో కలిసి క్యూలైన్లో వెళ్లారు. తనవంతు వచ్చేవరకు వేచిచూసి ఓటు వేశారు. అనంతరం అనిత మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకమన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

గాజు గ్లాసుతో బూత్‌లోకి ... సిబ్బంది అభ్యంతరం అక్కడున్న ఫ్యాన్‌ను తొలగించాలని ఓటర్ రిప్లై



శ్రీకాకుళం (చైతన్యరథం): రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. కొన్నిచోట్ల బ్యాలెట్ బాక్సులు అపహరించడం, పెట్రోలు బాంబులతో బెదిరించడం వంటి ఘటనలు జరిగాయి. శ్రీకాకుళం పొందూరు కనిమెట్ట ఎంపిటిసి పోలింగ్ కేంద్రంలో ఓ ఆసక్తికర ఘటన ఒకటి జరిగింది. జనసేన పార్టీ సానుభూతిపరుడైన ఓటరు ఒకరు గాజు గ్లాసు పట్టుకుని పోలింగ్ కేంద్రం లోపలికి వచ్చాడు. దీనితో పోలింగ్ కేంద్రంలోని అధికారులు గాజు గ్లాసు తీసుకురావడంపై అభ్యంతరం చెప్పారు. దానికి అతడు... ఈ గదిలో ఫ్యాను తిరుగుతోంది. దాన్ని పీకేయండి అంటూ సమాధానమిచ్చాడు. ఈ వీడియో కాస్త వైరల్ అవుతోంది.

చెవిరెడ్డి అన్నకు నేను ఎస్కార్ట్: ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి

తిరుపతి జిల్లా చంద్రగిరి పరిషత్ ఎన్నికల పోలింగ్ సరళి చూద్దామని వెళ్లిన వైసిపి నాయకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి షాకిచ్చారు. ఆయన ఎటు వెళ్తుంటే అటే వెళ్తూ... నేను చెవన్నకు ఎస్కార్ట్. అన్నా ఎన్నికలను ప్రశాంతంగా జరగనీయండి. తెలుగుదేశం నాయకులను అనవసరంగా రెచ్చగొట్టొద్దు. అవసరమైతే పోలింగ్ కేంద్రాలకు ఒకే కారులో వెళ్లి పరిశీలిద్దాము. మీకు ఎస్కార్టుగా నేను వుంటాను అని ఆయనను అనుసరిస్తూ వచ్చారు. అనంతరం మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ఎస్పీ, పోలీసులను ఎలా వాడారండి మీరు... అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఓటర్లూ... మీరు ప్రశాంతంగా మీ ఓట్లను వేసుకోండి. చెవన్న దగ్గర నేను వున్నాగా అంటూ సెటైర్లు వేసారు.

షష్టిపూర్తి దుస్తులతో పోలింగ్ కేంద్రానికి... ఓటేసి ఆదర్శంగా నిలిచిన దంపతులు



చీపురుపల్లి (చైతన్యరథం): విజయనగరం జిల్లా చీపురుపల్లిలో విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి కణితి మోహనరావు, సత్యవతి దంపతులు గురువారం తమ షష్టిపూర్తి నిర్వహించుకున్నారు. పరిషత్ ఎన్నికల నేపథ్యంలో నేరుగా చీపురుపల్లిలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి షష్టిపూర్తి పూజలో పాల్గొన్న దంపతులు పోలింగ్ గడువు పూర్తికా వస్తుండటంతో అవే దుస్తులతో పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటు వేశారు. దీంతో పలువురు ఆసక్తిగా గమనించారు.




కాకినాడ (చైతన్యరథం): జగ్గంపేటలోని ఎస్సీ కాలనీలో ఉన్న 16వ వార్డులో 102 ఏళ్ల వృద్ధుడు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన గారపాటి వెంకన్న(102) ఏళ్లు. ఆయన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చారు.

ప్రభుత్వ లాంఛనాలతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు

●చివరి యాత్రలో పాల్గొని పాడె మోసిన మంత్రి నిమ్మల..

●ప్రభుత్వ గౌరవం దక్కేలా సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక ఉత్తర్వులు



పాలకొల్లు (చైతన్యరథం): మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) మృతి పట్ల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాలకొల్లులో బుధవారం డాక్టర్ బాబ్జి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొని స్వయంగా పాడె మోసి తన అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. డాక్టర్ బాబ్జి వైద్య రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ విశిష్ట సేవలందించి ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఆయన మరణవార్తను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ బాబ్జి సేవలకు తగిన గౌరవం దక్కాలనే ఉద్దేశంతో ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించేలా అప్పటికప్పుడు ప్రత్యేక అనుమతి ఉత్తర్వులు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. దీంతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ప్రముఖ వైద్యునిగా, ప్రజాప్రతినిధిగా ఆయన అందించిన సేవలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని మంత్రి నిమ్మల అన్నారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు (చైతన్యరథం): కొవ్వూరు మండలం చిడిపి, కుమారదేవం, అరికిరేవుల, వేములూరు, పసివేదల గ్రామాల్లో జరుగుతున్న ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను నాయకులతో కలిసి సందర్శించిన కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా పోలింగ్ పరిశీలించి, ఎన్నికల నిర్వహణ తీరును నాయకులతో కలిసి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, నియోజకవర్గం అబ్జర్వర్ పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం మున్సిపల్ చైర్‌పర్సన్‌ను అభినందించిన ఎంపీ సానా సతీష్‌బాబు



అమలాపురం (చైతన్యరథం): ముమ్మిడివరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 2,299 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన గంగా రత్న భవానికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం గురువారం ఎంపీని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారికి నిరంతరం అందుబాటులో ఉండాలని ఎంపీ సూచించారు. ముమ్మిడివరం మున్సిపాలిటీ అభివృద్ధికి, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

గోసంరక్షణ సంఘం ఆధ్వర్యంలో కోవెలమూడి దంపతులకు ఆత్మీయ సత్కారం!



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర మేయర్‌గా లక్ష్మీ అపర్ణ కోవెలమూడి అఖండ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా, గుంటూరు నెహ్రూ నగర్ 7వ లైనులోని గోసంరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, రవీంద్ర దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు తమ సంప్రదాయ ఆచారాల ప్రకారం కోవెలమూడి దంపతులకు గౌరవ మర్యాదలు అందించి, ఆత్మీయంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమపై చూపిన ప్రేమాభిమానాలకు, అందించిన ఆశీర్వాదాలకు దంపతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీకి మరో తుపాను ముప్పు... ఈనెల 15న ఏర్పడనున్న తుపాను

● నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాతో పాటు ఉత్తర తమిళనాడు తీర ప్రాంతాలపై ప్రభావం

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను వరుసగా తుపాన్లు, భారీ వర్షాలు తీవ్ర అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో త్వరలోనే మరో తుపాను రానుందనే హెచ్చరికలు తీవ్ర ఆందోళన పెంచుతున్నాయి. నవంబర్ రెండో వారం తర్వాత బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ చేసిన అంచనాలు ఇప్పుడు తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో కోస్తాంధ్రతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మరోసారి వర్షాలు కురుస్తాయా? కొత్త తుపాను ఏర్పడుతుందా? అనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం కొత్త తుపాను ముప్పు ఖరారు కాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) నవంబర్ 5వ తేదీన వెల్లడించిన వాతావరణ నమూనాల సమాచారం ప్రకారం.. బంగాళాఖాతంలో ఒక వాతావరణ వ్యవస్థను మోడళ్లు గమనిస్తున్నాయి. అయితే ఇది ప్రస్తుతం మోడల్ అంచనా మాత్రమేనని.. తుపాను, అధికారిక హెచ్చరిక కాదని సంస్థ స్పష్టం చేసింది. అందుబాటులో ఉన్న అంచనాల్లో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన తుపాను ముప్పు లేదని పేర్కొంది. ఏపీ తీరాన్ని తుపాను తాకే అవకాశాన్ని కూడా చాలా తక్కువగా చూపించింది. కొన్ని ప్రాథమిక వాతావరణ అంచనాల్లో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలతో పాటు ఉత్తర తమిళనాడు తీర ప్రాంతాలపై ఆ తుపాను ధాటికి వర్షాల ప్రభావం ఉండొచ్చనే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రస్తుతం సమాచారం లేదు. వాతావరణ వ్యవస్థ ఏర్పడితే దాని కదలిక, తీవ్రత, సముద్రంపై ప్రయాణించే దిశను బట్టి ప్రభావిత ప్రాంతాలు మారవచ్చు. మరోవైపు.. స్కైమెట్ వెదర్ నవంబర్ 5వ తేదీన విడుదల చేసిన అంచనా ప్రకారం.. మురసు తుపాను అవశేషంగా ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలహీనపడనుంది. ఈ విషయంపై మరింత స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.

నేటి సాయంత్రానికి విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరిస్తాం : ప్రత్తిపాటి

●భీకర గాలులతో కుప్పకూలిన పెద్ద పెద్ద వృక్షాలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన లైన్లు, దెబ్బతిన్న ట్రాన్స్ ఫార్మర్లు, సబ్ స్టేషన్లలో సమస్యలు... ఇవన్నీ పరిష్కరించడం ఒక్కరోజులో అయ్యే పనేనా?

●ఓర్పు, సహనంతో వ్యవస్థల పునరుద్ధరణకు, ప్రభుత్వ నష్టనివారణ చర్యలకు సహకరించడం మనందరి బాధ్యత



చిలకలూరిపేట (చైతన్యరథం): "ప్రకృతి విపత్తులను నియంత్రించడం మన చేతుల్లో లేకపోవచ్చు. కానీ వాటి ప్రభావం నుంచి బయటపడటం, వాటిని సమర్థంగా ఎదుర్కోవడమనేది మనందరి సమిష్టి కృషి, సరైన ఆలోచనా విధానం వల్లే సాధ్యమవుతుంది. తుఫాన్లు, వరదలు, జనజీవనానికి ఆటంకం కలిగించినప్పుడు ప్రతి ఒక్కరూ పరిస్థితులకు అనుగుణంగా సంయమనంతో వ్యవహరించాలి, అప్పుడే ప్రభుత్వం, అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసి దెబ్బతిన్న వ్యవస్థల్ని పునరుద్ధరించి, సమస్యల్ని పరిష్కరించడానికి తగిన అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. చిలకలూరిపేటపై మురసు చూపిన ప్రభావం 30 ఏళ్లలో ఎన్నడూ మనం కనివినీ ఎరుగంది. దాదాపు 4 గంటల పాటు ఏకధారగా కురిసిన కుంభవృష్టితో మొత్తం నియోజకవర్గమే అస్తవ్యస్తమైంది. దానికితోడు వందలకిలోమీటర్ల వేగంతో వీచిన భీకర గాలులతో పెద్దపెద్ద వృక్షాలే నేలకూలాయి. వాటి కొమ్మలు తగలడం.. గాలుల ధాటికి కరెంట్ స్తంభాలు నేలకూలడంతో నియోజకవర్గ విద్యుత్ వ్యవస్థే కుప్పకూలింది. కొద్దిపాటి వానకే రోడ్లు, కాలువలు, విద్యుత్, పారిశుధ్య వ్యవస్థలు దెబ్బతినడాన్ని మనం గతంలో కళ్లారా చూశాం. అలాంటిది ఇంతటి భారీ నష్టం మనప్రాంతంలో మనం ఇదివరకెన్నడూ చూడని విపత్తు చూశాం. అంతటి ఘోర విపత్తు విధ్వంసాన్ని సరిచేయడం ఒక్కరోజులో అయ్యే పనేనా? వరుణుడు పగబట్టినట్టుగా నియోజకవర్గంపై పడిన వర్షం, ఎంతటి నష్టం కలిగించిందో మాటల్లో చెప్పలేం ఇంతటి మహావిపత్తును తట్టుకొని నిలబడటం. దైనందిన జీవితాన్ని పున:ప్రారంభించడం సామాన్య విషయం కాదు. ఈ విపత్కర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని కళ్లారా చూశాను. విద్యుత్ వ్యవస్థకు ఎంత నష్టం వాటిల్లిందో స్వయంగా నిన్న విద్యుత్ శాఖ మంత్రి రవికుమారే చెప్పారు. ప్రతికూలా వాతావరణాన్ని అధిగమిస్తూ, ప్రజలకోసం విద్యుత్ సిబ్బంది చేస్తున్న కృషిని స్వయంగా ముఖ్యమంత్రి అభినందించారు. సమర్థవంతుడైన నాయకుడి పాలనలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉండవని చెప్పేందుకు గతంలో మనకు ఎదురైన అనుభవాలే నిదర్శనం.

ప్రజలు ఓర్పుతో వ్యవహరించాలి

నియోజక కర్గంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ అనేది సాధారణ మరమ్మతుల వంటిది కాదు. ఒకవైపు ఎన్నికల హడావుడి.. మరోవైపు మురసు ప్రభావం.. దీంతో అన్నిశాఖల అధికారులు తమపరిధిలో ప్రజల్ని ఆదుకోవడానికి తమ శాయశక్తులా పనిచేస్తున్నారు. దాదాపు 48 గంటలుగా వారు నిర్విరామంగా పనిచేస్తూ, శాయశక్తులా పనిచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఓర్పుతో వ్యవహరించి, వారికి అన్నివిధాలా సహకరించడం మన కనీస బాధ్యత. గురువారం సాయంత్రానికి ఎట్టిపరిస్థితుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలియచేస్తున్నాను. పరిస్థితిని గమనించి ప్రజలు యంత్రాంగానికి, ప్రభుత్వానికి సహకరించాలి." అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

●మంచి నాయకులను ఎన్నుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. గురువారం ఆయన తన సతీమణి జ్ఞానేశ్వరితో కలిసి గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని, మంచి నాయకులను ఎన్నుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఎవరికి ఓటు వేయాలనేది ప్రజల ఇష్టమని, అయితే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తోడ్పాటుతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని చెప్పారు. గతంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకోలేని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. గన్నవరంలో ఎంతో కాలంగా ఉన్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రూ.54 లక్షలతో వాహనాన్ని కొనుగోలు చేసి, గన్నవరం, కేసరపల్లి, బుద్ధవరం ప్రాంతాల్లో సేకరించిన చెత్తను జిందాల్ సంస్థకు తరలిస్తున్నామని తెలిపారు. రెండేళ్లుగా ఈ విధానం కొనసాగుతోందని, దీంతో ఆయా ప్రాంతాల్లో చెత్త సమస్యను పరిష్కరించమని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగాలంటే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని యార్లగడ్డ అన్నారు. ప్రస్తుతం తాను ఒక్కడినే అభివృద్ధి పనుల కోసం కృషి చేస్తున్నానని, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు కూడా తోడైతే స్థానిక పాలన మరింత వేగవంతమవుతుందన్నారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

ఉయ్యూరు టౌన్‌లో తెలుగుదేశం పార్టీ శ్రేణుల విజయోత్సవాలు



ఉయ్యూరు (చైతన్యరథం): మున్సిపాలిటీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన చైర్మన్ మరియు కౌన్సిలర్లు ఉయ్యూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్‌ని, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ని కలిసి వారికి కృతజ్ఞతలు తెలియజేసి, విజయోత్సవ వేడుకలు చేసుకోవడం జరిగినది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ఉయ్యూరు పట్టణంలోని ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి అండగా ఉండి అత్యధిక మెజార్టీలతో 29 మంది కౌన్సిలర్లను మరియు చైర్మన్‌ను కూటమి అభ్యర్థులను గెలిపించడం జరిగిందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ, ప్రజల సంక్షేమానికి నీతి నిజాయితీలతో కట్టుబడి పనిచేయాలని రాజేంద్రప్రసాద్ అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ... వైసీపీ చేసిన దుష్ప్రచారాలను నమ్మకుండా కూటమి అభ్యర్థులను ఇంత పెద్ద ఎత్తున గెలిపించినందున పట్టణ అభివృద్ధికి మీరందరూ కట్టుబడి పని చేయాలని వారికి సూచించారు. తదుపరి పట్టణ కార్యాలయం నుంచి ఉయ్యూరు సెంటర్ వరకు పాదయాత్రగా వెళ్లి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, కౌన్సిలర్లు, చైర్మన్ మరియు నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాపట్లలో పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు

బాపట్ల (చైతన్యరథం): నియోజకవర్గం బాపట్ల మండలంలోని పాండురంగాపురం, అడవిపల్లిపాలెం, స్టువర్టుపురం, వెదుళ్ళపల్లి, కంకటపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లతో మాట్లాడి ఏర్పాట్లను తెలుసుకోవడంతో పాటు, ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ శాతంపై సమీక్షించారు. ప్రతి ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని, వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియకు ఆటంకాలు కలగకుండా నిబంధనల ప్రకారం ఎన్నికలు ప్రశాంతంగా



నిర్వహించాలని స్పష్టం చేశారు.

పరిషత్ ఎన్నికల్లో ఓటింగ్ తగ్గించేందుకు వైసీపీ కుట్రలు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు వైఎస్సార్సీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని కూటమి ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నజీర్ అహ్మద్, బుచ్చిరాంప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు వారు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి విచ్చేసి, ఎన్నికల కమిషనర్‌తో పాటు ఐజీని కలిసి వైసీపీ నేతల అరాచకాలపై పక్కా ఆధారాలతో కూడిన ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఇటీవల జరిగిన మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్సీపీకి ఘోర పరాభవాన్ని మిగిల్చి, కూటమి ప్రభుత్వానికే సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఆ ఓటమిని జీర్ణించుకోలేక, ప్రస్తుత పరిషత్ ఎన్నికల్లో కూడా పరాజయం ఖాయమని తేలిపోవడంతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి ఓటింగ్ శాతాన్ని తగ్గించడమే లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా చీరాల, సత్తెనపల్లితో పాటు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో వైసీపీ నేతలు మూకలను రప్పించి అలజడి సృష్టిస్తున్నారని, టీడీపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడుతూ పరిస్థితులను అశాంతియుతంగా మారుస్తున్నారని ఆధారాలతో సహా ఈసీకి వివరించినట్లు తెలిపారు.

ప్రజాస్వామ్యంపై జగన్‌కు గౌరవం లేదు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాల పేరిట దౌర్జన్యాలు చేసి, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఒక్కటి కూడా ఏకగ్రీవం కాకుండా చూడాలని జగన్ మాట్లాడటం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కనీసం తన ఓటు హక్కును వినియోగించుకోకుండా ప్రజలను గాలికొదిలేసిన జగన్‌కు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని, పులివెందుల చేజారిపోవడంతో ఆ పార్టీ నాయకత్వానికి మతిభ్రమించిందని ఎద్దేవా చేశారు.

గొల్లపూడిలో ఓటు హక్కు వినియోగించుకున్న దేవినేని ఉమామహేశ్వరరావు

విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా గురువారం నిర్వహిస్తున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి సాయిపురం కాలనీలోని 268వ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న కీలకమైన బాధ్యత అని విలువైన ఓటు వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.



బుర్రిపాలెంలో ఓటు హక్కు వినియోగించుకున్న కేంద్ర మంత్రి పెమ్మసాని



తెనాలి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన స్వగ్రామమైన బుర్రిపాలెంలో గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన సొంత గ్రామానికి వచ్చి, ఇక్కడే తన ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ఎన్నికలు ఏ స్థాయిలో జరిగినా ప్రజల భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి అసలైన బలమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రజాప్రతినిధుల ఎంపికలో స్థానిక సంస్థల ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలందరూ ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను, తమ హక్కులను కాపాడుకోవాలని ఆకాంక్షించారు. బుర్రిపాలెంలో ఓటు హక్కు వినియోగించుకున్న కేంద్ర మంత్రి పెమ్మసాని.

గుడివాడలో కూటమి విజయంపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ధీమా

● జడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్ సరళిపై ఎమ్మెల్యే ఆరా



గుడివాడ (చైతన్యరథం): నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని నందివాడ,గుడివాడ రూరల్, గుడ్లవల్లేరు,మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో కూటమి నాయకులు, పార్టీ శ్రేణులతో మాట్లాడి ఎన్నికల నిర్వహణ తీరును, ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల్లో ఆయన పర్యటనలో ఏపీఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి అనుకూల పవనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తున్న కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

కూటమి శ్రేణుల ఐక్య కృషితో కూటమి విజయపతాకం

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వానికి, గ్రామాల అభివృద్ధికి కట్టుబడిన అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ వరకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, ఐక్యంగా పనిచేయడం అభినందనీయమన్నారు. కూటమి ఐక్యతే ఈ ఎన్నికల్లో తమకు ప్రధాన బలమని వ్యాఖ్యానించారు. కూటమి అభ్యర్థుల విజయం పట్ల తమకు పూర్తి విశ్వాసం ఉందని, అసమర్థ ప్రతి పక్షానికి డిపాజిట్లు రాకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాము తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కని విధంగా ప్రజా తీర్పు ఉండబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతు, కూటమి శ్రేణుల ఐక్య కృషితో గుడివాడ నియోజకవర్గంలో కూటమి విజయపతాకం ఎగురవేయడం ఖాయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటింగ్ సరళిని పరిశీలించిన నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట (చైతన్యరథం): గ్రామంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం పరిశీలించారు. నియోజకవర్గ పరిశీలకురాలు ఉండవల్లి శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు కట్టా వెంకటేశ్వరరావు, నాయకులు శ్రీరామ్, చిన్నబాబు తదితరులతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల వేళ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పలు గ్రామాల్లో పర్యటన



జగ్గయ్యపేట (చైతన్యరథం): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అధికారులకు, పార్టీ శ్రేణులకు తగు సూచనలు చేశారు. జగ్గయ్యపేట మండలంలోని షేర్ మహమ్మద్‌పేట, గండ్రాయి, మల్కాపురం, గౌరవరం, చిలకల్లు గ్రామాల్లో పర్యటించారు. వత్సవాయి మండలంలోని చిన్న మోదుగుపల్లి, పెద్ద మోదుగుపల్లి, గోపినేనిపాలెం, లింగాల, వత్సవాయి టౌన్ నందు మరియు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పెనుగంచిప్రోలు మండలంలోని ముచింతాల, శివాపురం, అనిగండ్లపాడు, గుమ్మడి దురు, లింగగూడెం గ్రామాలతో పాటు పెనుగంచిప్రోలు టౌన్‌లో ఎన్నికల సరళిని పరిశీలించారు. నందిగామ మండలం జొన్నలగడ్డలో ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తుఫాన్ ప్రభావిత పంట నష్టాన్ని పరిశీలించిన పెమ్మసాని

●అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న కేంద్ర మంత్రి



బుర్రిపాలెం (చైతన్యరథం): మురాస్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన ప్రాంతాల పరిశీలనలో భాగంగా గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న పెమ్మసాని, పంట నష్టానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు అండగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

వరదలో చిక్కుకున్న మహిళలు... ప్రాణాలకు తెగించి కాపాడిన సీఐ... హోంమంత్రి అభినందనలు



చిలకలూరిపేట (చైతన్యరథం): గుంటూరు జిల్లా చిలకలూరిపేట పరిధిలోని తిమ్మాపురం అండర్ పాస్ వద్ద వరదలో చిక్కుకున్న ముగ్గురు మహిళలను పోలీసులు కాపాడారు. వరదలో మహిళలు చిక్కుకున్నట్లు సమాచారం అందుకున్న సీఐ సుబ్బనాయుడు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని, ప్రాణాలకు తెగించి మహిళలను రక్షించారు. నడుముకు తాడు కట్టుకొని ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరదలో దూకి.. వాళ్లను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. పోలీసులను అభినందించారు. పోలీసుల ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు.

హిందూపురం వ్యాపారి అకౌంట్‌లో రూ. వెయ్యి కోట్లు జమ... అరగంటలో ఖాతాలో నగదు మాయం



శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ఓ వ్యాపారికి వింత పరిస్థితి ఎదురైంది. ఆయన అకౌంట్‌లో ఉన్నట్టుండి ఏకంగా రూ.వెయ్యి కోట్లు జమ అయ్యాయని చెబుతున్నారు. తన అకౌంట్‌లో అంత భారీ మొత్తంలో డబ్బులు ఎలా వచ్చాయోనని తెలియక అవాక్కయ్యానన్నారు. కానీ అరగంటలోనే సీన్ మొత్తం రివర్స్ అయ్యింది.. ఆ వెయ్యి కోట్లు పక్కన పెడితే ఆయన అకౌంట్‌లో డబ్బులు కూడా మాయం అయ్యాయని చెబుతున్నారు. వెయ్యి కోట్ల సంగతేమో కానీ తన అకౌంట్‌లో డబ్బులైనా వచ్చేలా చూడండి అంటూ బ్యాంకుకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందూపురానికి సదాశివనగర్‌కు చెందిన ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి తోట ఆనంద్‌కు ఓ ప్రైవేట్ బ్యాంకులో 1147924495 నంబర్‌తో అకౌంట్ ఉంది. ఆయన మొబైల్‌కు మంగళవారం మధ్యాహ్నం ఒక మెసేజ్ వచ్చింది. ఏంటా అని మెసేజ్ ఓపెన్ చేసి చూడగానే.. ఆయన బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ అయినట్లు కనిపించింది. వెంటనే ఆయన చెక్ చేయగా.. బ్యాంక్ అకౌంట్‌లో ముందు రూ.32వేల వరకు ఉన్నాయి.. కానీ తర్వాత చెక్ చేస్తే ఏకంగా రూ.వెయ్యికోట్లు జమ అయినట్లు గుర్తించారు ఆనంద్. అంత డబ్బులు తన అకౌంట్‌లో ఎందుకు జమ అయ్యాయని షాకయ్యారు.

అరగంట వ్యవధిలో జీరో బ్యాలెన్స్

ఆనంద్ వెంటనే తన స్నేహితులకు కూడా అకౌంట్‌లో డబ్బులు పడ్డాయని చూపించారు. మళ్లీ అరగంట వ్యవధిలోనే ఆయన బ్యాంక్ అకౌంట్లో బ్యాలెన్స్ జీరోగా మారింది. ముందు తన అకౌంట్‌లో ఉన్న రూ.32వేలకుపైగా డబ్బులు కనిపించకపోవడంతో ఆనంద్ అవాక్కయ్యారు. వెంటనే ఆయన బ్యాంక్ దగ్గరకు వెళ్లి ఏం జరగిందని ఆరా తీశారు.. అక్కడ కూడా బ్యాంక్ సిబ్బంది సరైన సమాధానం చెప్పకపోవడంతో నేరుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.. అక్కడ తన సమస్యను వివరించి ఫిర్యాదు అందజేశారు. అలాగే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆనంద్ చెబుతున్నారు. రూ.వెయ్యి కోట్ల సంగతి పక్కన పెడితే తన అకౌంట్‌లో డబ్బులు కూడా మాయం కావడం ఏంటనేది ఆనంద్ అనుమానం. మొత్తానికి ఈ రూ.వెయ్యి కోట్ల వ్యవహారం హిందూపురంలో ఆసక్తికరంగా మారింది.

అనవసర గొడవలతో నష్టపోకండి : జేసీ ప్రభాకర్‌రెడ్డి

మాలాంటి నాయకులంతా బాగానే ఉంటామని, అనవసర గొడవలతో నష్టపోయేది కింది స్థాయి కేడరేనని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో యల్లనూరు, పుట్లూరు, యాడికి మండలాల్లో జరిగిన ఘటనల గురించి మాట్లాడారు. ఈ మూడు మండలాల్లో ఈ వారంలో జరిగిన సంఘటన వల్ల నష్టపోయినది మీరేనన్న విషయం తెలుసుకుని గొడవల జోలికి వెళ్లవద్దని కార్యకర్తలకు సూచించారు.

వైసీపీ నేత చెవిరెడ్డికి ఎస్కార్ట్‌గా మారిన టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి

●ప్రతి అడుగునూ కట్టడి చేస్తూ... ఆయనను వెంబడించిన పులివర్తి సుధారెడ్డి

●ఎక్కడ నిలబడితే అక్కడ ఆయన పక్కనే ఉంటూ పోలింగ్ బూతుల సందర్శన

●గలాటా సృష్టించేందుకు ప్రయత్నించిన వైసీపీ కుట్రలను భగ్నం చేసిన సుధారెడ్డి

● ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలన్నదే తన ఉద్దేశమని వెల్లడి

చంద్రగిరి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా... పలు చోట్ల ఉద్రిక్త ఘటనలు చోటుచేసుకున్నాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజవర్గంలో ఎన్నికల వేళ ఒక ఆసక్తికర పరిణామం జరిగింది. మంగళంలోని సప్తగిరి కాలనీలోని పోలింగ్ కేంద్రం దగ్గర వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డిలు ఎదురుపడ్డారు. రాజకీయ ప్రత్యర్థులైన ఇద్దరు నేతలు పక్కపక్కనే నిలబడి కనిపించడం స్థానికంగా, రాజకీయ వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు ఏం జరిగిందని ఆరా తీస్తే అసలు విషయం తెలిసింది. 'నేను మా అన్నతోనే మా అన్నతోనే వస్తాను.. అన్నతో వెళదాం.. ఎక్కడికిపోతే అక్కడికి వెళతా. మీ (చెవిరెడ్డి) కారు అయినా ఎక్కుతా' అంటూ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎటు వెళితే అటు వెళతానంటూ సుధారెడ్డి ఆయన్ను వెంబడించారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోలింగ్ బూత్‌లకు పరిశీలించేందుకు వెళ్లగా.. సుధారెడ్డి కూడా ఆయన్ను వెంబడించారు. ఇవాళంతా తాను చెవిరెడ్డి వెంటే కారులో ఎస్కార్ట్‌లా వెంటే ఉంటానన్నారు. ఆయన వెంటే కారులో వెళతానన్నారు. సుధారెడ్డి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెంటే వెళ్లారు.. ఆయన ఒక చోట నిలబడి ఫోన్ మాట్లాడుతుంటే.. ఆమె కూడా పక్కన నిలబడ్డారు. అలాగే సుధారెడ్డి ఓటు వేయడానికి వచ్చినవారిని మాత్రమే అనుమతించాలని పోలీసులతో చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలనేది తన ఉద్దేశంగా సుధారెడ్డి చెప్పుకొచ్చారు. మరోవైపు తిరుపతి రూరల్ మండలం సప్తగిరి నగర్ పోలింగ్ బూత్‌లో ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బూత్‌లోకి వెళ్లారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కూడా అక్కడికి వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి.



చంద్రగిరి నియోజకవర్గంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్‌లో ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలింగ్ ప్రక్రియ మొత్తాన్ని రికార్డు చేయాలని హైకోర్టు ఆదేశించినట్లు చంద్రగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ ఫుటేజీని భద్రపరిచి కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసినట్లు చెప్పుకొచ్చారు. మొత్తం మీద చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ వ్యవహారం హాట్‌హాట్‌గా మారింది.

రాజధాని అమరావతిపై వైసీపీ మరోసారి ఫేక్ ప్రచారం

● మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎక్స్ పోస్టుకు చెక్ చెప్పిన ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం

అమరావతి (చైతన్యరథం): అమరావతిలో కురిసిన వర్షాలకు నీటిని బయటకు తోడేందుకు మోటార్లు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తన ఎక్స్ ఖాతా ద్వారా ఒక వీడియోను షేర్ చేస్తూ ప్రచారం చేశారనీ, ఈ ప్రచారం పూర్తిగా అసత్యం మరియు తప్పుదోవ పట్టించేలా ఉందని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం పేర్కొంది. దీని గురించి వివరణ ఇస్తూ... పోస్టులో ఉపయోగించిన వీడియో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతికి సంబంధించింది కాదు. రెండవ స్క్రీన్‌షాట్‌లో బెంగాలీ భాషా శీర్షిక ("ఏకయోగే చాలానో హచ్చే అనేకగులా మేశిన" – Arif Hossain 5.0 ఖాతా) స్పష్టంగా కనిపిస్తోంది. ఇది బంగ్లాదేశ్ ప్రాంతంలో ఆక్వాకల్చర్, వ్యవసాయం లేదా నీటి నిర్వహణకు సంబంధించిన పాత దృశ్యం. ప్రస్తుతం అమరావతి రాజధాని ప్రాంతంలో వేల కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక వసతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డ్రైనేజీలు, డక్టింగ్ కోసం తవ్విన గోతులు, రైతుల ప్లాట్ల కోసం నిర్మిస్తున్న రోడ్లు, డ్రెయిన్ పనుల కారణంగా భారీ వర్షాలు పడినప్పుడు కొన్ని చోట్ల నీరు నిలిచిపోవడం సహజం. ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల కోస్తా జిల్లాల్లోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇలాంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు మరియు రాజకీయ నాయకులు నిజా నిజాలు పరిశీలించకుండా వేరే ప్రాంతాల వీడియోలతో రాష్ట్ర రాజధానిపై తప్పుడు ప్రచారం చేయడం తగదు. సంక్షోభ సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, వేరే ప్రాంతపు దృశ్యాలను రాజధానికి ఆపాదిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేయడం బాధ్యతారాహిత్యం. వేరే ప్రాంతానికి చెందిన బెంగాలీ వీడియో ఆధారంగా అమరావతి రాజధాని నిర్మాణాలు, నీటి ఉపసంహరణపై చేసిన ఈ ప్రచారం పూర్తిగా అసత్యం. ఈ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని తెలిపింది.



బ్యాలెట్ బాక్స్‌లో సిరా పోసి పరారైన వైసీపీ కార్యకర్తలు



కడప (చైతన్యరథం): కడప జిల్లా గోపవరం మండలం బ్రాహ్మణపల్లె ఎంపీటీసీ పరిధిలోని రామాపురంలోని పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సులో వైసీపీ వర్గీయులు సిరా పోశారు. బ్రాహ్మణపల్లి ఎంపీటీసీగా పోటీ చేస్తున్న కలువాయి వెంకటసుబ్బమ్మ భర్త నర్సారెడ్డి.. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి కుమారుడు ఆదిత్య రెడ్డితో కలిసి ఓటు వేసే నెపంతో పోలింగ్ బూత్లోకి ప్రవేశించారు. సిబ్బంది ఓటును పరిశీలించే లోపలే.. అక్కడున్న సిరా బాటిల్ తీసుకొని బ్యాలెట్ బాక్సులో పోయడంతో పోలింగ్ సిబ్బంది కంగారుపడ్డారు. అక్కడి సిబ్బందిని నర్సారెడ్డి దుర్భాషలాడుతూ నానా హంగామా సృష్టించారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని బయటకు తీసురాగా.. అక్కడి నుంచి ఇద్దరూ పరారయ్యారు. పోలింగ్ బూత్ పీవో విజయలక్ష్మి ఈ ఘటనపై బద్వేల్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పులివెందులలో పెట్రోల్ బాంబులతో వైసీపీ హల్‌చల్

- మున్సిపల్ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని జీర్ణించుకోలేక ఎక్కడికక్కడ గొడవలకు దిగిన వైసీపీ



అమరావతి (చైతన్యరథం): పరిషత్ పోలింగ్ వేళ కడప జిల్లాలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. మున్సిపల్ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని జీర్ణించుకోలేక ఎక్కడికక్కడ గొడవలకు దిగారు. పోలింగ్ సజావుగా సాగకుండా అలజడులు సృష్టించేందుకు కూటమి పార్టీల నేతలతో వాగ్వాదాలకు సైతం వెనకాడలేదు. పలుచోట్ల ఘర్షణలతో ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పెట్రోల్ బాంబులు, పరస్పర దాడులతో కడప జిల్లా పులివెందుల మండలం ఎర్రిపల్లె ఉద్రిక్తంగా మారింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ వేళ ఎర్రిపల్లెలో ఇరువర్గాలు బాహాబాహీకి తలపడ్డాయి. తొలుత ఎర్రిపల్లె పోలింగ్ బూత్ వద్దకు వైఎస్సార్సీపీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు వైసీపీ కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పెట్రోల్ బాంబులు వేయడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

దొంగ ఓట్ల వేసేందుకు రౌడీలు... అడ్డుకున్న స్థానికులు

కడప జిల్లా నందలూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బయటనుంచి పెద్ద ఎత్తున రౌడీలు రావడంతో మహిళలు, స్థానికులు అడ్డుకున్నారు. తిరుపతి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నుంచి జీపులు, కార్లలో రౌడీలు వచ్చినట్లు గుర్తించిన స్థానికులు, స్థానిక నేతలు వాహనాలను అడ్డుకుని వారిపై దాడి చేశారు. పోలీసులు రంగంలోకి దిగి రౌడీలను అదుపులోకి తీసుకున్నారు. దొంగ ఓట్లు వేసేందుకు బయట నుంచి రౌడీలను తీసుకువచ్చినట్లు స్థానికులు ఆరోపించారు.

పులివెందుల మండలంలో ఉద్రిక్తత

పరిషత్ ఎన్నికల పోలింగ్ వేళ కడప జిల్లాలో నందలూరు మండలం ఎర్రిపాపయ్య గారిపల్లెలో ఘర్షణ రణరంగాన్ని తలపించింది. పాటూరు ఎంపీటీసీ స్థానం పోలింగ్ బూత్ 45 వద్ద వైసీపీ, జనసేన పార్టీ వర్గాలు ఘర్షణ నెలకొంది. ఇరువర్గాలు కట్టెలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను తరిమికొట్టారు. పరిషత్ ఎన్నికల వేళ కడప జిల్లా పులివెందుల మండలం తుమ్మలపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ, వైసీపీ శ్రేణులు ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు పరస్పరం రాళ్లు, సీసాలతో దాడి చేసుకున్నారు. నడిరోడ్డుపై బాహాబాహీకి దిగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు కలుగజేసుకుని టీడీపీ, వైసీపీ కార్యకర్తలను చెదరగొట్టారు.

టీడీపీ ఏజెంట్లను బయటకు తోసేసిన వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వీరంగం

వైఎస్సార్ కడప జిల్లా పెద్దముడియం మండలంలో వైఎస్సార్సీపీ దౌర్జన్యానికి దిగింది. గుండ్లకుంట పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వీరంగం సృష్టించారు. తన అనుచరులతో కలసి ఏకంగా పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని, టీడీపీ ఏజెంట్లను బయటకు తోసేశారు. వైసీపీ ఎమ్మెల్సీ చర్యతో పోలింగ్ కేంద్రం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో ఒకరినొకరు నెట్టుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. కడప జిల్లా లింగాల మండలం పార్నపల్లి పోలింగ్ కేంద్రానికి తన అనుచరులతో కలసి వెళ్తున్న ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. పోలింగ్ కేంద్రం ఉద్రిక్తతలకు చోటు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసలతో ఎంపీ అవినాష్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు.

పరిషత్ ఎన్నికల పోలింగ్ సరళిపై ఎప్పటికప్పుడు సమీక్షించిన మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి



నంద్యాల (చైతన్యరథం): నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో జరుగుతున్న పరిషత్ ఎన్నికల పోలింగ్ సరళిపై రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో రెండు జిల్లాలకు చెందిన సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లతో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను, పోలింగ్ సరళిని, ప్రజల స్పందనను అడిగి తెలుసుకుంటున్నారు. పరిషత్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారనే ధీమాను మంత్రి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసం, అభివృద్ధి పట్ల ప్రజల్లో ఉన్న ఆకాంక్షలు ఎన్నికల్లో ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు తావులేకుండా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఎన్నికల ప్రక్రియలో పార్టీ శ్రేణులు సమన్వయంతో వ్యవహరించాలని మంత్రి సూచించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చాటి చెప్పిన వృద్ధురాలు

- ఓటు హక్కు వినియోగించుకున్న 102 ఏళ్ల దస్తగిరమ్మ



అనంతపురం (చైతన్యరథం): ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చాటి చెప్పిన ఓ ఘటన అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగింది. గన్నవారిపల్లె కాలనీకి చెందిన దస్తగిరమ్మ (102) వృద్ధురాలు ఓటు హక్కును వినియోగించుకోవాలి అనుకున్నారు. ఆమె కోరికను గమనించిన మాజీ సర్పంచ్.. తన ద్విచక్ర వాహనంపై ఆమెను పోలింగ్ బూత్ వద్దకు తీసుకొచ్చారు. అనంతరం దస్తగిరమ్మ ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేశాక వృద్ధురాలి ఆనందం చూసి అందరూ మురిసిపోయారు.

40 ఏళ్ల తర్వాత ఆ గ్రామాల్లో ఎన్నికలు... ఓటేసేందుకు పోటెత్తిన ప్రజలు



ఎమ్మిగనూరు (చైతన్యరథం): నాలుగు దశాబ్దాలుగా ఎన్నికలంటే ఏకగ్రీవమే.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి, ఓటు వేసే అవకాశం వచ్చినా పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ ఈసారి పరిస్థితి మారింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్లతో పాటు పరిసర గ్రామాల్లో తొలిసారిగా పోటీ వాతావరణంలో పరిషత్ ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో 40 ఏళ్ల తర్వాత ఓటు హక్కు వినియోగించుకునేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నాలుగు దశాబ్దాల్లో తొలిసారి ఎన్నికలు

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల గ్రామంలో గత 40 ఏళ్లుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఏకగ్రీవంగా సాగుతున్నాయి. ఈసారి మాత్రం ఆ ఏకగ్రీవ సంప్రదాయానికి తెరపడింది. అభ్యర్థుల మధ్య పోటీ నెలకొనడంతో ఓటింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో గ్రామంలో 4 దశాబ్దాల్లో తొలిసారి ఎన్నికల సందడి కనిపిస్తోంది. ఇన్నేళ్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాలకు ఇప్పుడు ఓటర్లు తమ తీర్పు చెప్పే అవకాశం రావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. కడిమెట్లతో పాటు ఎర్రకోట, రాళ్లదొడ్డి, సిరాలదొడ్డి, గువ్వలదొడ్డి గ్రామాల్లోనూ నాలుగు దశాబ్దాల తర్వాత పరిషత్ ఎన్నికల్లో పోలింగ్ జరుగుతున్నాయి.

అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిఘా

కడిమెట్ల, ఎర్రకోట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు క్యూ కట్టారు. మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓపికగా తమ వంతు కోసం వేచి ఉన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత పోటీ ఎన్నికల్లో ఓటు వేస్తుండటంతో గ్రామస్తుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఈ ప్రాంతంలో రెండు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు, ఎన్నికల అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద నిఘా ఉంచారు. స్థానిక నాయకులు, అభ్యర్థులు కూడా ఓటింగ్ సరళిని ఆసక్తిగా గమనిస్తున్నారు. కడిమెట్లలో 4 దశాబ్దాల ఏకగ్రీవ సంప్రదాయం ముగిసి ఓటింగ్ జరగడం ఈ ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇన్నేళ్ల తర్వాత గ్రామస్తులు వేసిన ఓట్లు ఎవరికి అనుకూలంగా మారతాయో.. స్థానిక రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయో తెలియాలంటే ఫలితాల వరకు వేచి చూడాల్సిందేనని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై.. సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

గుండెపోటుతో పోలింగ్ అధికారిణి మృతి



కూడేరు (చైతన్యరథం): అనంతపురం జిల్లా కూడేరు మండలం కడదరకుంటలో విషాదం చోటు చేసుకుంది. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిణి గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న హరిత గౌడ్‌కు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అప్రమత్తమైన సహచర సిబ్బంది, పోలీసులు ఆమెను కూడేరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. హరిత గౌడ్ రాయదుర్గంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో పోలింగ్ అధికారి మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం

ఎన్నికల విధుల్లో పోలింగ్ అధికారి హరిత (58) మృతి పట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేస్ విచారం వ్యక్తం చేశారు. హరిత గౌడ్ గుండెపోటుతో చనిపోవడం చాలా బాధాకరమని తన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. హరిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపారు

పోలింగ్ కేంద్రానికి తాళం

అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలం పిట్లంపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రం 3లో గందరగోళం చోటుచేసుకుంది. దీంతో సుమారు గంట సేపు పోలింగ్ను అధికారులు నిలిపివేశారు. ఓటు వేసే సమయంలో టీడీపీ, వైసీపీ వర్గీయులు ఒకేసారి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంతో గందరగోళం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఎన్నికల సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. అనంతరం అధికారులు వారిని బయటకు పంపి పోలింగ్ కేంద్రానికి తాళం వేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు విషయాన్ని ఆరా తీసి ఇరువర్గాల వారితో మాట్లాడారు. మరోసారి ఇరువర్గాల వారు పోలింగ్ కేంద్రంలోకి దూసుకురాగా, రూరల్ సీఐ గంగాధర సిబ్బందితో కలిసి వారిని చెదరగొట్టారు. కేవలం ఓటువేసేవారిని క్యూలో నిలుచోబెట్టి మళ్లీ పోలింగ్ ప్రారంభించారు.

అనంతసాగరంలో ఉద్రిక్తత

మరోవైపు నెల్లూరు జిల్లా అనంతసాగరం ప్రభుత్వ పాఠశాల వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైకాపా అభ్యర్థులు పోలింగ్ కేంద్రంలో ఉన్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై వైసీపీ నాయకులు స్పందిస్తూ.. మీ పార్టీ వాళ్లు ఎందుకున్నారని ఎదురు ప్రశ్నించారు. ఈ క్రమంలో మంత్రి ఆనం, వైసీపీ మాజీ ఎమ్మెల్యే విక్రంరెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద బైఠాయించారు. ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు కలగజేసుకొని వారిని చెదరగొట్టారు.

కుప్పంలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిపై దాడి... ఆస్పత్రికి తరలింపు



కుప్పం (చైతన్యరథం): చిత్తూరు జిల్లా కుప్పంలోని నడమూరు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి పళణిపై... వైసీపీ సానుభూతిపరుడు జయకుమార్‌రెడ్డి దాడి చేశాడు. టీడీపీకి ఓటు వేయొద్దంటూ పోలింగ్ కేంద్రానికి సమీపంలో జయకుమార్ ప్రచారం చేస్తుండగా.. పళణి ప్రశ్నించడంతో అతడిపై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన ఎంపీటీసీ అభ్యర్థిని కార్యకర్తలు ఆస్పత్రికి తరలించారు. అన్నమయ్య జిల్లా కె.వి. పల్లె మండలం లక్కిరెడ్డిగారిపల్లెలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రంలోకి చొరబడిన దుండగులు బ్యాలెట్ బాక్సును బయటపడేశారు.

పరిషత్ ఎన్నికల్లో ప్రవాసాంధ్రుల ఓటు

గల్ఫ్: అనేక మంది గల్ఫ్ ప్రవాసాంధ్రులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేయడానికి ఆసక్తి ప్రదర్శించారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో గతంలో ఓటు వేసినప్పటికీ ఈసారి సొంత ఊరి ఎన్నికలలో ఓటు వేయడం ఒక గొప్ప అనుభూతి కలిగించిందని సౌదీ అరేబియాలో పనిచేసే కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామానికి చెందిన రాజశేఖర్ చెన్నుపాటి తెలిపారు. గురువారం ఉదయం ఆయన స్వగ్రామంలో ఓటు వేసిన అనంతరం గల్ఫ్ ప్రవాసాంధ్రులకు ఒక వీడియో సందేశం పంపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో విధిగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు స్వదేశానికి రావాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చేస్తున్న కృషికి కృతజ్ఞతగా తెలుగుదేశం మద్దతుదారులను గెలిపించాలని కోరారు.

–బతుకుదెరువు కోసం ఒమాన్‌లో ఉంటున్నా తమ మనస్సు మొత్తం గ్రామంలో నివసిస్తుందని ఒమాన్‌లో ఆయిల్ గ్యాస్ రంగంలో పని చేసే చిత్తూరు జిల్లా ఐరాల మండలం భీమనేని వారిపల్లి గ్రామానికి చెందిన వడ్లపట్ల మురళి తెలిపారు. ఒమాన్‌లో ఉండే మరో ముగ్గురు సంపతి పయ్యాల, యౌశిక చౌదరి, ఢిల్లీ బాబు లతో కలిసి వెళ్లి ఆయన గురువారం తమ స్వగ్రామంలో ఓటు వేశారు.



– ఓటు హక్కును వినియోగించుకోవడానికి తాను స్వదేశానికి చేరుకున్నప్పటికీ తుఫాన్ కారణంగా బెంగుళూరు నుంచి మార్కాపురంలోని తమ ఊరికి వెళ్లలేకపోయానని సౌదీ అరేబియాలో నివసిస్తున్న ప్రవాసాంధ్రురాలు శిల్పా గడ్డం తెలిపారు.

– అన్నమయ్య జిల్లాలోని అన్ని పురపాలక ఎన్నికలలో క్రియాశీలకంగా వ్యవహరించిన గల్ఫ్‌లోని ప్రవాసీయులు గురువారం గాలివీడు, సండుపల్లి, పుల్లంపేట మండలాలో పరిషత్ ఎన్నికలలో హడావుడి చేశారు. కువైట్‌లో తమ ఉద్యోగాలకు సెలవు పెట్టి గొర్లముదివీడు గణేశ్, ఖాద్రూన్ షేక్‌లు గాలివీడులో మకాం వేశారు.

– తెలుగుదేశం పార్టీని మూడంచెల వరకూ స్థానిక స్థాయిలో బలోపేతం చేయడం నిజమైన అభివృద్ధి అని తెలుగుదేశం పార్టీ గల్ఫ్ ప్రవాసాంధ్ర నాయకుడు జానీ బాషా చెప్పారు.

– ఖతార్ నుంచి తన భార్య శ్రీలక్ష్మి, కుమార్తె శ్రావ్యలు ఒంగోలు కార్పొరేషన్ ఎన్నికలలో ప్రత్యేకించి ఓటు వేయడానికి వెళ్లి వచ్చారని తెలుగుదేశం పార్టీ నాయకుడు గొట్టిపాటి రమణ వెల్లడించారు.

– ఉద్యోగం రీత్యా తాము ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారానికి వెళ్లలేకపోయినా వీలైన విధంగా అన్ని రకాలుగా కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చామని సౌదీ అరేబియాలోని జనసేన పార్టీ నాయకులు దుగ్గరపు ఎర్రన్న, యాకూబ్ ఖాన్‌లు వివరించారు. కూటమి ధర్మ కర్తవ్యాన్ని తాము నిజాయతీగా నిర్వర్తించామని జనసేన నాయకులు కేసరి త్రిమూర్తులు, చందక రాందాస్‌లు చెప్పారు.

చరిత్ర సృష్టించిన నిత్యా రామన్

◆ లాస్ ఏంజెల్స్ మేయర్ రేసులో విజయం



అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత మేయర్ కారెన్ బాస్‌ను ఓడించి లాస్ ఏంజిల్స్ మేయర్ ఎన్నికల్లో నిత్యా రామన్ విజయం సాధించారు. దీంతో ఆ నగరానికి మొట్టమొదటి ఆసియా– అమెరికన్ మేయర్‌గా ఖ్యాతి కెక్కారు. నగర స్థాయి అత్యున్నత పదవికి ఎన్నికైన రెండవ మహిళ కూడా ఆమెనే. కేరళలో జన్మించి అమెరికాలో స్థిరపడిన నిత్యా రామన్ అరుదైన రాజకీయ ఘనతనే సాధించారు. లాస్ ఏంజెలెస్ మేయర్ ఎన్నికల్లో 51.1 శాతం ఓట్లు సాధించి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుత మేయర్ కరెన్ బాస్‌కి 48.33 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. డెసిషన్ డెస్క్ హెచ్ క్యూ ఎన్నికల అంచనాల ప్రకారం నిత్యా రామన్ విజయం ఖాయమై పోయింది. దీంతో ఆమె లాస్ ఏంజెలెస్‌కి 44వ మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. నిత్యా మీనన్ 1981లో కేరళలో జన్మించారు. ఆ తర్వాత అమెరికాకి వలస వెళ్లింది కుటుంబం. 22 ఏళ్ల వయసులోనే అమెరికా పౌరసత్వం పొందారు. హార్వర్డ్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిన ఆమె.. మసాచుసెట్స్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి అర్బన్ ప్లానింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. గతంలో సామాజిక సమస్యల పరిష్కారంపై కూడా పనిచేశారు. లాస్ ఏంజెలెస్ రాజకీ యాల్లో నిత్యా రామన్‌కి అనుభవం ఉంది. 2020లో తొలిసారిగా రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి సిట్టింగ్ సిటీ కౌన్సిల్ సభ్యుడు డేవిడ్ ర్యూను ఓడించారు. మొత్తానికి అనేక విమర్శలు వ్యక్తమైనా రేసులో విజయం సాధించి సత్తా చాటారు. విజయం సాధించిన సందర్భంగా ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు.

చిత్రదుర్గలోని ఎస్‌జేఎంఐటీ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం అమెరికా లాస్‌వెగాస్ నగరంలో ఘనంగా జరిగింది. కళాశాలతో అనుబంధం ఉన్న 200 మంది పాల్గొన్నారు. ఈ ఆత్మీయ కలయికకు వెనిగళ్ల రవికుమార్ చొరవ తీసుకున్నారు.



హౌతీల దాడిలో గాయపడ్డ

తెలంగాణ వాసి మృతి





సౌదీ అరేబియా: రాజధాని రియాద్‌లోని కింగ్ ఖాలీద్ అంతర్జాతీ య విమానాశ్రయంపై గతనెలలో హౌతీలు జరిపిన దాడిలో... తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న తెలంగాణకు చెందిన వ్యక్తి మృతిచెందినట్లు బుధవారం భారత ఎంబసీ ప్రకటించింది. కామారెడ్డిలోని సైలానిబాబా కాలనీకి చెందిన షేక్ సయీద్ (40) అక్టోబరు 10న రియాద్ ఎయిర్‌పోర్ట్‌లోని ప్రఖ్యాత కాఫీ షాపులో పనిచేస్తుండగా హౌతీలు చేసిన దాడులలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత మంగళవారం మరణించాడు. రియాద్ నగరంలో అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మృతుడి ఇద్దరు సోదరులు కూడా సౌదీలోనే పని చేస్తున్నారు. సయీద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దాడి జరిగినప్పటి నుంచి ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేయడంతో భారత్ నుంచి మృతుడి కుటుంబసభ్యులు రాలేక పోయారు.

అమెరికాలో తెలంగాణ విద్యార్థిని అదృశ్యం



అమెరికా: భారత్‌కు చెందిన విద్యార్థిని అమెరికాలో అదృశ్యమైంది. మసాచుసెట్స్ రాష్ట్రంలోని బోస్టన్‌లో ఉంటున్న శ్రీజ కోయ (23) నవంబరు 3 నుంచి కనిపించడం లేదు. నవంబరు 2 సాయంత్రం తన నివాసం నుంచి బయలుదేరుతుండగా చివరిసారి కనిపించినట్లు సమాచారం. విద్యార్థి వీసాపై ఉన్న శ్రీజ తెలంగాణకు చెందిన అమ్మాయిగా తెలుస్తోంది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన బోస్టన్ పోలీసులు శ్రీజ ఆచూకీ కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. ఆమెకు సంబంధించిన ఏమైనా సమాచారం ఉంటే తెలియజేయాలని స్థానికులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

హ్యూస్టన్‌లో జన జాతీయ దివస్

అమెరికా: హ్యూస్టన్‌లోని షుగర్ ల్యాండ్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, జన జాతీయ గౌరవ దివస్ జరుపుకున్నారు. ఇందులో వివిధ ప్రవాస సంఘాలు పాల్గొన్నాయి. హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్, ప్రవాస సంఘాల సహకారంతో శ్రీ కృష్ణ వృందావన హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇది ప్రాంతీయ గుర్తింపులను ఒకచోట చేర్చి, తాము ఒక సమూహానికి చెందినవారమనే భావనను పంచుకుంది. భారతదేశపు విభిన్న ప్రాంతీయ మరియు సాంస్కృతిక సంప్రదాయాలకు చెందిన ప్రవాస సంస్థలను అనుసంధానించే ప్రయత్నంగా ఈ వేడుకను రూపొందించారని, ఇందులో ఐక్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, అస్సాం, పంజాబ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఈ స్ఫూర్తికి జీవం పోశాయి. నవంబరు 15న జరుపుకునే జనజాతియ గౌరవ్ దివస్‌కు ముందు జరిగిన ఈ కార్యక్రమంలో, భగవాన్ బిర్సా ముండా



కు, గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల శౌర్యానికి, త్యాగాలకు నివాళులర్పించారు. ముండా ప్రస్తుత జార్ఖండ్ రాష్ట్రానికి చెందినవారు. "ధర్తీ అబా"గా పూజించబడే ఆయన 19వ శతాబ్దం చివరలో దోపిడీకి గురిచేసే బ్రిటిష్ వలస పాలన, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా ఒక విశిష్టమైన గిరిజన సామాజిక–రాజకీయ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ ఉమ్మడి వేడుక ద్వారా, ప్రవాస సంస్థల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని, అలాగే వివిధ వర్గాలు ఒకరి సంప్రదాయాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి అవకాశం కల్పించాలని కాన్సులేట్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపింది.

తుఫాన్ బాధిత మైనంపాడు ప్రజలకు తానా ఆపన్నహస్తం



సంతనూతలపాడు: ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని మైనంపాడు గ్రామంలో భారీ తుఫాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆపన్నహస్తం అందించింది. తుఫాన్ ప్రభావంతో మైనంపాడు గ్రామంలోని కుటుంబాల నివాసాల్లోకి వరదనీరు చేరడంతో వంట చేసుకునే పరిస్థితి లేక చిన్నారులు, పెద్దలు ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తానా దృష్టికి వచ్చింది. ఈ పరిస్థితికి వెంటనే స్పందించిన తానా కోశాధికారి రాజా కసుకుర్తి, బాధిత కుటుంబాలకు తానా ఆధ్వర్యంలో భోజనాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. తానా ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు సహా బాధిత కుటుంబాలకు పౌష్టికాహారంతో కూడిన భోజనాలను పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో తమ ఆకలిని తీర్చేందుకు ముందుకు వచ్చిన తానా సేవలను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా తానా కోశాధికారి రాజా కసుకుర్తి మాట్లాడుతూ "ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత. అవసరంలో ఉన్న వారికి సకాలంలో సహాయం అందించడమే తానా సేవా లక్ష్యం" అని పేర్కొన్నారు.

జ్ఞానేశ్‌పై విచారణకు కేరళం హోంమంత్రి ఆదేశం

తిరువనంతపురం: సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై వచ్చిన రూ.2 కోట్ల లంచం ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరపాలని కేరళం హోంమంత్రి రమేశ్ చెన్నితల విజిలెన్స్ విభాగాన్ని ఆదేశించారు. 2006లో కేరళంలో 'కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్' '(కేఎస్‌టీపీ) కింద రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. ఆ సమయంలో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన జ్ఞానేశ్ కుమార్, ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన రూ.17 కోట్ల బిల్లులను క్లియర్ చేయడానికి రూ.2 కోట్ల లంచం డిమాండ్ చేశారని సాజన్ అనే కాంట్రాక్టర్ హోంశాఖకు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా ఈ ప్రాజెక్టుతో ముడిపడి ఉన్న మలేషియాకు చెందిన కన్సల్టింగ్ ఇంజనీర్ 'లీసీ బీన్' ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఆయన రాసిన సూసైడ్ నోట్‌లో కూడా ఈ లంచం వ్యవహారానికి సంబం ధించిన ప్రస్తావన ఉందని తెలిపారు. ఈ ఆరోపణలపై న్యాయ సలహా తీసుకున్న హోంమంత్రి రమేశ్ చెన్నితల విచారణకు ఆదేశించి నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా, ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీల) కు కల్పించిన చట్టపరమైన రక్షణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ (ఈసీఐ)లకు నోటీసులు జారీ చేసింది. అభిప్రాయాన్ని చెప్పాలని ఆదేశించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం-2023లోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను పిటిషనర్ సవాల్ చేశారు. విధుల్లో భాగంగా సీఈసీ, ఈసీలు తీసుకునే నిర్ణయాలు, చర్యలపై సివిల్, క్రిమినల్ కేసులు నమోదు కాకుండా.. కోర్టులు విచారణ చేపట్టకుండా సెక్షన్ 16 రక్షణ కల్పిస్తుంది.




ఢిల్లీలో కుప్పకూలిన మూడంతస్తుల భవనం

శిథిలాల కింద పలువురు!



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గురువారం ఉదయం భారీ ప్రమాదం చోటుచేసుకుంది. పాత ఢిల్లీలోని చావ్డీ బజార్ ప్రాం తంలో నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. చావ్డీ బజార్ మెట్రో స్టేషన్ సమీపంలోని గలీ సితారా వద్ద ఉదయం ఈ ఘటన జరిగినట్లు సమాచారం. భవనం కూలిపోవడంతో భారీగా శిథిలాలు రోడ్డుపై పడిపోయా యి. ఈ ప్రమాద సమయంలో పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఒక్కసారిగా భవనం కూలిపోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచా రం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చేం దుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సహాయక చర్యల కోసం నీటి ట్యాంకర్లు, రెస్క్యూ వాహనాలతో పాటు కనీసం ఆరు అగ్నిమాపక బృందాలను అక్కడికి పంపించినట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాలను తొలగిస్తూ లోపల ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణం లో గాలింపు చేపడుతున్నారు. మరోవైపు సీనియర్ అధికారులు స్వయంగా ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ట్లు తెలిపారు. భవనం కూలిపోవడానికి గల కారణాలు, ప్రమాద సమయంలో భవనంలో ఎంతమంది ఉన్నారు, ఎంతమంది గాయపడ్డారు అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాల రొటేషన్‌కు నో



న్యూఢిల్లీ: పార్లమెంటు, శాసనసభల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వుడ్ నియోజక వర్గాలను రొటేషన్ పద్ధతిలో మార్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపు చ్చింది. ఈ అంశం పూర్తిగా పార్లమెంటు పరిధిలోకి వస్తుందని, ఇందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ మోహనలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ తీర్పు వెలువరించింది. ఉత్తర ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా 'కదిపూర్' అసెంబ్లీ స్థానం ఏడు దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వుడ్ స్థానంగానే కొనసాగడాన్ని సవాల్ చేస్తూ జగదీశ్‌సింగ్ అనే ఓటరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రోటేషన్ విధానం లేకపోవడం వల్ల జనరల్ కేటగిరీ ఓటర్ల హక్కు లు దెబ్బతింటున్నాయని.. పంచాయతీ, మునిసిపాలిటీల్లో లాగే ఇక్కడ కూడా రోటేషన్ విధానం తీసుకురావాలని కోరారు.

అదుపులో తీసుకున్న క్షణం నుంచే

24 గంటల డెడ్‌లైన్: సుప్రీంకోర్టు



ఢిల్లీ: అరెస్టులు, నిర్బంధాలు, న్యాయస్థానాల ముందు హాజరుపర్చే విషయంలో 24 గంటల గడువు వంటి అంశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చడానికి రాజ్యాంగం విధించిన 24 గంటల డెడ్‌లైన్ ప్రారంభం అవుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు చేసినప్పటి నుంచి కాకుండా అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే ఆ సమయాన్ని లెక్కించాలని తేల్చిచెప్పింది. "అధికారికంగా అరెస్టు జరిగినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభం అవుతుందనే అభిప్రాయం భారతీయ న్యాయసంహిత లోని సెక్షన్లకు విరుద్ధం. అదుపులోకి తీసుకోవడానికి, అరెస్టుకు మధ్య వ్యత్యాసాన్ని చూపించి న్యాయపరమైన విచారణను ఆలస్యం చేయడానికి అధికారులకు అనుమతిలేదు. ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా నిలిపివేయడం, ఆలస్యం చేయడం రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో చెల్లదు. వ్యక్తులను కోర్టులో హాజరుపర్చినప్పుడు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న తేదీ, సమ యాన్ని మేజిస్ట్రేట్లు కచ్చితంగా నమోదు చేయాలి. 24 గంటల నిబంధన పాటించారో లేదో పరిశీలించాలి" అని సుప్రీం ధర్మాసనం. 24 గంటల డెడ్‌లైన్ విషయంలో ఒరిస్సా హైకోర్టు, మద్రాస్ హైకోర్టు. కేరళ హైకోర్టు వెలువరించిన అభిప్రాయాలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అధికారిక అరెస్టుకు ముందు నిర్బం ధంలో ఉన్న కాలాన్ని మినహాయించడానికి ఆయా న్యాయస్థానా లు. గతంలో అనుమతించాయి. దీన్ని అత్యున్నత న్యాయస్థానం వ్యతిరేకించింది. అరెస్టు జరిగిన ప్రదేశం నుంచి కోర్టు వరకు ప్రయాణానికి పట్టే సమయాన్ని మినహా ఇంకే మినహాయింపులు ఉండకూడదని సుప్రీం ధర్మాసనం స్పష్టంగా చెప్పింది. సుజిత్ దాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణ సంద ర్భంగా సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది.

కేసు వివరాలు ఏంటంటే...

త్రిపురలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో గతేడాది సెప్టెంబరు 29న మధ్యాహ్నం సమయంలో నిందితుడు సుజిత్ దాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే సెప్టెంబర్ 30 ఉదయం మాత్రమే అతడిని అధికారికంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. అయితే ఉద్దేశపూర్వకంగానే రికార్డుల్లో అరెస్టు సమయాన్ని ఆలస్యంగా చూపించారని నిందితుడి తరపు న్యాయవాదులు వాదించారు. ఇది రాజ్యాంగంలోని నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందంటూ సుప్రీంకోర్టు ఆశ్రయించారు. కానీ, అధికారికంగా అరెస్టు చేసిన సమయం నుంచే 24 గంటలు గడువు వర్తిస్తుందని దర్యాప్తు సంస్థలు కోర్టుకు విన్నవించాయి. దీన్ని న్యాయస్థానం తోసిపుచ్చిం ది. అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే డెడ్‌లైన్ వర్తిస్తుందంటూ తాజాగా తీర్పునిచ్చింది.

మహిళ కిడ్నాప్ డ్రామా.. వెలుగులోకి బంగారం స్మగ్లింగ్ వ్యవహారం



కేరళం: దుబాయ్ నుంచి తీసుకొచ్చిన బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ ఓ మహిళ అడ్డంగా బుక్కైంది. బంగారాన్ని అప్పగించాల్సిన వ్యక్తికి ఇవ్వకుండా తానే కాజేయాలని ఆమె వేసిన కిడ్నాప్ ప్లాన్ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. దాదాపు 12 కిలోమీటర్ల పాటు సినిమా రేంజ్ ఛేజింగ్ చేసిన పోలీసులు.. నిందితురాలితో పాటు పలువురిని అరెస్టు చేశారు. అయితే, మహిళ వేసిన ప్లాన్ చూసి పోలీసులే కంగుతిన్నారు. వెంటనే అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపించారు. ఈ ఘటన కేరళంలోని కరిపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో చోటుచేసుకుంది. తలస్సేరికి చెందిన ప్రియాంక అనే మహిళ దుబాయ్ నుంచి సుమారు 18 సవర్ల బంగారంతో కేరళంలోని కరిపూర్ అంతర్జాతీయ విమానాశ్రయా నికి చేరుకుంది. ఆ బంగారాన్ని విమానాశ్రయం బయట వేచి ఉన్న మట్టన్నూర్‌కు చెందిన జబీర్ అనే వ్యక్తికి అప్పగించాల్సి ఉంది. అయితే బంగారాన్ని అతనికి ఇవ్వకుండా తానే కాజేయా లని ప్రియాంక ప్లాన్ వేసింది. ఈ మేరకు కన్నూర్‌కు చెందిన శ్రీలాల్, ప్రిన్స్, సుభిత్ అనే ముగ్గురితో చేతులు కలిపింది. జబీర్ కు బంగారాన్ని ఇవ్వడానికి ముందే తనను ఎవరో కిడ్నాప్ చేసినట్లు నాటకానికి తెరతీసింది నిందితురాలు. ఇందులో భాగంగా ప్రియాంకను తీసుకెళ్లేందుకు శ్రీలాల్ ఓ కారుతో విమానాశ్రయానికి వచ్చాడు. ఈ సందర్భంగా కిడ్నాప్ పథకాన్ని అమలు చేశారు. ప్రియాంకను ఎవరో తీసుకెళ్తున్నట్లు గుర్తించిన జబీర్ ఆ కారు వెంబడి పరిగెత్తాడు. ఇది కరిపూర్ విమానాశ్రయ పోలీస్ స్టేషన్ అధికారి గమనించారు. కిడ్నాప్ జరుగుతోందని అనుమానించిన ఆయన వెంటనే పోలీసు వాహనంతో కారును వెంబడించారు. దాదాపు 12 కిలోమీటర్ల పాటు ఛేజ్ చేసి కారును నిలువరించారు. అందులో ఉన్నవారిని సురక్షితంగా కాపాడారు. అయితే ప్రియాంక పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసు లు విచారణ చేపట్టారు. దీంతో అసలు విషయం బయటపడింది. అక్రమ బంగారాన్ని కాజేసేందుకు తానే ప్లాన్ వేసినట్లు ప్రియాంక అంగీకరించింది. దీంతో ప్రియాంక, ఆమెకు సహకరించిన ముగ్గురు సహా జబీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, ఈ కుట్రతో ప్రియాంక భర్తకు ఎలాంటి సంబంధం లేదని తేల్చారు. భర్త, పిల్లలను తీసుకురావడం ద్వారా కిడ్నాప్ వ్యవహారం సహజంగా కనిపించేలా ప్రియాంక ప్లాన్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ బంగారం స్మగ్లింగ్ వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు, కస్టమ్స్ సిబ్బందికి ఏమైనా సంబంధాలున్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికా రాజకీయాల్లో
ఒబామా 'వారసుడు'



అమెరికా: అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో ఈసారి పలువురు యువ రాజకీయ నాయకులు తమ సత్తా చాటారు. భవిష్యత్తు రాజకీయాల్లో కీలకం కాబోతున్నామని స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఈ జాబితాలో టాప్‌లో నిలిచిన జాన్ ఒసాఫ్‌పై ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబా మాకు రాజకీయ వారసుడిగా, తదుపరి ఒబామాగా పరిశీలకులు ఆయనను అభివర్ణిస్తున్నారు.

ఎవరీ జాన్ ఒసాఫ్..

రాజకీయాల్లోకి రాకమునుపు ఒసాఫ్ ఓ డాక్యుమెంటరీ ప్రొడక్ష న్ సంస్థను నిర్వహించారు. తన డాక్యుమెంటరీల్లో అవినీతిని ఎండగట్టారు. ప్రముఖ పౌర హక్కుల కార్యకర్త జాన్ ల్యూయిస్‌కు సహాయకుడిగా కూడా పని చేశారు. 2021లో తొలిసారిగా ఆయన జార్జియా రాష్ట్రంలో రిపబ్లికన్లకు షాకిచ్చారు. ఆ ఎన్నికల్లో రిపబ్లికన్ సెనేటర్‌ను ఓడించి విజేతగా నిలిచారు. తాజా ఎన్నికల్లో ప్రచారం కోసం ఏకంగా 100 మిలియన్ నిధులను సమీకరించా రు. 2024లో జార్జియా ఓటర్లు ట్రంప్‌నకు బ్రహ్మరథం పట్టారు. అలాంటి రాష్ట్రంలో ఈసారి జరిగిన మిడ్‌టర్మ్ ఎన్నికల్లో మరోసారి రిపబ్లికన్ అభ్యర్థి మైక్ కాలిన్స్‌ను ఓడించి సెనేటర్‌గా మరోసారి ఎన్నికయ్యారు. ఒసాఫ్ అట్లాంటాలోఉంటున్నారు. ఆయన భార్య పేరు డా. అలీషా క్రామర్. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇక సెనేటర్‌గా తొలి పర్యాయంలోనే ఆయన తన సత్తా చాటారు. ప్రైవెటైజ్డ్ హౌసింగ్‌లో మిలిటరీ ఉద్యోగుల కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు, దత్తత వెళ్లిన పిల్లల అవస్థలు, జైళ్లల్లో అవినీతిని ఎండగట్టేందుకు దర్యాప్తులకు నేతృత్వం వహించారు. జాతీయ భద్రతకు సంబంధించి అమెరికా ఉన్నతాధికారుల చాట్‌గ్రూప్‌లో ఓ జర్నలిస్టు చొరబడటంపై కూడా ఆయన దర్యాప్తు చేశారు. విచారణ సందర్భంగా ఏకంగా సీఐఏ డైరెక్టర్‌ను సూటి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ ఉదంతం దేశానికే తలవంపులు అంటూ ఉన్నతాధికారులను కడిగిపారేశారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పులను ఎండగట్టడంలో ముందుండే ఒసాఫ్ తన వాక్పటిమ, అభ్యుదయ వాద భావాల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను గుర్తుకు తెస్తారని పరిశీలకులు కామెంట్ చేస్తున్నారు. అమెరికాలో తదుపరి ఒబామా ఒసాఫ్ అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

ట్రంప్‌నకు పరాభవం

- మధ్యంతర ఎన్నికల్లో చిత్తుగా ఓడిన రిపబ్లికన్ పార్టీ
- ప్రతినిధుల సభ, సెనేట్ రెండింట్లోనూ డెమోక్రాట్ల హవా
- పెరిగిన ధరల సెగ.. ఇరాన్ యుద్ధం ప్రభావం
- స్వయంగా ప్రచారం చేసి తననే అభ్యర్థిగా భావించి ఓటేయాలన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఆయనపై అసంతృప్తిని ఓట్లతో చెప్పిన అమెరికన్లు
- దశాబ్దాలుగా పట్టున్న రాష్ట్రాల్లోనూ ఎదురుదెబ్బ
- మిగతా స్థానాలకు కొనసాగుతున్న కౌంటింగ్
- ట్రంప్ విధానాల అమలుకు కాంగ్రెస్‌లో ఆటంకమే
- ఆయనకు ఇకపై ఎగ్జిక్యూటివ్ ఆదేశాలే దిక్కు



వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు ట్రంప్‌కు పరాభవం ఎదురైంది. ట్రంప్ ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీకి ఊహించలేని షాక్ తగిలింది. స్వయంగా ప్రచారం చేసి, తననే అభ్యర్థిగా భావించి ఓటువేయాలని ట్రంప్ అభ్యర్థించినా ప్రతికూల ఫలితమే ఎదురైంది. అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ భారీ మెజారిటీ సాధించిన రాష్ట్రాల్లోనూ ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ విధానాలపై ముఖ్యంగా విపరీ తంగా పెరిగిపోయిన నిత్యావసరాలు, డీజిల్ ధరలు, ఇరాన్‌తో యుద్ధం, వీసాల విధానంపై ఇష్టారాజ్యంగా మార్పులు వంటి అంశాల్లో అమెరికా ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. అంచనాలకు మించి డెమోక్రాట్ల హవా కనిపించింది. దశాబ్దాలుగా రిపబ్లికన్లకు కంచుకోటలుగా ఉన్న రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు విజయకేతనం ఎగురవేశారు. అమెరికా పార్లమెంటు అయిన కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటిలోనూ రిపబ్లికన్లు పట్టుకోల్పోయారు. కీలక రాష్ట్రాల్లోని గవర్నర్ పదవులనూ డెమోక్రాట్లు కైవసం చేసుకున్నారు. మొత్తంగా అధ్యక్షుడు ట్రంప్‌కు ముకుతాడు వేసే అవకాశం డెమో క్రాట్లకు చిక్కింది. ట్రంప్ అధ్యక్షుడిగా కొనసాగే మరో రెండేళ్ల పాటు ఆ దేశ నిర్ణయాలు, వ్యవహారాలను నియంత్రించే అవకాశం వచ్చింది. దీనితో అమెరికాలో పాలన, విధానాలకు సంబంధించిన అంతర్గత అంశాలతో పాటు అమెరికా చేస్తున్న యుద్ధాలు, వివిధ దేశాలపై వేస్తున్న సుంకాలు, ఆ దేశ విదేశాంగ విధానాలు, వాణిజ్యం వంటి అంతర్జాతీయ అంశాలెన్నో.. మధ్యంతర ఎన్నికల ఫలితాలతో ప్రభావితమయ్యే పరిస్థితి నెలకొంది.

కంచుకోటల్లోనూ ఎదురుదెబ్బ

చాలా ఏళ్లుగా రిపబ్లికన్ పార్టీకి కంచుకోటల్లా ఉన్న రాష్ట్రా ల్లోనూ ఇప్పుడు ఎదురుదెబ్బ తగిలింది. టెక్సాస్, జార్జియా, అయోవా, ఓహియో వంటి రాష్ట్రాల్లో గవర్నర్ పదవులు డెమో క్రాట్ల పరమయ్యాయి. టెక్సాస్, మేన్, దక్షిణ కరోలినా, ఉత్తర కరోలినా, కాన్సాస్, అయోవా, ఓహియో రాష్ట్రాల్లో రిపబ్లికన్లు దారుణ ఓటమి చవిచూశారు. మొత్తం 100 స్థానాలున్న సెనేట్‌లో గత ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ 53 సీట్లు, డెమోక్రాట్లు 47 సీట్లు గెలుచుకున్నారు. ఇప్పుడు డెమోక్రాట్లకు 54 సీట్లు, రిపబ్లికన్లకు 44 సీట్లు, స్వతంత్రులకు 2 సీట్లు వచ్చాయి. ఇక ప్రతినిధుల సభలోని మొత్తం 415 స్థానాలకుగాను గత ఎన్నికల్లో రిపబ్లికన్లకు 220, డెమోక్రాట్లకు 215, ఇతర పార్టీలు, స్వతం త్రులకు 10 స్థానాలు దక్కాయి. ఇప్పుడు డెమోక్రాట్లు ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్ అయిన 218 స్థానాలను దాటేసి.. 228 సీట్లు గెలుచుకున్నారు. రిపబ్లికన్లకు 139 సీట్లు దక్కాయి. మిగతా స్థానాల ఫలితాలు వెలువడాల్సి ఉంది.

ట్రంప్ ధోరణిపై పెల్లుబికిన వ్యతిరేకత!

మధ్యంతర ఎన్నికల సందర్భంగా ట్రంప్‌పై అమెరికా ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. జార్జియాలోని ఒక పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు మీడియాతో మాట్లాడుతూ.. "ట్రంప్ విధానాలు అవమానకరం. ఆయన మా పిల్లలకు ఆదర్శంగా ఉండాలని ఏమాత్రం కోరుకోవడం లేదు. ఆయన ఎంత త్వరగా పదవి నుంచి దిగిపోతే అంత మంచిది" అని వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక ఎన్నికల సమయంలో సర్వే నిర్వహించిన అసోసి యేటెడ్ ప్రెస్ (ఏపీ) వార్తా సంస్థ.. దాదాపు 60శాతం మంది ఓటర్లలో ట్రంప్ పనితీరుపై అసంతృప్తి కనిపించిందని తెలిపింది. అధ్యక్షుడి అధికారాలను నియంత్రించేందుకు, సమతుల్యత ఉండేందుకు కాంగ్రెస్ మరింత చురుగ్గా వ్యవహరించాలని 70 శాతం మంది కోరుకుంటున్నారని పేర్కొంది.

సొంత పార్టీలోనూ ట్రంప్‌పై అసంతృప్తి

ట్రంప్ విధానాలు, ఆయన వ్యవహార శైలిపై రిపబ్లికన్ పార్టీలోనూ అసంతృప్తి, వ్యతిరేకత కనిపించాయి. చాలా రాష్ట్రాల్లో రిపబ్లికన్ల మధ్య విభేదాలూ ఎన్నికల సమయంలో బయటపడ్డాయి. ట్రంప్ తర్వాత అధ్యక్ష అభ్యర్థిగా నిలవొచ్చని ప్రచారం జరిగిన వారిలో ఒకరైన వివేక్ రామస్వామి.. ఓహియో గవర్నర్ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. "ఇక ట్రంప్ శకం ముగిసినట్టే.." అని రిపబ్లికన్ నేత క్రిస్ కిస్టీ వ్యాఖ్యానించారు. పలు రాష్ట్రాల్లో రిపబ్లికన్లు ట్రంప్ అనుకూల, ఆయన విధానాలను వ్యతిరేకించే వర్గాలుగా విడిపోవడంతోనూ.. ప్రతికూల ఫలితాలు వచ్చాయని నిపుణులు చెబుతున్నారు.

ట్రంప్‌కు ఎగ్జిక్యూటివ్ ఆదేశాలే దిక్కు!

కాంగ్రెస్ ఉభయ సభల్లో డెమోక్రాట్లకు పూర్తి మెజారిటీ రావడంతో ట్రంప్ ఇష్టానుసారం పాలన సాగించే అవకాశాలకు అడ్డుకట్ట పడనుంది. ఆయన సూచనలు, నిర్ణయాలకు అనుగుణం గా రిపబ్లికన్లు ప్రవేశపెట్టే బిల్లులు ఆమోదం పొందడం, చట్టాలుగా మారడం కష్టమే. అయితే ట్రంప్ పదవీకాలం ముగిసే వరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు (మనదేశంలో ఆర్డినెన్స్‌ల తరహాలో) జారీ చేస్తూ.. తన నిర్ణయాలను అమల్లోకి తీసుకురావొచ్చు. కానీ ఆయా అంశాలను బట్టి సదరు ఆదేశాలు నిర్దిష్ట కాలం పాటు మాత్రమే అమల్లో ఉంటాయి. తర్వాత మళ్లీ ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుంది. అదీ కోర్టుల్లో ప్రతికూల తీర్పులు రాకుంటే మాత్రమే. అయితే కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు ఆమోదించి పంపే బిల్లులను తిరస్కరించే అధికారం అధ్యక్షుడు ట్రంప్‌కు ఉంటుంది. దీనితో అధ్యక్షుడు తన ఆదేశాలపై, డెమోక్రాట్లు తమ బిల్లులపై పరస్పరం చర్చించి, మార్పులు చేసుకుని అమల్లోకి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

మిడ్‌టర్మ్ ఎన్నికల్లో ట్రంప్ ఓటమి
ప్రపంచ నేతల కామెంట్స్

అమెరికా: ఇటీవల కాలంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన విధానాలతో పలు దేశాలకు చుక్కలు చూపించారు. అమెరికన్లకు మేలు చేసేందుకే ఈ విధానాలు అవలంబిస్తున్నానని చెప్పారు. మిడ్‌టర్మ్ ఎన్నికల్లో మాత్రం అధికార రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులు ఘోర ఓటమిని చవిచూశారు. ఈ ఫలితాలపై వివిధ దేశాల్లోని నేతలు పలు కీలక కామెంట్స్ చేశారు.

ఇరాన్: మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాల తరువాత ట్రంప్ ఇరాన్ విషయంలో తన తీరు మార్చుకుంటారని తాను భావించట్లేదని సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కామెంట్ చేశారు. యుద్ధాన్ని అమెరికన్లు తిరస్కరించారని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ గాలిబఫ్ వ్యాఖ్యానించారు.

స్పెయిన్: ట్రంప్ రాజకీయ విధానాలను అమెరికన్లు తిరస్కరించారని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ తెలిపారు. ఇది ద్వేషానికి వ్యతిరేకంగా ప్రజాతీర్పు అని అన్నారు.

రష్యా: మిడ్‌టర్మ్‌పై రష్యా ఆచితూచి స్పందించింది. శాంతిస్థాపనకు ట్రంప్ తన దౌత్యప్రయత్నాలను కొనసాగించాలని ఆశిస్తున్నట్టు రష్యా ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. ఈ ఫలితాల ఆధారంగా ఓ అంచనాకు రావడం తొందరపాటు అవుతుందని రష్యా చట్టసభల సభ్యుడు లియోనిడ్ స్లస్కీ అభిప్రాయపడ్డారు.

ఈయూ: ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు, పర్యావరణ రక్షణకు ఈ ఫలితాలు మేలు కలిగించే అవకాశం ఉందని యూరోపియన్ పార్లమెంటు వైస్ ప్రెసిడెంట్ క్రిస్టెల్ పేర్కొన్నారు.

యూకే: అమెరికా రాజకీయాల్లో



మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలు ఓ కీలక పరిణామమని యూకే ఆరోగ్య శాఖ మంత్రి పేర్కొన్నారు. అమెరికాతో సత్సంబంధాలు కొనసాగిస్తామని చెప్పారు.

చైనా: మిడ్‌టర్మ్ ఫలితాలు అమెరికా అంతర్గత విషయమని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. అమెరికాతో సత్సంబంధాలు కొనసాగించేందుకు తాము ఎప్పుడూ సిద్ధమేనని పేర్కొన్నారు.

నార్వే: అమెరికా ప్రజలు కొత్త రాజకీయ దిశను కోరుకుంటున్నట్టు మిడ్‌టర్మ్ ఫలితాలు స్పష్టం చేశాయని నార్వే ప్రధాని జోనాస్ స్టోర్ తెలిపారు.

దక్షిణాఫ్రికా: భౌగోళిక రాజకీయాల్లో ఇదో కీలక మలుపని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోస పేర్కొన్నారు.

భారత్ జంటపై అమెరికా ఆంక్షలు

అమెరికా: భారత్‌కు చెందిన వ్యాపారవేత్త.. ఆయన భార్యపై అమెరికా ఆంక్షలు విధించింది. వారితో పాటు భారత్, తుర్కియేలోని పలు కంపెనీలు, వ్యక్తులను ఈ ఆంక్షల జాబితాలో చేర్చింది. చమురు ఎగుమతుల విషయంలో అంతర్జాతీయ ఆంక్షలను తప్పించడానికి ఇరాన్‌కు సహకరించారన్న ఆరోపణలపై అగ్రరాజ్యం ఈ చర్యలు తీసుకుంది. మధ్యంతర ఎన్నికల ఫలితాల అనంతరం అమెరికా ట్రెజరీ విభాగం నుంచి ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. ఇరాన్ ఆర్థిక వనరులను పూర్తిగా దెబ్బతీసేందుకు, ఆ దేశాన్ని అంతర్జాతీయంగా ఒంటరిని చేసేందుకు అమెరికా 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్ కాస్ట్' పేరిట ఆంక్షలు విధిస్తోంది. అలాగే ఇరాన్ ప్రభుత్వానికి సహకరించే వారినీ వదలబోమని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది. ఈ క్రమంలోనే భారత్కు చెందిన సునీల్ కుమార్ శర్మ, ఆయన భార్య జస్ ప్రీత్ ప్రీతి షాహిద్‌తో పాటు మరో ఇద్దరు భారతీయులపై ఆంక్షలు విధించింది. అలాగే శర్మకు చెందిన 9 సంస్థలు కూడా ఆంక్షల జాబితాలో ఉన్నాయి. "ఇరాన్ పెట్రోలియం రవాణాలో భాగమై ఆంక్షలకు గురైన నౌకలకు తప్పుడు గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలను అందించడంలో వారు సహకరించారు.

ఇరాన్ సైన్యం, దాని అనుబంధ సంస్థల నౌకలకు కూడా ఈ తరహా సేవలు అందించారు" అని ట్రెజరీ విభాగం పేర్కొంది. అలాగే తుర్కియేకు చెందిన పుగో గ్రౌండ్ సర్వీసెస్ సంస్థ పేరునూ ఈ ఆంక్షల జాబితాలో చేర్చారు. ఇరాన్ విమానయాన రంగానికి మద్దతు ఇస్తున్నందని ఆరోపిస్తూ అగ్రరాజ్యం ఈ చర్యలు తీసుకుంది. "మీరు మాతో ఉన్నారా? మాకు వ్యతిరేకంగా ఉన్నారా? అనేది మేం తెలుసుకుంటాం. ఇరాన్ పాలనకు మద్దతు ఇచ్చే వారిపై ఆంక్షలు తప్పవు" అని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ మరోసారి హెచ్చరించారు.

అమ్మాయిల తొలి ప్రత్యర్థి మలేసియా



ఓవైపు పురుషుల హాకీ చాంపియన్స్ ట్రోఫీ జరుగుతుండగా, మహిళల టోర్నీ షెడ్యూల్ కూడా వచ్చేసింది. వచ్చే నెల 19 నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా మహిళల చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. ఆతిథ్య భారత్, జపాన్, చైనా, మలేసియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా పోటీపడే ఈ టోర్నీ నవంబరు 28న ముగియనుంది. హ్యాట్రిక్ టైటిల్‌పై కన్నేసిన భారత్ తన పోరును తొలిరోజు మలేసియాతో ఆడనుంది. అదే రోజు జరిగే ఆరంభ మ్యాచ్‌లో చైనా, థాయ్‌లాండ్ తలపడతాయి. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లను 21న కొరియాతో, 22న థాయ్‌లాండ్‌తో, 24న చైనాతో, 25న జపాన్‌తో ఆడనుంది.

ముంబై, వడోదరలో డబ్ల్యూపీఎల్



జనవరి 14న లీగ్ ప్రారంభం - ఫిబ్రవరి 7న ఫైనల్

వచ్చే సీజన్ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) పూర్తిస్థాయి షెడ్యూల్ వచ్చేసింది. ముంబై, వడోదర నగరాలు లీగ్‌కు ఆతిథ్యమివ్వనున్నాయని బీసీసీఐ బుధవారం ప్రకటించిం ది. వచ్చే జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు లీగ్ జరగ నుందని తెలిపింది. జనవరి 14 నుంచి 24 వరకు 11 మ్యాచ్‌లు వడోదరలో జరుగుతాయి. ఆ తర్వాత మిగతా 11 మ్యాచ్‌లు జనవరి 26 నుంచి ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియంలో నిర్వ హిస్తారు. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు, రెండుసార్లు విజేత ముంబై తలపడతాయి.

లక్ష్యం 254..హైదరాబాద్ 13/2



చత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలీట్ గ్రూప్ బి మ్యాచ్‌లో హైదరాబాద్ తడబడుతోంది. మూడో రోజు బుధవారం తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులకే ఆలౌటైంది. తనయ్ (34) ఫర్వాలేదనిపించాడు. ధర్మేంద్రసింగ్ జడేజాకు ఐదు, దేవ్ ఆదిత్య.. జయంత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత నాలుగు పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన చత్తీస్‌గఢ్ 254 రన్స్‌కు ఆలౌటైంది. మయాంక్ (81), సంజీత్ (51) హాఫ్ సెంచరీలు చేశారు. రక్షణ్, అనికేత్‌లకు మూడేసి, రుతిక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 259 పరుగుల ఛేదనలో హైదరా బాద్ ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 13 పరుగు లకే 2 వికెట్లు కోల్పోయింది. క్రీజులో అభిరత్ (8), రాహుల్ (3) ఉన్నారు. గురువారం ఆటకు చివరి రోజు కావడంతో హైదరాబాద్ విజయానికి మరో 246 రన్స్ కావాలి. చత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులు చేసింది.



రిటైర్మెంట్ ప్రకటించిన క్రిస్టియానో రొనాల్డో

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో అంతర్జా తీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా రిటైర్మెంట్ ప్రకటించాడు. గత నెలలో నేషన్స్ లీగ్ మ్యాచ్లో కోచ్ జార్జ్ జీసస్.. రొనాల్డోను ఆడించకపోవడంతో వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో ఈ స్టార్ ప్లేయర్ జట్టు శిబిరం నుంచి బయటకు వచ్చాడు. ఇది జరిగిన కొన్ని రోజులకే అతడు రిటైర్మెంట్ ప్రకటన చేయడం గమనార్హం. 41 ఏళ్ల రొనాల్డో పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 140 గోల్స్ సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్లో అత్యధిక గోల్స్ కొట్టిన ఘనత అతడిదే. వ్యక్తిగతంగా ఎంత సాధించినా.. తన జట్టును ప్రపంచకప్‌లో విజేతగా నిలిపి, ట్రోఫీని చేతిలోకి తీసుకుంటేనే ఏ ఆటగాడి కెరీర్ అయినా పరిపూర్ణం అవుతుంది. రొనాల్డోకు మాత్రం ఈ టైటిల్ అందని ద్రాక్షే అయింది. అంతర్జాతీయ కెరీర్ కు వీడ్కోలు పలికినా కొన్నేళ్లు క్లబ్ ఆటగాడిగా ఆలరించనున్నాడు. "పోర్చుగీస్ ప్రజలారా, మన జాతీయ జట్టుకు చెందిన 7వ నెంబర్ జెర్సీని తిరిగి ఇచ్చే సమయం వచ్చేసింది. ఈ జెర్సీ నా ఒక్కడిదే అని ఎప్పుడూ అనుకోలేదు. కానీ 23 సంవత్సరాలుగా దానిని ధరించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టేడియాలకు నాతో పాటు తీసుకువెళ్లే అదృష్టం, బాధ్యత నాకు దక్కింది. నేడు దీనిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇది అంత సులభమైన నిర్ణయం కాదు. ఎందుకంటే కొన్ని నిర్ణయాలను కేవలం బుద్ధితో మాత్రమే తీసుకోలేం, వాటి వెనుక హృదయ స్పందన కూడా ఉంటుంది. 2003 ఆగస్టులో మొదలై, నా జీవితా న్ని పూర్తిగా మార్చివేసిన ఒక ప్రయాణం నేటితో ముగిసింది" అని రొనాల్డో తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు. రొనాల్డోను 3 యూఈఎఫ్ఎ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు, 4 యూరోపియన్ గోల్డెన్ షూ పురస్కారాలు వరించాయి. ఐదుసార్లు ఫిఫా అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికయ్యాడు. రొనాల్డో జట్టులోకి వచ్చాక ప్రపంచకప్‌లో పోర్చుగల్ అత్యుత్తమ ప్రదర్శన సెమీ ఫైనల్. అది క్రిస్టియానో ఆరంగేట్రం చేసిన 2006 టోర్నీనే కావడం విశేషం.

వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు పీవీ సింధు



మళ్లీ ఫామ్‌ను అందిపుచ్చుకొన్న ఏస్ షట్లర్ పీవీ సింధు.. 2022 తర్వాత తొలిసారి ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తోన్న 31 ఏళ్ల సింధు.. గతవారం హైలో ఓపెన్, జూలైలో జపాన్ ఓపెన్ టైటిళ్లు నెగ్గింది. అంతకుముందు ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరింది. దీంతో వరల్డ్ టూర్ ఫైనల్స్ తాజా ర్యాంక్‌ల జాబితాలో రెండు స్థానాలు ఎగబాకిన సింధు ఆరో స్థానంలో నిలిచింది. దీంతో ఆమె మెగా టోర్నీకి అర్హత సాధించినట్టు బుధవారం బ్యాడ్మింటన్ వరల్డ్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తెలిపింది. చైనాలోని హాంగ్‌జౌలో డిసెంబరు 9 నుంచి 13 వరకు వరల్డ్ టూర్ ఈవెంట్ జరగనుంది. ఈ టోర్నీలో టాప్-8 ర్యాంక్ షట్లర్లు మాత్రమే పాల్గొంటారు. ఈ మెగా టోర్నీకి సింధు అర్హత సాధించడం ఇది ఆరోసారి కాగా, 2022లో సింధు గాయంతో తప్పుకొంది. ఇక, 2018లో సింధు ఈ టోర్నీ విజేతగా నిలిచింది.

సెమీస్ చేరి.. రికార్డుకెక్కి..

బ్యాడ్మింటన్ సెమీస్‌కు తన్వీ పత్రి



యూత్ ఒలింపిక్స్‌లో భారత షట్లర్ తన్వీ పత్రి సెమీఫైనల్‌కు చేరుకొంది. బుధవారం జరిగిన బ్యాడ్మింటన్ సింగిల్స్ క్వార్టర్స్‌లో తన్వీ 21-17, 21-13తో కంగ్‌క్యు కకానిక్(థాయ్‌లాండ్)పై గెలిచింది. దీంతో యూత్ ఒలింపిక్స్‌లో సెమీస్ చేరిన తొలి భారత మహిళా షట్లర్‌గా ఒడిశాకు చెందిన 15 ఏళ్ల తన్వీ రికార్డుల కెక్కింది. గతంలో హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్, ఆదిత్య జోషి పురుషుల విభాగంలో సెమీస్‌కు చేరారు. ప్రణయ్, లక్ష్య సేన్‌లు ఫైనల్స్‌లో ఓడి రజతాలు దక్కించుకోగా.. ఆదిత్య సెమీస్‌లోనే ఓడి పతకం లేకుండానే వెనుదిరిగాడు.

డబ్ల్యూపీఎల్ 2027 షెడ్యూల్ రిలీజ్

తొలి మ్యాచ్ ముంబై వర్సెస్ ఆర్సీబీ

క్రికెట్ అభిమానుల కోసం ఓ క్రేజ్ న్యూస్ వచ్చింది. పురుషుల ఐపీఎల్ తరహాలో మహిళల కోసం నిర్వహిస్తున్న డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్‌కు సంబంధించిన షెడ్యూల్ రిలీజ్ అయింది. ఈ సీజన్ తొలి మ్యాచ్ జనవరి 14 జరగనుంది. ఫిబ్రవరి 7న ఈ లీగ్ ముగియనుంది. ఈ సీజన్‌లో మొత్తం 22 మ్యాచ్‌లు జరగనున్నాయి. అన్నీ కూడా ముంబై, వడోదర వేదిక లుగా జరగనున్నాయి. ఈ రెండు వేదికలు చెరో 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. డబ్ల్యూపీఎల్ 2027 సీజన్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ తలపడతాయి. ఈ మ్యాచ్ వడోదర వేదికగా జరుగనుంది. రెండో మ్యాచ్ జనవరి 15న యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య జరగనుంది. ఫిబ్రవరి 5, 7 తేదీల్లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ పోరుకు ముంబై ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఎడిషన్ మ్యాచ్‌లన్నీ రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతాయి. డబ్ల్యూపీఎల్‌లో మొత్తం ఐదు జట్లు పోటీ పడుతున్నాయి. కాగా, డబ్ల్యూపీఎల్ 2026 ఎడిషన్ ఫైనల్లో ఆర్సీబీ-ఢిల్లీ క్యాపిటల్స్ తలపడిన విషయం తెలిసిందే. ఉత్కంఠగా సాగిన ఆ తుదిపోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించిన ఆర్సీబీ.. రెండో సారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన 41 బంతుల్లో చేసిన 87 పరుగులు చేసి.. ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్‌ను విచిత్రమైన శాపం వెంటాడుతోంది. వరుసగా నాలుగో ఎడిషన్ ఫైనల్లోనూ ఓడిన ఢిల్లీ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2026లో జెమీమా రోడ్రిగ్స్ ఢిల్లీ జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించి తమ జట్టును ఫైనల్స్‌కు చేర్చింది. కానీ ట్రోఫీని మాత్రం అందుకోలేకపోయింది.

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 6 నవంబరు 2026

రామాయణం చూసిన రాజమౌళి



నితీష్ తివారి దర్శకత్వంలో ఎంతో ప్రతిష్ఠాకంగా నమిత మల్హోత్రా నిర్మించిన రామాయణ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమాను వీక్షించిన దర్శక ధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. సినిమా విజువల్స్, నటీనటుల అభినయంపై తన అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, రావణుడిగా యశ్,సీతగా సాయి పల్లవి నటన తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. "రామాయణం సినిమా స్థాయి, వెండితెరపై ఆవిష్కరించిన విజువల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి.వనవాస ఘట్టంనుంచి రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటన ఎంతో చక్కగా వైభవంగా ఉంది.రావణుడిగా యశ్ గంభీరమైన నటనతో అలరించారు. సీతగా సాయిపల్లవి ఎంతో హుందాగా, అందంగా కనిపించారు. ముఖ్యంగా ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ సన్నివేశాలను ఎంతగానో ఆస్వాదించాను. సినిమాలోని ప్రతి ఘట్టం నాకు నచ్చింది. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన, భారీ విజన్‌ను అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీతో పాటు చిత్రబృందం మొత్తానికి నా హృదయ పూర్వక అభినందనలు' అని ట్వీట్లో పేర్కొన్నారు. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్, కాజల్, రకుల్ కీలకపాత్రలు పోషించారు. రెండు పార్టులుగా తెరకెక్కిన ఈ చిత్రం మొదటి భాగం ఈ గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది.


రాధికా ఆప్టేపై రెజీనా ఫైర్



టాలీవుడ్ కల్చర్ గురించి, సీనియర్ హీరోల ప్రవర్తన గురించి కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో విశేష ప్రచారం జరుగుతోంది. ఆ మధ్య జాన్వీ కపూర్, తాజాగా రాధికా ఆప్టే చేసిన వ్యాఖ్యలను సమర్థించే వారు కొందరున్నట్టుగానే విమర్శించే వారూ ఎంతో మంది ఉన్నారు. చిత్రం ఏమంటే ఇటు జాన్వీ, అటు రాధికా ఆప్టే ఇద్దరి మాటలు గురివింద గింజను గుర్తు చేస్తున్నాయని అందరూ అంటున్నారు. ఉత్తరాది చిత్రాలలో అసభ్యకర సన్నివేశాలు, పాటలలో నటించినప్పు డులేని అభ్యంతరం 'పెద్ది' సినిమాలోని సన్నివేశాలలో నటించి నప్పుడు వచ్చిందా? అని కొందరు విమర్శిస్తున్నారు. ఇక రాధికా ఆప్టేను అయితే... విమర్శిస్తున్న వాళ్ళు కోకొల్లలు. నందమూరి బాలకృష్ణ సరసన హీరోయిన్‌గా నటించాలని ఎంతో మంది కోరుకుంటారని, పైగా 'లెజెండ్' లాంటి సూపర్ హిట్ మూవీలో అవకాశం రావడం అనేది అదృష్టంగా భావిస్తారు. అందులో రాధికా ఆప్టే పాత్రకు ఎంతో గౌరవం కూడా ఉంటుంది. అలాం టి పాత్రను పోషించి కూడా 'పెద్ద వయసు హీరోతో రొమాన్స్ చేయడం ఇబ్బంది కరం' అని ఆమె చేసిన వ్యాఖ్యలను తప్పు పడుతున్నారు. ప్రముఖ నటి రెజీనా కసండ్రా సైతం ఉత్తరాది భామలు చేసిన వ్యాఖ్యలపై స్పందించింది. తాను మహిళా పక్షపాతినని చెబుతూనే 'ఎవరికైనా ఏదైనా సినిమాలో నటిస్తున్న సమయంలో అభ్యంతరంగా అనిపిస్తే వెంటనే ఆ ప్రాజెక్ట్ నుంచి వాకౌట్ చేయవచ్చని, అలా చేయకుండా ఆ తర్వాత విమర్శిం చడం సబబు కాద'ని తెలిపింది. ఉత్తరాది, దక్షిణాది అంటూ సినిమా రంగాన్ని రెండుగా చీల్చడం కూడా సబబు కాదని తెలి పింది. సినిమా రంగాన్ని ఇలా విడగొట్టి మాట్లాడటం కరెక్ట్ కాదని రెజీనా స్పష్టం చేసింది. రాధికా ఆప్టే వ్యాఖ్యలను పాయల్ రాజ్ పుత్ సైతం తీవ్రంగా ఖండించింది.

బాలయ్య దాదా వాయిదా పడనుందా?

వీరసింహా రెడ్డి వంటి హిట్ తర్వాత నటసింహం నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న మూవీ దాదా. 'వృద్ధి సినిమాస్' బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలయ్య సరసన కాజల్ అగర్వాల్ నటిస్తుండగా.. మంచు మనోజ్ ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఒక పవర్‌ఫుల్ యాక్షన్ అండ్ స్టైలిష్ గ్యాం గ్‌స్టర్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో, ముఖ్యంగా బాలయ్య ఫ్యాన్స్‌లో భారీ అంచనాలే ఉన్నాయి. అయితే, ఈ సినిమా విడుదలకు సంబంధించి ప్రస్తుతం ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో ఒక హాట్ టాపిక్ వైరల్ అవుతోంది. ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న రిలీజ్ చేయాలని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. కానీ, షూటింగ్ సమయంలో బాలకృష్ణకు చిన్న గాయం కావడం, ఆ తర్వాత సర్జరీ జరగడంతో ఆయన కొద్ది రోజులు విశ్రాంతి తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ సెట్స్‌లోకి వచ్చి బాలయ్య ఎనర్జిటిక్‌గా షూటింగ్‌లో పాల్గొంటున్నప్పటికీ.. అనుకున్న వేగంతో పనులు సాధ్యం కావడం లేదట. షూటింగ్ పూర్తయిన తర్వాత పోస్ట్ ప్రొడక్షన్, గ్రాఫిక్స్ పనులకు చాలా తక్కువ సమయం మిగిలి ఉందని, ఈ డెడ్‌లైన్‌లోగా అన్ని పనులు పూర్తి చేయడం యూనిట్‌కు కత్తి మీద సాములా మారిందని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలోనే మేకర్స్ ఆలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతోంది. తొందరపడి క్రిస్మస్ రేసులో సినిమాను విడుదల చేసి క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని.. కాస్త సమయం తీసుకుని వచ్చే ఏడాది సమ్మర్ బరిలో దింపితే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నారట. అయితే మరోవైపు ఈ వాయిదా వార్తలన్నీ కేవలం రూమర్లే అని కూడా ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారట మేకర్స్. ఆ సందర్భంలోనే రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇస్తూ.. డిసెంబర్ 24నే సినిమా వస్తుందని మరోసారి నొక్కి వక్కాణించే అవకాశం ఉందని అంటున్నారు. డిసెంబర్‌లోనే సినిమాను విడుదల చేయడానికి బలమైన కారణాలు కూడా లేక పోలేదట. జనవరి నెల ఇప్పటికే సినిమాలతో ప్యాక్ అయిపోయింది. ఇక ఫిబ్రవరి నెల స్టార్ హీరోల సినిమాలకు అంతగా కలిసిరాదంటారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో వరుసగా 'ఫౌజీ', 'వారణాసి' లాంటి పాన్ ఇండియా ప్రాజెక్టులు బరిలో ఉన్నాయి. దీంతో డిసెంబర్‌లోనే రావడమే మంచిదని 'దాదా' టీమ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక డిసెంబర్ 24నే



'దాదా'తోపాటు అక్కినేని నాగార్జున 'కింగ్ 100', బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ నటిస్తున్న 'కింగ్' సినిమా కూడా విడుదల కానున్నాయి. ఒకవేళ 'దాదా' కనుక వాయిదా పడితే ఈ రెండు సినిమాలకు కలిసివచ్చే ఛాన్స్ ఉంది. ప్రస్తుతానికైతే ఇదంతా ఇండస్ట్రీలో జరుగుతున్న ప్రచారమే తప్ప.. చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. డిసెంబర్ 24నే అఫీషియల్ డేట్ అని మేకర్స్ చెప్తున్నారు. త్వరలో రాబోయే ఫస్ట్ సింగిల్ అప్‌డేట్‌తో ఈ కన్ఫ్యూజన్‌కు పూర్తి తెరపడే అవకాశం ఉంది.

హీరో టు విలన్



టాలీవుడ్‌లో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా స్వశక్తితో విలక్షణ పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటున్న నటుడు వివేక్ చేపూరి. 2019లో వచ్చిన సెన్సేషనల్ చిత్రం 'ఫలక్‌నుమా దాస్'లో 'రవి' అనే పవర్‌ఫుల్ నెగెటివ్ రోల్‌లో విశ్వక్‌సేన్‌కు ధీటుగా నటించి సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించిన వివేక్.. సరిగ్గా ఏడేళ్ల తర్వాత మళ్లీ విశ్వక్ సేన్ దర్శకత్వంలో వచ్చిన లేటెస్ట్ క్రేజీ చిత్రం 'కల్ట్'లో 'ఇషాన్' అనే పాత్రలో తనదైన విలనిజంతో ప్రేక్షకులను భయపెట్టడమే కాకుండా,తన అద్భుతమైన పెర్ఫార్మెన్స్‌తో ఇండస్ట్రీలో ప్రత్యేక మార్క్‌క్రియేట్ చేశారు. ప్రస్తుతం'కల్ట్' చిత్రంలోని ఇషాన్ క్యారెక్టర్‌కు,వివేక్ నటనకు థియేటర్లలో ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ దక్కుతోంది. సోషల్ మీడియా వేదికగా ఆయన పాత్రకు సంబంధించిన సీన్లు, డైలాగ్స్‌తో నెటిజన్లు రకరకాల రీల్స్,ఫ్యాన్ ఎడిట్స్ చేస్తూ వైరల్ చేస్తున్నారు. ప్రేక్షకులు చూపిస్తున్న ఈ అనూహ్యమైన ఆదరణకు వివేక్ చేపూరి సైతం ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తన సత్తా ఏంటో నిరూపించుకున్న ఈ టాలెంటెడ్ యాక్టర్.. ఇప్పుడు ఏకంగా హీరోగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అవును, వివేక్ చేపూరి హీరోగా పరిచయ మవుతూ ఒక సరికొత్త ద్విభాషా చిత్రానికి శ్రీకారం చుట్టారు. దర్శకుడు టి.శరత్ చంద్ర దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపుదిద్దుకోనున్న చిత్రంతో వివేక్ చేపూరి.. హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమాను అత్యంత భారీ హంగులతో మేకర్స్ రెడీ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ప్రతిభావంతుడైన సినిమాటోగ్రాఫర్ ప్రియేష్ గురుస్వామి డీవోపీగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించి మొదటి అప్‌డేట్‌గా నవంబర్ నెలలోనే ఒక అదిరిపోయే స్పెషల్ గ్లింప్స్ లేదా టీజర్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రా అండ్ ఇంటెన్స్ రోల్స్‌తో మెప్పించిన వివేక్ చేపూరి.. ఈ బైలింగ్వల్ మూవీతో హీరోగా ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను ఈ నెలలోనే మేకర్స్ తెలియజేయనున్నారు.

సితార చేతికి ఓం మూవీ

నేషనల్ అవార్డు విన్నర్ ధనుష్, మలయాళ దిగ్గజ నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'ఓమ్: చాప్టర్ 1- రుధిరం: ది బ్లడ్ వుడ్'.అమరన్ లాంటిభారీ బ్లాక్‌బస్టర్ తరువాత రాజ్‌కుమార్ పెరియసామి కథను అందిస్తూ ఈచిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇక ఈ సినిమాని వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో ధనుష్ సరసన శ్రీలీల నటించగా.. లేడీ పవర్ స్టార్ సాయి పల్లవి కీలకపాత్రలో కనిపించనుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్స్, వీడియోస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమాకి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాని ఊపేస్తోంది.



ఈ ప్రతిష్టాత్మక చిత్రం తెలుగు హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సొంతం చేసుకుంది.నిర్మాత నాగవంశీ గురించి తెలుగుప్రేక్షకులకు ప్రత్యేకంగాచెప్పాల్సిన అవసరంలేదు. ఆయన సినిమా తీసుకుంటే.. ప్రమోషన్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో అందరికీ తెల్సిందే. గతంలో లోకా:చాప్టర్ 1తో మంచి విజయాన్ని అందుకున్న నాగవంశీ ఈ ఏడాది జైలర్ 2తో రికార్డులను బద్దలుకొట్టాడు.జైలర్ 2కోసం ఆయన ఆదర్శ కుటుంబంని కూడా పక్కన పెట్టినట్లు టాక్ నడిచింది. తెలుగులో నిర్మాతగా ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయినా.. హిట్ సినిమాలను పంపిణీ చేసి మంచి విజయాలనే అందుకుంటున్నాడు. మొన్న జైలర్‌తో హిట్ అందుకున్న నాగవంశీ ఇప్పుడు ఓమ్‌ని రెండుతెలుగురాష్ట్రాల్లో రిలీజ్ చేయనున్నాడు.ఇప్పటికే ధనుష్- మమ్ముట్టి కాంబినేషన్‌కు తోడు సాయి పల్లవి, శ్రీలీల కాంబో చేరడంతో దక్షిణ భారత దేశ వ్యాప్తంగా ఈప్రాజెక్ట్‌పై గ్లోబల్ హైప్ నెలకొంది. దానికితోడు సక్సెస్‌ఫుల్‌బ్యానర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పంపిణీ బాధ్యతలు చేపడుతుండటంతో సినిమాపై హైప్ మరింత ఎక్కువ అయ్యింది. ఇప్పటివరకు ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టని టీమ్.. ఇకనుంచి నాగవంశీ చొరవతో తెలుగులో నెక్ట్స్ లెవెల్ ప్రమోషన్స్ కూడా చేయనుంది. మరి మామ రజనీకాంత్‌తో హిట్‌కొట్టిన నాగవంశీ ఇప్పుడుఅల్లుడు ధనుష్‌తో ఎలాంటిహిట్ అందుకొంటాడో చూడాలంటే నవంబర్ 20న ఓమ్ రిలీజ్ అయ్యేవరకు ఆగాల్సిందే.